# 31 వ అధ్యాయము

# ఆత్మీయ యుద్ధమును గూర్చి ఆధునిక ఇతిహాసములు - రెండవ భాగము

ఈ అధ్యాయంలో సాతాను మరియు ఆత్మీయ పోరాటము గురించి బాగా ప్రాచుర్యం పొందిన తప్పుడు బోధను గురించి ధ్యానించటం కొనసాగిద్దాం. ముగింపులో ఆత్మీయ పోరాటం గురించి లేఖనములు వాస్తవంగా ఏమి చెబుతున్నాయి, వాటిని ప్రతి విశ్వాసి ఏవిధంగా ఆచరించవలయును అన్నది మనం తెలుసుకుంటాం.

## ఇతిహాసపు కథ-5: "ఆత్మీయ పోరాటము ద్వారా వాతావరణంలోని దురాత్మల దుర్గములను కూల్చివేయవచ్చును."

లేఖనము ప్రకారము చూస్తే, భూతలము పైన వాతావరణములో స్థిరనివాసము చేసికొని చీకటి రాజ్యాన్ని ఏలుటలో సాతానుకు సహకరిస్తున్న దురాత్మల సమూహాన్ని సాతానుడు పాలిస్తున్నాడు అన్నదాంట్లో సందేహమే లేదు. ఆవిధంగా ఆ దురాత్మలు ఒక "ప్రాంతీయ సేన" గా ఏర్పడి భూతలము మీద ఆయా ప్రదేశాలను ఏలుతూవుంటాయి అన్న విషయం బైబిలులో కూడా చెప్పబడింది (దానియేలు 10:13, 20-21; మార్కు 5:9-10). ప్రజలలో ఉన్న దురాత్మలను వెళ్ళగొట్టే అధికారం క్రైస్తవులు కలిగివున్నారు అనియు మరియు సాతానుడిని ఎదిరించే బాధ్యత వారికున్నదనియు వాక్యానుసారముగా చెప్పబడింది (మార్కు 16:17; యాకోబు 4:7; 1 పేతురు 5:8-9 చూడుము). అయితే క్రైస్తవులు పట్టణములను ఆవరించి ఉన్న దురాత్మలను వెళ్ళగొట్టగలరా? ఈ ప్రశ్నకు జవాబు, వారు ఆ పని చేయలేరు, అసలు దానికొరకు ప్రయత్నించుటమన్నది సమయం వృధా చేసుకోవటమే అని చెప్పవచ్చును.

ప్రజల్లో ఉన్న దురాత్మలను వెళ్ళగొట్టినంత మాత్రం చేత, పట్టణమును ఆవరించి ఉన్న దురాత్మలను వెళ్ళగొట్టగలము అని మనం ఎట్టి పరిస్థితిలోను అనుకోకూడదు. మనుష్యుల్లో ఉన్న దురాత్మలను వెళ్ళగొట్టిన ఉదాహరణలు అపొస్తలుల కార్యములు మరియు సువార్త గ్రంథములలో అనేకం చెప్పబడ్డాయి, కాని ఈ భూతలం మీద ఉన్న దురాత్మలను లేదా పట్టణములపై ఉన్న దురాత్మలను వెళ్ళగొట్టిన ఉదాహరణలు ఒక్కటైనా ఈ గ్రంథములలో చెప్పబడివుండటం మీరు చూశారా? మీరు వాటిని కనుగొనలేరు, ఎందుకంటే అటువంటి ఉదాహరణ ఎక్కడా వ్రాయబడివుండలేదు. ఆకాశమండలములోని దురాత్మలను కూలద్రోయటం మన బాధ్యత అనెడి సూచన ఒక్కటైనను పత్రికలలో ఎక్కడైనా చెప్పబడివుండటం మీరు చూశారా? లేదు, ఎందుచేతనంటే, పత్రికల్లో ఎక్కడా అటువంటివి చెప్పబడలేదు. అందువలన, ఆకాశమండలములోని దురాత్మలకు వ్యతిరేకముగా "ఆత్మీయ పోరాటము" సలపవలెను అని

విశ్వసించుటకు బైబిలు ఆధారాలు ఏవియూ లేవు.

## ఉపమానపు లోతులోనికి వెళ్ళుట

దేవుని ఆలోచన ఏమిటో పూర్తిగా ఎరుగకుండానే కేవలము పైపైన వాక్యములు చదివి అందలి రూపకాలంకార భాషను పూర్తిగా అర్థము చేసుకొనకపోవుటయే క్రైస్తవులు చేయు పొరపాట్లు. రూపకాలంకార భాషను తప్పుగా అర్థము చేసుకొనెడి ఒక ఉదాహరణ పౌలు ఉపయోగించిన పదజాలములో 'సాతాను దుర్గములను కూలద్రోయుట' అనుదానిని ఎంత మంది సవ్యముగా అర్థము చేసుకొందురు.

మేము శరీరధారులమై నడుచుకొనుచున్నను శరీరప్రకారము యుద్ధము చేయము. మా యుద్ధోపకరణములు శరీరసంబంధమైనవి కావుగాని, దేవునియెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలముకలవై యున్నవి. మేము వితర్కములను, దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి మీరు సంపూర్ణ విధేయతను కనుపరచినప్పుడు సమస్తమైన అవిధేయతకు ప్రతిదండనచేయ సిద్ధపడి యున్నాము (2 కొరింథీ 10:3-6).

***కింగ్ జేమ్స్ బైబిల్*** ప్రకారము "మేము తప్పుడు ప్రచారములను నాశనము చేయుచున్నాము" అను దానికి బదులుగా "దుర్గములను కూలద్రోయుచున్నాము" అని తర్జుమా చేయబడెను. ఈ రూపకాలంకార భాష పదప్రయోగము మీదనే "ఆత్మీయ పోరాటము" అను దానికి సంబంధించిన వేదాంత పరమైన తలంపులు దానిని బలపర్చుటకు నిర్మితమైనవి. ఆకాశమండలమందలి దురాత్మల సమూహములు వాటి యొక్క ఉనికి పట్టయిన 'దుర్గములను కూల ద్రోయుట' అను యుద్ధపరమైన భాషను ఉపయోగించవలసి వచ్చెను. అయితే న్యూ అమెరికన్ స్టాండర్డ్ బైబిల్ తర్జుమా ప్రకారము పౌలు యొక్క మాటల భావములో ఆకాశమండలమందున్న దురాత్మలను గూర్చి మాట్లాడక మనుష్యుల మనస్సులలో ఉన్న మోసకరమైన అబద్ధ తలంపులు అను దుర్గములును గూర్చి పౌలు వ్రాయుచున్నాడు.ఉన్నత స్థలములలో ఉన్న దురాత్మలను గూర్చి కాక సాతాను యొక్క దుష్ ప్రచారములను నాశనము చేయుటను గూర్చి పౌలు మాట్లాడుచున్నాడు.

ఈ సందర్భములో పౌలు స్పష్టముగా తెలియజేయునది ఏమనగా దేవుని జ్ఞానమునకు వ్యతిరేకముగా ఉన్నత స్థలములో వ్యాపించి ఉన్న దుష్ట ప్రచారములను నాశనము చేయుచు ప్రతి ఆలోచనను చెరపట్టి మేము క్రీస్తుకు లోబర్చుచున్నామని పౌలు వ్రాసెను. సాతాను అబద్ధములను, మోసములను నమ్మిన అనేకమంది జనుల మనస్సులలో ఉన్న వాటన్నిటికి వ్యతిరేకముగా మనము పోరాటము సల్పుచున్నాము గనుక మనము యుద్ధ రంగమందు ఉన్నాము అని పౌలు పేర్కొనుచూ యుద్ధ సంబంధమైన భాషాపదములను ఉపయోగించుచున్నాడు. ఈ పోరాటములో మనము ఉపయోగించు యుద్ధాయుధము 'సత్యము' అందుచేతనే మనము సర్వలోకములోనికి వెళ్ళి ఈ సత్యసువార్తను ప్రకటించునట్లు అజ్ఞాపించబడితిమి. శత్రువైన అపవాది యొక్క సరిహద్దులను దాటుకుంటూ ప్రజలను చెరలో

నుండి విడుదల చేయు ఈ సువార్త సందేశముతో అబద్ధములను ఇటుకలతో మోసము అను కట్టుడు సిమెంటుతో కట్టబడిన దుర్గములను మనము కూలద్రోయుచున్నాము.

## దేవుడిచ్చు సర్వాంగ కవచము

ఎఫెసీ 6:10-17లో పౌలు వ్రాసిన వాక్య భాగము తరచుగా అపార్థము చేయబడుచున్నది. దేవుడిచ్చు సర్వాంగ కవచము మనము ధరించుకొనవలసిన బాధ్యత మన మీద ఉన్నదని పౌలు ఈ వాక్య భాగమందు వ్రాసియున్నాడు. సాతాను వాని యొక్క దురాత్మలతో క్రైస్తవులముగా మనము పోరాటము సలుపవలసి యున్నదని ఈ వాక్య భాగమందు స్పష్టము చేయబడి ఉన్నది. పట్టణములను ఆవరించి యున్న దుష్టాత్మల నివాస స్థలములను కూలద్రోయుటను గూర్చి ఇందులో వ్రాయబడి యుండలేదు. ఈ వాక్య భాగమును మనము లోతుగా ఆలోచించిన యెడల క్రైస్తవ విశ్వాసులు వ్యక్తిగతముగా దేవుని వాక్య సత్యమును తమ జీవితములకు అన్వయించుకొనుచు వ్యక్తిగతముగా సాతాను యొక్క దుష్ట ప్రణాళికలను ఎదిరించవలసి యున్నదని పౌలు ప్రాముఖ్యముగా వ్రాయుచున్నాడు.

ఈ ప్రత్యేకమైన వాక్య భాగము మనము చదువుచున్నప్పుడు రూపకాలంకార భాష విధానమును కూడా మనము గమనించగలము. వారి శరీరములపై భౌతికముగా ధరించవలసిన సర్వాంగ కవచమును గూర్చి అక్షరానుసారముగా పౌలు వ్రాయుచుండుట లేదు. ఈ సర్వాంగ కవచమును గూర్చి అలంకార ప్రాయమైన భాషను పౌలు నిలువరించి తమ్మును తాము కాపాడుకొనుటకు క్రైస్తవులు ఉపయోగించుకోవలసిన వాక్య సత్యమును ఈ సర్వాంగ కవచములోని ఆయా భాగములను తెలియచేయుచున్నది తెలుసుకొనుట ద్వారాను, నమ్ముట ద్వారాను, దేవుని వాక్య ప్రకారము ప్రవర్తించుట ద్వారాను దేవుడిచ్చు ఈ సర్వాంగ కవచమును వస్త్రము వలెధరించి తమ్మును తాము కాపాడుకొనుటకు అలంకార భాషా విధానములో పౌలు వ్రాయుచున్నాడు.

ఎఫెసీల పత్రికలో వచనము వెంబడి వచనము ఈ భాగమందు మనము పరిశీలన చేసి ఈ వాక్య భాగము ద్వారా పౌలు మనతో ***దేనిని గూర్చి ప్రాముఖ్యముగా మాట్లాడుచున్నాడో*** వ్యక్తిగతముగా మనము దానిని అర్థము చేసుకొనవలెను.

## మన ఆత్మీయ బలము యొక్క మూలము

"తుదకు ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి ఆయన యందు బలవంతులై యుండుడి" (ఎఫెసీ 6:10). మన స్వశక్తి మీద మనము ఆధారపడుట ముఖ్యము కాదు గాని దేవుని శక్తి మీద మనము ఆనుకొని యుండుట ఎంతో ప్రాముఖ్యమైనది. పౌలు దాని తర్వాత వచ్చు వచనములో మరింత స్పష్టముగా తెలియచేయుచున్నాడు. "దేవుడిచ్చు సర్వాంగ కవచము ధరించుకొనుడి" (ఎఫెసీ 6:11). ఇది ***దేవుని*** సర్వాంగ కవచము మనది కాదు. అనగా దేవుడు తన్ను కాపాడుకొనుటకు తానే ఒక సర్వాంగ కవచము ధరించుకొనువాడు అని అర్థము కాదు. అయితే తన యందు భక్తిగల విశ్వాసుల కొరకు దేవుడు సిద్ధము చేసి ఇచ్చిన మన కొరకైన సర్వాంగ కవచము.

దేవుడు మనకు ఇచ్చిన ఈ సర్వాంగ కవచము యొక్క అవసరత మనకేమిటి?

జవాబుగా "మీరు అపవాది తంత్రములను ఎదురించునట్లు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి" (ఎఫెసీ 6:11). మనలను మనము కాపాడుకొనుటకు మరియు ఎదిరించుటకు ఈ సర్వాంగ కవచము మనకు అవసరమైయున్నది.

అంతేగాని పట్టణములను ఆవరించి యున్న సాతాను స్థావరములను కూలద్రోయుటకు మనము దుందుడుకు చర్యగా ఈ సర్వాంగ కవచమును ఉపయోగించుట కొరకు కాదు గాని సాతాను యొక్క దుష్ట ప్రణాళికలన్నిటికి వ్యతిరేకముగా ఎదురించి నిలుచుట కొరకే ఈ సర్వాంగ కవచము ఇవ్వబడియున్నది.

> ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశమండల మందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము (ఎఫెసీ 6:12).

ఇప్పుడు మనకు చాలా స్పష్టముగా కనిపించునది ఏమనగా పదార్థ సంబంధమైన భౌతిక పరమైన యుద్ధమును గూర్చి పౌలు మాట్లాడుట లేదు గాని వ్యక్తిగతముగా మనము వివిధ స్థాయిలలో ఉన్న దుష్టాత్మల యొక్క చెడు ప్రణాళికలకు వ్యతిరేకముగా మనము పోరాడుచున్నాము. పౌలు వివరించునట్లు ఈ దుష్టాత్మల తరగతులు క్రింది స్థాయి నుండి హెచ్చు స్థాయి వరకు ఈ విధముగా ఉన్నవి. అట్టడుగున "ప్రధానులు" అట్టడుగు స్థాయిలో ఉండు దురాత్మలను, "ఆకాశ మండల మందున్న దురాత్మల సమూహము" అత్యధిక తరగతికి చెందిన మిక్కిలి ఎత్తైన హెచ్చైన స్థాయిలో ఉండు దురాత్మలు.

ఎట్లు ఈ ఆత్మలతో పోరాటము మనము చేయగలము? లేక ఈ ప్రశ్న ఈ విధముగా అర్థము చేసుకొనవలెను. ఈ ఆత్మలు ఏవిధముగా మనపై దాడి చేయును? మొట్టమొదట శోధనలు దుష్ట తలంపులు సలహాలు, సూచనలు దేవుని చిత్తమునకును, ఆయన వాక్యమునకును వ్యతిరేకమైన అభిప్రాయములతో ఒక వ్యక్తి యొక్క ఆత్మీయ జీవితం మీద మొట్టమొదట దాడి చేయును. అయితే మన స్వరక్షణ కొరకు దేవుని వాక్యమును తెలుసుకొనుట, నమ్ముట ఆ వాక్యమునకు విధేయులమగుట ద్వారానే మనము అపవాది తంత్రములను ఎదిరించగలము.

> అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును సమస్తము నెరవేర్చిన వారై నిలువబడుటకును శక్తిమంతుల మగునట్లును దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించు కొనుడి (ఎఫెసీ 6:13).

మరియొకసారి గమనింతము పౌలు యొక్క ఉద్దేశ్యమేమనగా అపవాది తంత్రములను మనమీద చేయు దాడులను ఎదిరించి ధైర్యముగా సాతానుకు వ్యతిరేకముగా నిలువబడుటకును మనలను సంసిద్ధులనుగా చేయుటయే. అంతేగాని మనమే దూకుడుగా ముందుకు వెళ్ళి సాతానుపై దాడి సల్పి వాతావరణములోని సాతాను యొక్క దుర్గములను కూలద్రోయుటకు మనలను సంసిద్ధులనుగా చేయుట పౌలు ఉద్దేశ్యము కాదు. మూడు

పర్యాయములు మీరు స్థిరముగా నిలిచియుండుడి అని పౌలు ఈ భాగములో వ్రాసి యున్నాడు. కాబట్టి మనమే యుద్ధము చేయుటకు ముందుకు ఉరికే వారముగా కాకుండా పోరాటమును మనలను మనము కాపుదల చేసుకొనుటయే మన యొక్క స్థానము.

## మనలను కాపుదల చేసుకొను సత్యము

ఏలాగనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని (ఎఫెసీ 6:14)

మన సర్వాంగ కవచములో ప్రాముఖ్యమైన భాగము 'సత్యము'. సత్యమనగా నేమి? తండ్రియైన దేవునితో యేసు చెప్పినది "నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17) అబద్ధికుడైన సాతానుకు వ్యతిరేకముగా ధీరత్వముతో నిలుచుటకు సత్యము మనము ఎరుగనియెడల విజయవంతముగా నిలుచుండలేము. సత్యము ఎరిగిన వారమైతే అపవాది అబద్ధములను మనము ఎదిరించగలము. అరణ్యమందు శోధన కాలమున యేసు అపవాది సూచించు సలహాలన్నిటిని ఎదుర్కొని బహు రమ్యమైన రీతిగా దేవుని వాక్యము ఆధారము చేసుకొని అధిగమించుట ఆచరణాత్మకముగా చేసి చూపెను. లేఖనమందు ఈలాగు వ్రాయబడియున్నది.

నీతియను మైమరువు తొడుగుకొని (ఎఫెసీ 6:14)

క్రైస్తవులమైన మనము రెండు విధములైన నీతిని ఎరిగియున్నాము. మొదటిది క్రీస్తు నందలి నీతి మనకు బహుమానముగా ఇవ్వబడినది (2 కొరింథీ 5:21). యేసు క్రీస్తు నందు విశ్వాసముంచు ప్రతి వాడును క్రీస్తు యొక్క నీతి అపాదించబడి నీతిలో నిలిచియుండును. ఎందుకనగా యేసు తానే మన పాపములను సిలువపై భరించెను. సాతాను యొక్క సర్వాధికారము లేక పరిపాలన నుండి నీతి యందు నిలిచి యుండుట వలన మనము విడుదల పొంది యున్నాము.

రెండవది, నీతిని అనుసరించి మనము జీవించుచుండిన యెడల యేసు ఆజ్ఞకు లోబడి పౌలు మనస్సులో ఉన్న ప్రకారము అది ఒక మయిమరువు రొమ్మున ధరించుకొను కవచము వలె ఉండును. క్రీస్తుకు విధేయులమై సాతానుకు ఏ విధమైన స్థానము మన జీవితములలో ఇవ్వక నీతి అను మయిమరువు లేక కవచము మనలను కాపాడును (ఎఫెసీ 4:26, 27).

## పాదములకు సువార్త అను పాదరక్షలను ధరించి దృఢముగా నిలిచియుండుట

పాదములకు సమాధాన సువార్తవలనైన సిద్ధమనస్సను జోడు ధ
తొడుగుకొని నిలువబడుడి (ఎఫెసీ 6:15).

తెలుసుకొనుట, నమ్ముట, మరియు సువార్త సత్యము అనుసరించి పనిచేయుట వలన మనము స్థిరముగా నిలిచియుండి సాతాను తంత్రములన్నిటిని ఎదుర్కొనగలము. రోమీయ సైనికులు ధరించు పాదరక్షలు అడుగు భాగమున బలమైన బుడుపుల వంటివి ఉండుట

వలన యుద్ధ రంగమందు వారు తొట్రిల్లకుండా దృఢముగా నిలవబడి ఉండుటకు సహాయపడును. యేసు మనకు ప్రభువై యుండగా మనము కూడా సాతాను యొక్క అబద్ధములన్నిటికి దృఢముగా నిలిచియుందుము.

> దీనితో పాటు విశ్వాసమను డాలు సహాయము చేత సాతాను యొక్క అగ్ని బాణములన్నిటిని ఆర్పివేయుటకు మనము శక్తిమంతులగుదుము (ఎఫెసీ 6:16).

మనలను మనము సంరక్షించుకొను పరిస్థితిని ఇచ్చుట పౌలు ఎంత ప్రాముఖ్యముగా నొక్కి వక్కాణించుచున్నాడో గమనింతుము. పట్టణములను ఆవరించి యున్న దురాత్మల స్థావరములను కూలగొట్టుటను గూర్చి పౌలు ఇక్కడ మాట్లాడుచుండుట లేదు. సాతాను ఆబద్ధములకు వ్యతిరేకముగా దేవుని వాక్యమందు గల మన విశ్వాసమును ఉపయోగించుటను గూర్చి మాట్లాడుచున్నాడు. దేవుడు ఏమిచెప్పియున్నాడో దానిని మనము నమ్మి దాని ప్రకారము నడుచుకొనిన యెడల సాతాను అబద్ధము నుండి మనలను మనము కాచుకొనుటకు ఒక డాలు వలె ఉపయోగ పడును. విశ్వాస పరీక్షకు సాతాను అగ్ని బాణములను ఉపయోగించును అను అలంకార భాషా పదములు ఇక్కడ వాడబడును.

## దేవుని వాక్యము - మన ఆత్మ ఖడ్గము

> రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి (ఎఫెసీ 6:17).

రక్షణ అను దాని గురించి బైబిలు వివరించుచు సాతాను యొక్క చెరనుండి మనము పొందిన విడుదలను దీనిలో కలిసియున్నది. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొలస్స 1:13). సాతాను యొక్క అబద్ధములను నమ్మకుండా మన మనస్సులను కాపాడి భద్రపరచునట్లు ఈ శిరస్త్రాణము మనకున్నదని మనము ఎరుగవలెను. ఎందుకనగా మనమింకను సాతాను పరిపాలించు ప్రదేశములోనే యున్నాము. అయినను మన యజమానుడు యేసుక్రీస్తే గాని, సాతాను కాదు.

దీనితోపాటు వాక్యమను "ఆత్మ ఖడ్గము" మనము తీసుకొనవలసియున్నాము. దేవుని వాక్యమునకు అలంకార సూచకముగా ఈ పదమును పౌలు ఉపయోగించుచున్నాడు. ఇంతకు ముందు నేను వివరించునట్లు బహు ప్రాముఖ్యతతో, నిపుణతతో ఈ ఆత్మీయ పోరాటమందు, ఈ ఆత్మీయ ఖడ్గమును యేసు ఎట్లు ఉపయోగించియున్నాడో అది మనకు సంపూర్ణమైన మాదిరియై యున్నది. అరణ్యములో సాతాను చేత శోధించబడుచున్నప్పుడు సాతాను యొక్క ప్రతి సూచనకు సూటిగా దేవుని వాక్యమును ఎత్తి చూపుచు యేసు ప్రత్యుత్తరము ఇచ్చెను. ఈ ఆత్మీయ యుద్ధమందు సాతానును మనము ఓడించవలయునంటే దేవుడు చెప్పిన మాట ప్రకారము మనము నమ్మి జరిగించవలెను. లేని యెడల సాతాను యొక్క అబద్ధములలో పడిపోవును.

ఈ "ఆత్మ ఖడ్గమును" యేసు కేవలము తనను తాను **కాపాడుకొనుటకే** ఉపయోగించు కొనువాడని మనము గ్రహించుచున్నాము. కొందరు ఎత్తి చూపునట్లుగా పౌలు సూచించినట్లు ఈ సర్వాంగ కవచము మనలను మనము కాపాడుకొను సాధనముగానే యుండవలెను. అయితే ఈ ఖడ్గము అనునది ఇతరులకు హాని లేక అపాయము కలుగజేయు ఆయుధమై యున్నది. గనుక కొందరు ఒక బలహీనమైన వాదమును ప్రవేశపెట్టి ఎఫెసీ 6:10-12లో ఉన్న వాక్యభాగము మిక్కిలి హెచ్చైన ఆకాశమండల మందున్న దురాత్మల సమూహముల బలమైన "స్థావరములను లేక దుర్గములను కూలద్రోయుటకు" కొరకే తగియున్నదని తమ వాదమును బలపరుచుకొనుటకు ప్రయత్నింతురు.

అయితే పౌలు తన సొంత ఆలోచనలో తేటతెల్లము చేసియున్నాడు. అది ఏమనగా క్రైస్తవులు దేవుని సర్వాంగ కవచమును అపవాది యొక్క తంత్రములు లేక మాయోపాయములను ఎదిరించి స్థిరముగా నిలుచుని యుండి తమ్మును తాము కాపాడుకొను సాధనముగా ఉండునది అని పౌలు తెలియజేసెను. ఖడ్గము అనునది అపాయము లేక హాని కలుగజేయునది అయినప్పటికి అది కూడా కేవలము తనను తాను కాపాడుకొను సాధనమై యున్నది. తన విరోధి పక్షమువాడు తన మీద దాడి చేయునప్పుడు కేవలము తనను తాను కాపాడుకొను సాధనముగానే ఖడ్గమును ఉపయోగించుకొనవలెను.

ఏది ఏమైనను ఈ అలంకార ప్రాయముగా ఉదహరించబడిన సర్వాంగ కవచములోని వివిధ భాగము వాటియొక్క ప్రాముఖ్యత విపరీతముగా అర్థము చేసికొని వాక్యము యొక్క అంతరార్థమును భంగపర్చకూడదు. ఖడ్గమును గూర్చి వాదులాడుట మొదలు పెట్టినప్పుడు దాని స్వభావమును బట్టి అది కాపాడుకొను ఆయుధమా లేక హాని చేయు ఆయుధమా అని వాదులాడుకొనుచు అనవసరముగా మరింత లోతునకు తీసుకొని వెళ్ళి దానిని ముక్కముక్కలుగా విడగొట్టి ఒక సాధారణ అలంకార పదప్రయోగమును పరిశీలనాత్మముగా దానిని అంత లోతుగా చూడనవసరము లేదు.

## "బలవంతుడైన మనుష్యుని బందింపవలెనని" యేసు ఉపదేశించలేదా?

"బలవంతుడైన మనుష్యుని బంధించవలెనని" సువార్తలో మూడు పర్యాయములు యేసు ప్రస్తావించి యున్నాడు. ఈ మూడు సన్నివేశములలో బలవంతుడైన మనుష్యుని బంధించవలెనని యేసు తన అనుచరులకు దానిని అభ్యాసముచేయుడని బోధించలేదు. లేఖనానుసారముగా యేసు ఏమి తన శిష్యులకు బోధించియున్నాడో దానిని చదివి పరిశీలన చేయుదము.

> అప్పుడాయన వారిని తన యొద్దకు పిలిచి, ఉపమానరీతిగా వారితో ఇట్లనెను-సాతాను సాతాను నేలాగు వెళ్ళగొట్టును? ఒక రాజ్యము తనకుతానే విరోధముగా వేరుపడినయెడల, ఆ రాజ్యము నిలువనేరదు. ఒక యిల్లు తనకుతానే విరోధముగా వేరుపడిన యెడల, ఆ యిల్లు నిలువనేరదు. సాతాను తనకు తానే విరోధముగా లేచి వేరుపడిన

యెడల వాడు నిలువ లేక కడతేరును. ***ఒకడు బలవంతుడైనవానిని మొదట బంధించితేనే తప్ప, ఆ బలవంతుని ఇంటజొచ్చి వాని సామగ్రి దోచుకొననేరడు; బంధించిన యెడల వాని యిల్లు దోచుకొనవచ్చును***. సమస్త పాపములును మనుష్యులు చేయు దూషణలన్నియు వారికి క్షమింపబడును గాని, పరిశుద్ధాత్మ విషయము దూషణచేయువాడెప్పుడును క్షమాపణ పొందక నిత్యపాపము చేసినవాడై యుండునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. ఎందుకనగా ఆయన అపవిత్రాత్మ పట్టినవాడని వారు చెప్పిరి (మార్కు 3:23-30).

తన అనుచరులతో యేసు బలవంతుడైన ఒక మనుష్యుని బంధించవలెయును అని బోధించియుండలేదని మనము గ్రహించగలము. యెరూషలేము నుండి వచ్చిన శాస్త్రులు ఆయనపై చేసిన విమర్శలకు స్పష్టముగా వివరించుటకు న్యాయబద్ధమైన తేటయైన అలంకార పోలికను ఆయన జవాబుగా చెప్పియున్నాడు.

దయ్యముల శక్తి వలన ఆయన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని ఆయన మీద వారు నింద మోపిరి. తనకు వ్యతిరేకముగా తానే పని చేసుకొనునటువంటి బుద్ధిహీనుడు సాతాను కాడు అని యేసు జవాబిచ్చినప్పుడు వివేకముతో ఎవరు కూడా యేసు మాటలతో వాదించలేకపోయిరి.

దయ్యములను వెళ్ళగొట్టుటకు యేసు సాతాను శక్తిని ఉపయోగించుకొనక మరి ఏశక్తి వలన ఆయన వాటిని వెళ్ళగొట్టుచున్నాడు? అట్టి శక్తి సాతాను శక్తికి మించిన హెచ్చైన గొప్ప శక్తియై ఉండవలెను. అది కేవలము దేవుని శక్తి, పరిశుద్ధాత్మ యొక్క శక్తియే. ఈ రూపకాలంకార భాషను యేసు ఇక్కడ ఉపయోగించుచు మాట్లాడెను. తన ఆస్థిని లేక సొత్తును కాచుకొను బలమైన మనుష్యుడుగా అతనిని పోల్చెను. ఆ బలమైన మనుష్యుని యొక్క ఆస్తిని, సొత్తును తీసుకొనుటకు అతనిని ఓడించు వారు ఇంకా బలమైన శక్తి గలిగిన వానిగా ఉండవలెను. అది కేవలము దేవుని శక్తియే, పరిశుద్ధాత్మ శక్తియే. అలాగు యేసు సాతానును గూర్చి అలంకార భాషలో మాట్లాడుచు తన సొత్తును కాచుకొను బలమైన శక్తితో అతనిని పోల్చెను. బలమైన వ్యక్తియగు అతని సొత్తును తీసుకొనువాడు అతనికంటే మరింత బలముగలవాడై యుండవలెను. ఆ బలమైన శక్తిగలవాడు యేసు క్రీస్తే. ఇటువంటి యదార్థమైన వివరణ యేసు తాను ఏ శక్తి వలన దయ్యములను వెళ్ళగొట్టుచున్నాడో దానిని వివరించెను.

బలవంతుడైన మనుష్యుని గూర్చి ప్రస్తావించు ఈ లేఖన భాగము దానిని పోలి ఉన్న వాక్యభాగములు మత్తయి లూకా సువార్తలలో కూడా కనబడును. అయితే పట్టణములను ఆవరించి యున్న "బలవంతులైన వారిని" బంధించుట అను విషయమును ఈ సువార్తలలోని వాక్య భాగములు ఏ మాత్రమును బలపర్చుట లేదు. యేసు కాకుండా వేరే ఇతరులెవ్వరూ ఈ "బలవంతులైన వానిని బంధించు" ఉదాహరణలు నూతన నిబంధనలో మనకెక్కడను కానరావు,

ఈలాగు చేయమను ఉపదేశము మనకెక్కడా కన్పించదు. ఏ క్రైస్తవుడైనను బలమైన దుష్టాత్మలను బంధించి శక్తి హీనునుగా ఒక పట్టణము పైనగాని, ఒక భౌగోళిక ప్రాంతము మీద గాని అతనిని ఓడించి బలహీనునుగా చేయునట్టి శక్తి వాక్యానుసారముగా క్రైస్తవుడైన వానికి లేదని ఇందుమూలముగా మనము నిర్ధారించవలెను.

## 'పరలోకమందును, భూమిమీదను బంధించుట' అను విషయము ఏమైయున్నది?

సువార్తలలో కేవలము రెండు పర్యాయములు యేసు మాటలలో భూమి మీద మీరు వేటిని బంధింతురో, అవి పరలోకమందును బంధింపబడును మరియు భూమి మీద మీరు వేటిని విప్పుదురో అవి పరలోకమందును విప్పబడును. ఈ రెండు మాటలు మత్తయి సువార్తనందే లిఖితమాయెను. ఆకాశమందలి దురాత్మలను మనము బంధించుట, లేక బంధించవలెను అను అంశమును యేసు ఇక్కడ బోధించుచున్నాడా?

మొదటిదిగా మనమాయన మాటలను గమనించుదుము. ***బంధించుట*** మరియు ***విప్పుట*** యేసు ఇక్కడ అలంకార భాష పదములనే వాడుచున్నాడు. భౌతికముగా త్రాళ్ళను తీసుకొని బంధించుట గాని, విడిపించుట గాని చేయుటను గూర్చి యేసు మాట్లాడుటలేదు, అయితే ఆయన మాటల యొక్క అంతరార్థమేమి?

ఆ సందర్భములో యేసు ఆ సమయమున ఏమి మాట్లాడుచున్నాడో అను దానిని బట్టి ఈ ***బంధించుట*** లేక ***విడిపించుట*** అను దానిని మనము అర్థము చేసుకొనవలను. ఆయన దురాత్మల అంశమును గూర్చి ఆ సందర్భమున మాట్లాడుచున్నాడా? అట్లయిన యెడల ఆయన దురాత్మలను బంధించుటను గూర్చియే ఆ సందర్భమున మాట్లాడి ఉండవచ్చునని మనము అర్థము చేసుకొనవలెను.

ఈ క్రింది వాక్యభాగములో మొదట యేసు బంధించుట మరియు విడుదల చేయుట గూర్చిన భాగము ప్రస్తావించబడినది:

> అందుకాయన-మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు-సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనేకాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోకద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోకరాజ్యముయొక్క తాళపుచెవులు నీ కిచ్చెదను,***నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో***

**చెప్పెను** (మత్తయి 16:15-19).

ఈ వాక్య భాగమును వివరించి చెప్పుటలో ఐదు పోలిక పదములు ఉపయోగించబడి యున్నవని నిస్సందేహముగా మనము అర్థము చేసుకొనవచ్చును. (1) "రక్త మాంసములు," (2) "బండ," (3) "పాతాళ ద్వారములు," (4) "పరలోక రాజ్య తాళపుచెవులు," (5) "బంధించుట/విడిపించుట." ఈ ఐదు మాటలు అలంకార భాషలో ఏదో ఒక సంగతిని గూర్చి వ్యక్తపరుచు చున్నవి.

## పాతాళలోక ద్వారములు

ఈ వాక్య భాగములో యేసు దుష్టాత్మలను గూర్చి మాట్లాడుట లేదు గాని ఈ అలంకార భాషను అర్థవంతముగా మాట్లాడినట్లు మనము చూడగలము. "పాతాళలోక ద్వారములు" అని ఆయన పేర్కొనినప్పుడు కేవలము అది ఒక సూచకమైన పదములే గాని అక్షరార్థముగా క్రైస్తవ సంఘము యొక్క కార్యకలాపములను అడ్డగించు ద్వారములు మాత్రము కావు.

అందుచేత ఈ "పాతాళలోక ద్వారములు" దేనిని తెలియజేయును? ఒకవేళ అవి సాతాను శక్తికి సూచకముగా తెలియజేయునవై ఉండును. సంఘము కట్టబడుటకు సాతాను శక్తి ఏ మాత్రము ఆటంకముగా ఉండజాలదు అని యేసు భావము లేక తాను నిర్మించిన సంఘము ప్రజలను పాతాళ ద్వారములలో బంధించి ఉంచక వారిని రక్షించి దేవుని సంఘములో విడుదలను, స్వేచ్ఛను అనుభవింతురు.

మనము గమనించిన యెడల ఇక్కడ రెండు విధములైన ద్వారములు కలవు. పాతాళలోక ద్వారములు మరియు పరలోకము యొక్క ద్వారములు. పేతురుకు "పరలోక ద్వారముల తాళపు చెవులను" అప్పగించుట ఇందులో ఒక భాగము. పాతాళములోనికి పోకుండా అనేకమంది ప్రజలను రక్షించి పరలోక రాజ్యములోనికి చేర్చుట సంఘము యొక్క ప్రధానమైన కర్తవ్యమై యున్నది.

యేసు మాటల యొక్క అర్థము ఈ విధముగా ఉండవచ్చును. "సాతాను తన బలమంతటిలో సంఘము యొక్క కార్యకలాపములను ఆపజాలడు", అంతేగాని మనము తొందరపడి పట్టణములను ఆవరించి యున్న దురాత్మ శక్తులను బంధించుటగాని, విడుదల చేయుటకు గాని, ఏ విధమైన ఆదేశములు ఇవ్వబడలేదని ఈ మాటల వలన మనము నిర్ధారించుకొనవచ్చును. సువార్తలలో గాని, అపొస్తలుల కార్యములో గాని పట్టణములను ఆవరించి ఉన్న దురాత్మలను బంధించుటను గూర్చియు ఉదాహరణములు ఏమీ వ్రాయబడి ఉండలేదు. నూతన నిబంధన పత్రికలలో కూడా ఆ విధముగా చేయుటకు ఎట్టి ఆదేశములు ఇవ్వబడలేదు. కనుక క్రీస్తు యొక్క మాటలను బంధించుట లేక విడుదలను చేయుటను గూర్చి వివరించునప్పుడు నూతన నిబంధన వాక్యాధారములు ఏమియు లేవు.

పై చెప్పబడిన వివరణల ప్రకారము బంధించుట లేక విడుదల చేయుటకు వాక్యాధారమైన ఉదాహరణలు ఏమి లేనప్పుడు నేటి క్రైస్తవులు ఏలాగున "యేసు నామములో

ఈ దయ్యములను నేను బంధించుచున్నాను" అని గాని "ఆ వ్యక్తిపై ఉండు దేవ దూతలను నేను విడుదల చేయుచున్నాను" అని గాని ఏలాగు చెప్పగలరు. నూతన నిబంధనలో ఎవరును ఎక్కడను ఆలాగు చెప్పినట్లు కనుగొనజాలము. అపొస్తలుల కార్యములలో గాని, పత్రికలలో గాని దయ్యములను బంధించుట గాని విడిపించుట గాని ఎక్కడను లేదు, కాని సువార్తను ప్రకటించి దేవునికి ప్రార్థన చేయుట కలదు. ఉదా: పౌలు తన శరీరములో తన్ను బహుగా బాధించుచున్న ఒక ముల్లు వంటి దానిని గూర్చి అది సాతాను దూతగా తన శరీరమందు ఉంచబడి ఉన్నదని చెప్పుచు దానిని బంధించుటకు ఏ మాత్రము ప్రయత్నము చేయలేదు. దాని విషయమై దేవునికి ప్రార్థన చేసెను (2 కొరింథీ 12:7-10).

## పరలోక తాళపు చెవులు

బంధించుట లేక విడుదల చేయుట అను సందర్భములో యేసు మాటలను ఈ దిగువ వచ్చు సందర్భములో పరిశీలింతుము. బంధించుట లేక విడుదల చేయుట అనుదానిని గూర్చి సూటిగా పేతురుతో ప్రస్తావించుటకు ముందు "పరలోక రాజ్య తాళపు చెవులను" నీ కిచ్చుచున్నానని పేతురుతో చెప్పెను. అక్షరార్థముగా తాళపు చెవులనేమి యేసు పేతురుకు ఇచ్చియుండలేదు గాని యేసు మాటలు ఇక్కడ అలంకారపు మాటలుగా తీసుకొనవలెను. "తాళపు చెవులు" వేటిని సూచించుచున్నవి? ***తాళము వేసి మూయబడిన దానిలోనికి ప్రవేశించుటకు ఉండు ఆటంకము ఈ తాళపు చెవులు సూచించుచున్నవి***. ఒకని యొద్ద తాళపు చెవులు ఉన్నప్పుడు మరి ఇతరులు ఎవ్వరును ఆ తాళమును తెరచి ద్వారమును తెరువజాలరు.

అపొ.కార్యములో పేతురు యొక్క పరిచర్యను గూర్చి వ్రాయబడిన దాని ప్రకారము, ఎవరి కొరకైతే ద్వారములు మూయబడి ఉన్నవో వారి మధ్య పేతురు చేసిన పరిచర్య ద్వారము తెరిచిన దానికి సమముగా సరిపోల్చవచ్చును.

మొదటిగా పేతురు సువార్తను ప్రకటించెను. సువార్తను నమ్మిన వారందరు తెరువబడిన పరలోక ద్వారముల గుండా దేవుని రాజ్యములో ప్రవేశించిరి. ఆలాగుననే (పాతాళ ద్వారములను సువార్త మూసివేయుచుండెను). దీని భావము మనందరి చేతులకు ఇవ్వబడి ఉన్నవని తలంచవచ్చును. ***ఎందుకనగా మనమందరము క్రీస్తు యొక్క రాయబారులము పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు యేసుక్రీసు యొక్క సువార్తయేనని మనము గ్రహింప వలెను. ఈ సువార్త సందేశమే పరలోక ద్వారములను తెరువచేయును.***

## బంధించుట లేక విప్పుటను గూర్చియే

పరలోక రాజ్యపు తాళపు చెవులు పేతురుకు ఇచ్చుటను గూర్చి యేసు వాగ్దానము చేసిన పిమ్మట బంధించుట లేక విప్పుటను గూర్చి యేసు మాట్లాడ సాగెను. ఈ వాక్య భాగములో వ్యక్తము చేయబడిన ఐదవ అలంకార సూచక పదమును గూర్చి ఇప్పుడు మనము ఆలోచించుచున్నాము.

బంధించుట, విప్పుటను గూర్చిన వివరము ఇంతకు మునుపే మనము చూచి

యున్నాము. ఈ మాటలను గూర్చిన యేసు భావమేమి? సంఘమును యేసు కట్టుచున్నప్పుడు ఈ బంధించుట లేక విప్పుటను గూర్చి పేతురుకు ఏలాగు అన్వయించును. సంఘము పాతాళములోనికి జనులు పోకుండా వారిని కాపాడుటకు వారికి సువార్తను ప్రకటించుట అనునది సంఘము యొక్క పని.

ఒకే ఒక అవకాశము ఇందు కన్పించుచున్నది. అది ఏదనగా యేసు యొక్క భావము "పరలోక రాజ్యపు ప్రతినిధిగా నేను నీకు అధికారమిచ్చుచున్నాను. కనుక భూమి మీద నీ బాధ్యతను నీవు జరిగించిన యెడల పరలోకము నిన్ను నీ పనులను బలపరచునట్టిదిగా ఉండును."

ఒక దుకాణములో వస్తువులను అమ్మకము చేయు పనివానితో అతని యజమానుడు ఈలాగు చెప్పవచ్చును, "బ్యాంకాక్‌లో నీవు ఏమి చేయుదువో అట్టి దానిని కేంద్ర కార్యాలయము దృవపరచును." తన యజమానుని మాటలను ఈ ఉద్యోగి ఏలాగు అర్థము చేసుకొనగలడు? తన కంపెనీ యొక్క కేంద్రకార్యాలయము వారు ఒక ఉద్యోగిగా తన కంపెనీ తరఫున అధికారికముగా పనులు చేయుటకు తనకు అధికారమిచ్చునని అతడు భావించును. పరలోక మందలి దేవుని ప్రతినిధిగా భూమి మీద దేవుని తరఫున సంఘము యొక్క కార్యకలాపములు సువార్త పనిని జరిగించుటకు పేతురుకు అధికారము ఇయ్యబడి ఉన్నదని యేసు మాటలను బట్టి అర్థమగుచున్నది. ఈ వాగ్దానము అతని నమ్మికను బహుగా బలపరచినందున శాస్త్రులు, పరిసయ్యులు మున్నగు వారు విమర్శనా దృష్టితో చూచుచున్నను యెరూషలేములో దేవుని సందేశమును ధైర్యముగా ప్రకటించసాగెను.

ప్రజలు కూడా పేతురు, కడమ అపొస్తలులను దేవుడు అధికారమిచ్చిన ఆయన ప్రతినిధులుగా అంగీకరించిరి. ప్రజలు కూడా పేతురును అపొస్తలులను ఎంతగానో గౌరవించుచూ నుండిరి. యేసు యొక్క మాటల వివరణము మత్తయి సువార్తలోని రెండు అధ్యాయములలో వ్రాయబడిన దానికి చాలా పొందిక కలిగియున్నది:

> మరియు నీ సహోదరుడు నీయెడల తప్పిదముచేసిన యెడల నీవు పోయి, నీవును అతడును ఒంటరిగానున్నప్పుడు అతనిని గద్దించుము; అతడు నీ మాట వినినయెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి. అతడు విననియెడల, ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతి మాట స్థిరపరచబడునట్లు నీవు ఒకరినిద్దరిని వెంటబెట్టుకొని అతనియొద్దకు పొమ్ము. అతడు వారి మాటయు విననియెడల ఆ సంగతి సంఘమునకు తెలియజెప్పుము; అతడు సంఘపు మాటయు విననియెడల అతనిని నీకు అన్యునిగాను సుంకరిగాను ఎంచుకొనుము. భూమి మీద మీరు వేటిని బంధింతురో, అవి పరలోకమందును బంధింపబడును; భూమిమీద మీరు వేటిని విప్పుదురో, అవి పరలోకమందును విప్పబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనిని గూర్చియైనను భూమిమీద ఏకీభవించినయెడల అది పరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరుకునని మీతో చెప్పుచున్నాను. ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని చెప్పెను (మత్తయి 18:15-20).

ఈ రెండవ వాక్య భాగములో బంధించుట లేక విప్పుటను గూర్చిన మాటలు కలవు. అయితే ఇక్కడ దురాత్మలను బంధించుటను గూర్చి ఈ సందర్భములో మాట్లాడుచున్నట్లుగా లేదు. సంఘము యొక్క క్రమశిక్షణను గూర్చి యేసు మాట్లాడుచు ఈ బంధించుట లేక విప్పుట అనుదానిని గూర్చి సూటిగా తెలియచేయుచున్నాడు.

ఈ భాగము దేనిని సూచించునది అనగా బంధించుట, విప్పుట అనునది యేసు మాటల ప్రకారము సంఘములో ఎవరు ఉండవలెనో, ఎవరు ఉండరాదో అను నిర్ణయాధికారము లేక బాధ్యత నీకిచ్చుచున్నా. ఈ బాధ్యతను నీవు నిర్వర్తించిన యెడల పరలోకము నీ చర్యలను బలపరచును. కొంత విశాలమైన దృక్పదములో యేసు వారి మాటలకు ఈ అర్థము అపాదించవచ్చును. పరలోక ప్రతినిధిగా భూమి మీద నిన్ను అధీకృత వ్యక్తిగా నియమించుచున్నాము. నీకు గల బాధ్యతలను భూమి మీద నీవు నిర్వర్తించిన యెడల నీ చర్యలను పరలోకము ఎప్పుడును నిన్ను బలపరచును. కొంత విశాలమైన దృక్పథములో యేసు వారి మాటలకు ఈ అర్థము అపాదించవచ్చును.

## బంధించుట మరియు విప్పుటను గూర్చిన సందర్భము

ఈ క్రింది సందర్భములో బంధించుట విప్పుటను గూర్చిన వివరణ సరిగా సరిపోవును. కొంత విశాలమైన సందర్భములో కూడా నూతన నిబంధనలోని భావము కూడా సరిపోవును.

బంధించుట లేక విప్పుటను గూర్చి మాట్లాడిన తరువాత కూడా యేసు పేతురుతో ఈ క్రింది మాటలు పలికెను. "మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనిగూర్చియైనను, **భూమి** మీద ఏకీభవించిన యెడల అది **పరలోకమందున్న** నా తండ్రి వలన వారికి దొరుకునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 18:19).

ఇచ్చటను కూడా ఈ అంశము ప్రస్తావించబడుచున్నది, "భూమి మీద మీరు ఏమి చేయుదురో పరలోకము దానిని బలపరచును. భూమి మీద బాధ్యతతో అధికారముతో ప్రార్థించుట మనము చేయగలము. మనము చేయు ప్రార్థనలకు పరలోకము ప్రతిస్పందించును. యేసు మాటలలో "మరలా నేను మీతో చెప్పుచున్నాను" బంధించుట లేక విప్పుటను గూర్చిన వివరము మరింత విపులముగా తాను ఇంతకు ముందు చెప్పిన దానిని విస్తరణ చేయునట్లు కన్పించుచున్నది.

ఈ వాక్య భాగములో యేసు యొక్క తుది మాటలు, "ఏలయనగా ఇద్దరు, ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని చెప్పెను"

(మత్తయి 18:20). ఈ మాటలు కూడా పరలోకము వారి కూడికను, వారి ప్రార్థనలను బలపరచునట్టిదిగా ఉన్నది. విశ్వాసులు ఆయన నామము నందు ఏకముగా కూడి ఉన్నప్పుడు, పరలోకమందు నివసించు దేవుడు వారి మధ్య తన్ను ప్రత్యక్షపరచుకొనును.

నేను ఈ వాక్య భాగమందు చెప్పిన దానితో ఒకవేళ నీవు ఏకీభవించక పోయినచో వాక్యానుసారముగా సరియైన భావము పట్టణములను ఆవరించి యున్న దుష్టాత్మలను బంధించుట లేక విడిపించుట యేసు మాట్లాడుటను గూర్చి నీవు తెలియపర్చ వచ్చును.

## దేవుని యొక్క దైవ ప్రణాళికలో సాతాను కూడా ఒక భాగమే

సాతాను మరియు అతని దూతలు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసిన సైన్యమే గాని దేవుని స్వాధీనములో లేనటువంటి సైన్యము మట్టుకు కాదు. వీరును మొదట దేవుని వలన సృజించ బడిన వారే (అయితే వారు సృజించబడిన తరువాత తిరుగుబాటు చేసి దేవునికి వ్యతిరేకులైరి). పౌలు కొలస్సయులకు వ్రాయుచు:

> ఏలయనగా ***ఆకాశమందున్నవియు***, భూమి యందున్నవియు దృశ్యమైనవి గాని, ***అదృశ్యమైనవి*** గాని అవి ***సింహాసనములైనను, ప్రభుత్వము లైనను, ప్రధానులైనను, అధికారములైనను*** సర్వము ఆయన యందు సృజించబడెను, సర్వము ఆయన ద్వారాను, ఆయన బట్టియు సృజించబడెను (కొలస్స 1:16).

సాతానుతో కూడా దేవదూతల ఆత్మలను ఆయా తరగతుల ప్రకారము ప్రతీ తరగతిని యేసు సృజించెను. అయితే వారిలో కొందరు తిరుగుబాటు చేసి వ్యతిరేకించుదురని ఆయనకు తెలియదా? ఆయనకు తెలియును. అలాగైతే మరి ఆయన వారినెందుకు సృజించెను. దేవుని యొక్క ప్రణాళికను నెరవేర్చుటకు తిరుగుబాటు చేసి వ్యతిరేకించిన ఈ ఆత్మలు కూడా ఆయన ప్రణాళికలో ఒక భాగమే. వారి పట్ల ఆయనకు ఏ ఉద్దేశ్యము లేనియెడల దేవుడు వారిని చెరలో బంధించియే యుండును. దేవుడు ఆలాగున ఆయనను వ్యతిరేకించి తిరుగుబాటు చేసిన కొందరు దూతలను ఆలాగుననే కటిక చీకటిగల బిలములలో బంధించి యుంచెను (2 పేతురు 2:4). ఒకానొక దినమందు ఆయన సాతానును కూడా ఆలాగుననే బంధించి ఉంచును (ప్రకటన 20:2).

భూమి మీద సాతాను వాని దూతలు పనిచేయునట్లు వారికి అనుమతినిచ్చుటలో దేవునికి కొన్ని సహేతుకమైన కారణములున్నవి. అలాగు కాని యెడల వారు పూర్తిగా దేవుని అదుపు ఆజ్ఞలలో లేకుండా పోవుదురు. భూమి మీద పనిచేయుటకు సాతానుకు దేవుడెందుకు అనుమతినిచ్చెను? ఎవరైనా దీనిని సవ్యముగా అర్థము చేసుకొందురని నేను తలంచను, అయినప్పటికి తన వాక్యమందు దేవుడు కొన్ని సహేతుకమైన కారణములు చూపించియున్నాడు.

మొదటిది భూమి మీద మనుష్యులను పరిశోధించుటకు కొన్ని పరిమితులలో సాతాను పని చేయుటకు దేవుడు అనుమతినిచ్చెను. మానవత్వపు సంబంధులలో ఒక ప్రత్యామ్నాయముగా సాతాను పనిచేయుచున్నాడు. వారు దానిని గుర్తించిన లేక గుర్తించక

పోయిన ప్రజలు దేవునికి గాని, సాతాను యెడల గాని తమ విధేయతను చూపించుదురు. ఆదాము హవ్వలు ఇద్దరూ కూడా చిత్తస్వేచ్ఛను దేవుని వలన ఇవ్వబడిన వారే వారిని శోధించుటకు సాతానును దేవుడు అనుమతినించెను. చిత్త స్వాతంత్ర్యము ప్రతి మనుష్యునికి ఇవ్వబడి ఉన్నది. అయితే వారి హృదయములలో విధేయత ఉన్నదో లేక అవిధేయత ఉన్నదో అది బయలు పడునట్లు వారు పరీక్షింపబడవలెను.

రెండవది ఈ భూమి మీద దుష్ట కార్యములు చేయు వారిపై దైవోగ్రత కుమ్మరింపబడునట్లు కొన్ని పరిమితులలో వారిలో పనిచేయుటకు సాతానుకు దేవుడు అనుమతి నిచ్చెను. ఈ అంశము నేను ఇంతకు పూర్వము అనేక స్పష్టమైన సంఘటనలను దేవుని వాక్యములో నుండి చూపి దుష్టాత్మల ద్వారా దుర్నీతిపరులైన మనుష్యుల మీద దేవుని తీర్పు అమలుచేయుటకు వారు దేవునిని వాడుకొనును. రక్షణ పొందనటువంటి వారిపై ఈ లోకములో సాతాను పరిపాలన చేయునట్లు దేవుని ఉగ్రత వారి మీద పడునట్లు దేవుడు సాతానుకు అనుమతి నిచ్చెను. దుష్టులైన మనుష్యులు దుర్మార్గ క్రియలు చేయువారిపై పరిపాలన చేయుటకు ఏర్పరచబడుచుండిరి. అట్లు వారి జీవితములు ఇంకను బహుఘోరముగా, బహు దయనీయముగా మారును.[92]

మూడవది దేవుడు అనుమతించిన కొన్ని క్రియల వలన సాతాను కూడా దేవునిని మహిమ పరచు కొన్ని కార్యములు చేయును, "అపవాది యొక్క క్రియలను లయపర్చుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" (1 యోహాను 3:8) సాతాను యొక్క క్రియలను దేవుడు లయపరచు ప్రతి సారి దేవుని శక్తి ఆయన జ్ఞానము మహిమ పర్చబడును.

## ప్రధానుల మీదను, శక్తుల మీదను అధికారములు పొందిన యేసు

క్రైస్తవులముగా సాతానుతోను, దురాత్మలతోను మనము వ్యవహరించు విషయములో వాక్యాధారమైన బాధ్యత రెండు విధములుగా మనకు ఉండును; మన సొంత జీవితములలో మనము సాతానును ఎదిరింపవలెను (యాకోబు 4:7), ఇతరులలో దురాత్మలున్న యెడల వారిని విడుదల చేయవలెను (మార్కు 16:17). ఒకడు దురాత్మ చేత ఆవహించబడినప్పుడు ఆ వ్యక్తి ఇష్ట పూర్వకముగా విడుదల చేయబడవలెనని మొదట కోరుకొనవలెయును. అప్పుడు వారిలో ఉన్న దురాత్మ విడుదల చేయుటకు వీలగునని దురాత్మలను వెడల గొట్టు ఏ క్రైస్తవుడైనను అనుభవపూర్వకముగా తెలుసుకొని యుండును. అట్లుగాక అతని ఇష్టముతో ప్రమేయము లేకుండా దురాత్మను విడుదల చేయుట కష్టమగును.[93] ఎందుకనగా దేవుడు ప్రతి వ్యక్తికి ఇచ్చిన చిత్త స్వాతంత్ర్యమును ఆయన ఎంతగానో గౌరవించును. ఒకవేళ ఆ వ్యక్తి తన

---

[92] నేను వ్రాసిన మరో పుస్తకం ***దేవుని పరీక్షలు*** లో, ఈ అంశం గురించి మరికొంత విపులంగా వివరించటంజరిగింది. మా వెబ్‌సైట్ (website) www.shepherdserve.org నందు, ఈ పుస్తకమును ఆంగ్లములో మీరు చదవగరు.

[93] తమకు స్వేచ్ఛ కావలని కూడా చెప్పలేనంతగా దురాత్మల ఆధీనములో ఉన్న మననుష్యులకు ఈ నియమము నుండి మినహాయింపు వుంది. ఈలాంటి సందర్భాలలో వారు విడుదల పొందాలంటే, పరిశుద్ధాత్ముని యొక్క ప్రత్యేకమైన వరాలు అవసరం, మరియు పరిశుద్ధాత్మ యొక్క చిత్తానుసారంగా ఈ ఆత్మ వరాలు పనిచేస్తాయి.

ఇష్టపూర్వకముగానే దురాత్మల ప్రభావమునకు లోబడవలయునని ఇష్టపడితే, దేవుడు అతనిని ఏ మాత్రము నిలువరించడు.

భౌగోళికముగా ఆయా ప్రాంతములను ఆవరించుకొని యున్న దురాత్మల స్థావరములను మనము కూలద్రోయలేకపోవుటకు ఇది మరియొక కారణము. ప్రజలు ఇష్టపూర్వకముగా ఆ దురాత్మలకు లోబడియున్నారు గనుక ఆ దుష్టాత్మలు వారిని తమ బంధకములలో లేక బానిసత్వములో స్వాధీన పర్చుకొని యుండును. సువార్తను వారికి మనము ప్రకటించుట వలన వారి యెదుట దుష్టాత్మల ప్రభావమునుండి విడుదల పొందుటకు వారి యెదుట ఒక అవకాశమును ఉంచుచున్నాము. వారు ఆ అవకాశమును సద్వినియోగము చేసుకొని సాతాను మరియు దురాత్మల అధికారమునుండి విడుదల చేయబడుటకు ఇష్టముగా నిర్ణయించుకొనిన యెడల సువార్త శక్తి వలన వారు తప్పక విడుదల పొందుదురు. అట్లుకాకుండా వారు ఏ మాత్రము పశ్చాత్తాపము పడకుండా సాతాను వారి అనుచరులకేలోబడి ఉండుటకు తీర్మానించుకొనినయెడల వారిని తమ బంధీయులుగానే దేవుడు సాతానుకు అనుమతి ఇచ్చును.

దైవ లేఖనము యేసును గూర్చి చెప్పుచు, “ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సై యున్నాడు” (కొలస్స 2:10). గ్రీకు పదము పరిపాలించు మరియు **అధికారము** కలిగియుండి ఈ పదములు కొన్ని పర్యాయములు మానవులైన రాజకీయ నాయకుల విషయములో కూడా ఉపయోగించబడి ఉన్నవి. ఆలాగుననే నూతన నిబంధనలో కూడా దయ్యాపు ఆత్మలను కలిగిన అధికారులను గూర్చి కూడా ఇవే మాటలు ఉపయోగించబడెను. “క్రైస్తవ పోరాటములో మనము పోరాడునది శరీరులతో కాదు, కాని ప్రధానులతోను, అధికారులతోను పోరాడుచున్నాము అనునది ఒక ఉదాహరణ (ఎఫెసీ 6:12). పౌలు కొలస్స 2:10లో వ్రాసిన ప్రకారము యేసు ప్రధానులకును, అధికారులకును శిరస్సై యున్నాడు అను వాక్య భాగములో ఆయన ఆత్మ సంబంధమైన శక్తులను గూర్చి మాట్లాడుట విశదమై యున్నది. యేసును గూర్చి పౌలు అదే భాగములో వ్రాయుచు ఆయన ప్రధానులను, అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువ చేత జయోత్సవములో వారిని పట్టి తెచ్చి బాహాటముగా కోరికను కనుబరిచెను (కొలస్స 2:15).

ఈ ఆత్మ సంబంధమైన అధికారులకును; ప్రధానులకును క్రీస్తు శిరస్సై యుండినప్పుడు ఆయన వారందరిపై సర్వాధికారిగా ఉన్నాడు అనునది వాస్తవము. అన్యులైన విగ్రహారాధికుల మధ్య నివసించు క్రైస్తవులకు ఇది ఎంతో గొప్ప ధైర్యము అద్భుతమైన దేవుని ప్రత్యక్షతయై యున్నది. వారిలో చాలా మంది తమ చుట్టూ ఉన్న విగ్రహారాధికుల వలె వీరు కూడా విగ్రహములకును, దయ్యములకును భయముతో లోబడి ఉండి పూజించి వారి అధికారమునకు లోబడియుండిరి. కాని ఇప్పుడైతే వారు క్రీస్తును తెలుసుకొని దురాత్మల అధికారము ప్రభావము నుండి విడుదల పొందిన వారై స్వేచ్ఛగా క్రీస్తును ఆరాధించు వారై యుండిరి.

## తప్పించుకొను ఒకే ఒక మార్గము

దుష్టాత్మల యొక్క చెరనుండి తప్పించుకొనుటకు ఒకే ఒక మార్గము అది పశ్చాత్తాపపడి సువార్తను నమ్మటయే. ఇదియే దేవుడు ఏర్పరచిన తప్పించుకొను మార్గము. పట్టణములను ఆవహించియున్న దురాత్మ శక్తులనుండి పాక్షికముగా స్వేచ్ఛ నిచ్చుట గాని లేక బంధించుట గాని ఎవరును చేయజాలరు. ఒక వ్యక్తి పశ్చాత్తాపపడి సువార్తను నమ్మునంత వరకు అతడు దేవుని ఉగ్రత క్రింద నిలిచేయుండును (యోహాను 3:36), అట్టివారు దుష్టాత్మ శక్తుల ప్రభావము క్రింద ఉన్నవారు.

పట్టణములలో గాని, మహా నగరములలో గాని ఎంత భారీ ఎత్తున సువార్త స్వస్థత సభలు, లేక ఆత్మీయ ఉజ్జీవ కూటములు నిర్వహించినను గొప్ప ఆత్మీయ సమావేశములు, సభలు నిర్వహించినను ఆయా స్థలములలో ఏ విధమైన మార్పు కనిపించదు. దానికి కారణము ఆ ప్రదేశములపై పరిపాలనాధికారము కలిగియున్న దురాత్మల శక్తుల ఆయా తరగతుల వరుసలో పూర్తి స్వాధీనము క్రింద ఉంచుకొనుట వలన ఏ మార్పును సంభవింపదు. ఆకాశమండలమందున్న ప్రధానులను, దురాత్మల శక్తులను క్రైస్తవులు రాత్రింబవళ్ళు ప్రార్థనలతో అరచి, గగ్గోలు పెట్టినను వాటిని ఎవ్వరును ఏమియు చేయలేరు. కొంతమంది విమానములలో ప్రయాణము చేయుచు మరికొంత మంది ఎత్తైన ఆకాశ భవనములలో పైకి ఎక్కి ఎంత గట్టిగా అరచి పట్టణములపై ఉన్న సాతాను శక్తులను బంధించుటకు ప్రయత్నించినను ఆ దురాత్మ శక్తులు అవి ఎగతాళిగా నవ్వుకొనునే తప్ప వాటిని ఎవ్వరును ఏమియు చేయజాలరు.

ఆత్మీయ పోరాటములో ఆధునిక ఇతిహాసపు కథను పరిశీలిద్దాం,

**ఇతిహాసము - 6: "ప్రాంతీయ దురాత్మలకు వ్యతిరేకముగా ఆత్మీయ పోరాటము సలుపుటకు తెరువబడిన మార్గము సువార్త ప్రకటన."**

దేవుని రాజ్యము ఎంతగానో విస్తరింపవలెనని బహుగా ఆశించు క్రైస్తవులుఈ ప్రాంతీయ ఏలికలుగా ఉన్న దుష్టాత్మలపై ఆత్మీయ పోరాటము చేయుట యందు తీవ్రముగా నిమగ్నమగుటకు ప్రభువు రాజ్యాభివృద్ధి కొరకైన ఆశయే. ఈ విషయములో వారు బహుగా అభినందించవచ్చును. సాతాను పట్టునుండి అనేకమంది ప్రజలను విడుదల చేయవలెననెడి ఆశ ప్రతి క్రైస్తవునికి ఉండుట ఎంతగానో అభిలాషణీయము.

దేవుని రాజ్యమును నిర్మాణము చేయుటకు కేవలము దేవుడు ఏర్పరచిన విధానములనే ఉపయోగించుట చాలా ప్రాముఖ్యము. ఏది ఎక్కువ ప్రతిభావంతముగా పని జరిగించునో, ఏది నిరర్థకమైనదో ఆ విధానములన్నియు దేవునికి తెలియును. దేవుని రాజ్య విస్తరణకు మనము ఎట్టి బాధ్యతతో వ్యవహరింపవలసి యున్నామో దేవుడు దానిని మనకు తెలియపరెచెను. దేవుని వాక్యమందు మనము కనుగొనని వాటిని గూర్చి మనము ఆలోచించుచుందుము. ఈ సువార్త పరిచర్య ఏలాగు చేయగలము. తమ సేవలో యేసు గాని, పేతురు మరియు పౌలు ఉపయోగించని విధానములను మనము చేయుట ఎంత అవివేకము.

శక్తి వంతముగా సువార్త సేవ జరిగించుట ఈ ఆత్మీయ పోరాటమునకు తలుపులు

తెరుచును అని చాలా మంది క్రైస్తవులు భావింతురు. వారి ఆలోచనా ధోరణి ఈ విధముగా ఉండును, "రక్షణ పొందని మనుష్యుల మనస్సులకు సాతాను గ్రుడ్డితనము కలుగజేసియున్నాడు" గనుక సాతానుకు వ్యతిరేకముగా ఆత్మీయ పోరాటము సలిపి అతడు జనుల మనస్సులకు గ్రుడ్డితనము కలుగజేయకుండా ఆపవలెను. గ్రుడ్డితనము కలుగజేయు శక్తులను నిలుపుదల చేసినచో అనేక మంది ప్రజలు సువార్తను నమ్ముదురు." ఇది వాస్తవమేనా?

సాతాను రక్షణ పొందని వారి మనస్సులకు గ్రుడ్డితనము కలుగజేయుట నిస్సందేహముగా అది సరియైన విషయమే. అందుచేతనే పౌలు ఈలాగు వ్రాయుచున్నాడు:

> మా సువార్త మరుగుచేయబడిన యెడల నశించుచున్న వారి విషయములోనే మరుగుచేయబడి ఉన్నది. దేవుని స్వరూపియై యున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డి తనము కలుగజేసెను" (2 కొరింథీ 4:3-4).

ఇప్పుడు ప్రశ్న ఏమనగా ***ఆత్మీయ పోరాటము చేయవలెనని కొరింథీలోని క్రైస్తవులను ప్రేరేపించుటకు పౌలు ఈ సమాచారము వారికి అందించి తద్వారా ప్రాంతీయ అధికారముతో ఆ పట్టణములను ఆవహించి యున్న దురాత్మల స్థావరములను కూల ద్రోయుట వలన రక్షణ పొందనటువంటి అవిశ్వాసులు సువార్తను అంగీకరించుటకు ఆస్కారము కలదా***?

జవాబుగా వివిధ కారణములను బట్టి ***లేదు*** అని చెప్పవలెను.

మొదటి కారణమేమనగా, "అందుచేత కొరింథీయులారా, సాతాను అవిశ్వాసులైన వారి మనస్సులను గ్రుడ్డితనము కలుగజేసినందున మీరు ఆత్మీయ పోరాటము సలిపి జనుల మనస్సులకు గ్రుడ్డితనము కలుగజేయు దురాత్మల సమూహములను వాటి స్థావరముల నుండి కూలద్రోయుడి" అని పౌలు ఎక్కడను చెప్పలేదు. కాని దానికి భిన్నముగా క్రీస్తును వారికి ప్రకటించుట ద్వారా వారి ఆత్మీయ గ్రుడ్డితనము తొలగింపబడునని వెనువెంటనే వ్రాయుచున్నాడు.

రెండవది పౌలు వ్రాసిన పత్రికలలో ఈ ఆకాశమండల మందున దురాత్మల సమూహములను కూలద్రోయుట ద్వారా సువార్త పరిచర్యకు ఎక్కువ అవకాశములు కలుగునని విశ్వాసులకు ఆయన బోధింపలేదు.

మూడవది పౌలు ఉత్తరములన్నియు మనము చదివిన పిమ్మట కేవలము సాతాను వారి మనస్సులకు గ్రుడ్డితనము కలుగజేయుట చేతనే జనులు గ్రుడ్డివారు అగుచుండుట లేదు. జ***నులు హృదయములు పాపము వలన కఠినము అగుచుండుట ప్రాథమిక కారణము***. సాతాను జనుల హృదయములను గ్రుడ్డితనము కలుగజేయుట అనునది దానిని సాతాను సులభముగా చేయగలుగుచున్నాడు. జనుల మనస్సులకు కేవలము సాతాను గ్రుడ్డితనము కలిగించుచున్నాడు అన్నదే ముఖ్య కారణము కాదు. సత్యమును గూర్చిన సువార్త

సందేశము జనులు వినినప్పుడు వారు దానిని విశ్వసించి ఇంతకు పూర్వము వారు నమ్మిన అబద్ధములను తిరస్కరింతురు. అట్లు వారు సాతాను గ్రుడ్డితనము నుండి క్రీస్తు సువార్త సత్యము వలన కన్నులు తెరువబడును. సాతాను వారి కన్నులకు గ్రుడ్డితనము కలిగించినందున వారిలో అవిశ్వాసము కలుగుట లేదు గాని వారిలో ప్రాథమికముగానే అవిశ్వాసము ఉండుట వలన సాతాను సునాయసముగా వారి కన్నులకు గ్రుడ్డితనము కలుగజేసియున్నాడు.

## నిర్లక్ష్యముతో నిండిన హృదయములు

పౌలు ఎఫెసీయులకు పత్రిక వ్రాయుచు అన్యజనులైన వారు అవిశ్వాసములో ఎందుకు కొనసాగుచున్నారు అన్నది వివరిస్తూ,

> కాబట్టి అన్యజనులు నడుచుకొనునట్లు మీరిక మీదట నడచుకొనవలదని ప్రభువు నందు సాక్ష్యమిచ్చుచున్నాను. వారైతే ***అంధకారమైన మనస్సుగలవారై, తమ హృదయ కాఠిన్యము వలన*** తమలోనున్న అజ్ఞానము చేత దేవుని వలన కలుగు జీవములోనుండి వేరుపర్చబడిన వారై, తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచు కొనుచున్నారు. వారు సిగ్గులేని వారైయుండి నానా విధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు తమ్ము తామే కాముకత్వమునకు అప్పగించుకొనిరి (ఎఫెసీ 4:17-19).

వారిలో ఉన్న అజ్ఞానము చేత దేవుని జీవములో నుండి వారు వేరు చేయబడిరని అవిశ్వాసులను గూర్చి పౌలు వ్రాయుచున్నాడు. వారెందుకు అజ్ఞానులైరి? ఎందుకు వారి మనస్సులు అంధకారమయమాయెను? దానికి జవాబు వారి "హృదయ కాఠిన్యము వలననే" ఆత్మీయ విషయములో వారు బహు "నిర్లక్ష్య ధోరణి" కనుబర్చుట చేతనే. వారు రక్షణ స్థితిలో లేకుండటకు ప్రథమ కారణము లేక మూలము ఇదియే.[94] వారి నింద వారు తమపైననే వేసుకొనుచున్నారు. ఏ అబద్ధమును వారు విశ్వసించుచుందురో వాటిని మట్టుకే సాతాను వారికి సరఫరా చేయుచున్నాడు.

విత్తనము విత్తబడిన నాలుగు రకములైన నేలలను గూర్చి యేసు తన ఉపమానములో స్పష్టముగా వివరించెను:

> ఆయన ఉపమాన రీతిగా ఇట్లనెను. విత్తువాడు తన విత్తనములు విత్తుటకు బయలు దేరెను. అతడు విత్తుచుండగా, కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కన పడి త్రొక్కబడెను గనుక ఆకాశ పక్షులు వాటిని మ్రింగివేసెను..... ఈ ఉపమాన భావమేమనగా విత్తనము దేవుని వాక్యము,త్రోవ పక్కన ఉండు వారు, వారు వినువారు, గాని నమ్మి రక్షణ పొందకుండునట్లు అపవాది వచ్చి వారి హృదయములో నుండి వాక్యమెత్తుకొని పోవును (లూకా 8:5,11-12).

[94] రోమా 1:18-32లోని అవిశ్వాసులను గురించి పౌలుయొక్క వివరణ కూడా ఈ అంశమును బలపరుస్తున్నది.

ఈ విత్తనము గూర్చి గమనించుడి. ఆ విత్తనము సువార్త సత్యమే, అది త్రోవ ప్రక్కన పడి కాళ్ళ క్రింద త్రొక్కబడెను. జనులు పలుసార్లు ఆ త్రోవలో నడుచుట వలన ఆ భూమి బహు కఠినమాయెను. అందువలన ఆ విత్తనము ఆ భూమిలోనికి వెళ్ళలేక పోయెను. అందుచేత సాతానుకు సూచకముగా ఉన్న పక్షులు వచ్చి ఆ విత్తనములను సులభముగా ఎత్తుకొని పోయెను.

ఈ ఉపమానములో ప్రాముఖ్యముగా కనబడుచున్నది ఏమనగా జనుల యొక్క హృదయ పరిస్థితి దేవుని వాక్యమును స్వీకరించు విషయములో వారి వైఖరి. వివిధ రకములైన నేలలు వారి వారి హృదయ పరిస్థితులను తెలియజేయుచున్నవి. యేసు బోధించిన బోధలను ఎందుకు కొందరు అంగీకరించిరి? ఎందుకు కొందరు అంగీకరించలేకపోయిరి? అది వారి వారి హృదయ పరిస్థితులను బట్టి తేటతెల్లమగుచున్నది.

సాతాను ఈ వృత్తాంతములో ఎట్లు ప్రస్తావించబడెను? కఠిన హృదయము కలిగిన వారి జీవితములలోనికి దేవుని వాక్య విత్తనము లోనికి వెళ్ళలేదు గనుక సాతాను ఆ విత్తనములను దొంగిలించి యున్నాడు. విత్తనము ఫలింపక పోవుటకు కారణము వారు హృదయ కాఠిన్యమే మొదటి కారణము. పక్షులు ఎత్తుకొని పోవుట రెండవ కారణము గనుక ప్రాథమిక కారణము ఆ నేలదే. నేల కఠినమై ఉండుట వలన విత్తనము పైపైనే నేల మీద ఉండుట చేత సునాయసముగా పక్షులు విత్తనమును ఎత్తుకొని పోవుటకు అవకాశము కలిగినది.

సువార్త విషయములో కూడా ఇదే నిజము. నైతిక బాధ్యత వహించవలసిన మానవ హృదయము కఠినమై పోవుటయే ఈ సమస్య యొక్క ముఖ్య కారణము. జనులు సువార్త సత్యమును తిరస్కరించుట వలన వారు మానసిక అంధత్వములో ఉండుటకే తీర్మానించుకొనిరి. సత్యమును నమ్ముట కంటే అబద్ధములను, మోసములను నమ్ముటకే వారు ప్రాధాన్యత నిచ్చిరి. యేసు ప్రభువు చెప్పినట్లు, "వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక ***చీకటినే ప్రేమించిరి***" (యోహాను 3:19).

ప్రజలు యదార్ధమైన మంచి హృదయములు గలిగి సాతాను వారి కన్నులకు గ్రుడ్డితనము కలుగజేయని యెడల వారు తప్పక సువార్తను నమ్ముదురని బైబిలు గ్రంథములో ఎక్కడను చెప్పబడి యుండలేదు. దానికి భిన్నముగా మానవ స్వభావమును గూర్చి బైబిలు అస్పష్టమైన చిత్రపటమును చూపుచున్నది. మనుష్యులు చేసుకొను పాపపూరితమైన నిర్ణయములకు ప్రతీవ్యక్తిని దేవుడు బాధ్యత కలిగిన వానిగా ఎంచుచున్నాడు. న్యాయ తీర్పు సింహాసనము మీద దేవుడు కూర్చుండి "సాతానే దీనికి అంతటకు బాధ్యత" అని మనుష్యులు చెప్పు సాకులను దేవుడు ఏ మాత్రమును అంగీకరించడు.

## మనుష్యుల హృదయాలకు సాతాను ఎట్లు గ్రుడ్డితనము కలుగజేయును

జనుల మనసులను సాతాను వాస్తవముగా ఎట్లు గ్రుడ్డిగా చేయును? ఆత్మ సంబంధమైన ఏదైనా రహస్య తంత్ర సంబంధమైన మందును మనుష్యుల మనస్సులో పోసి వారి వివేకమును, జ్ఞానమును మంద బుద్ధి కలుగునట్లు చేయునా? విజ్ఞతతో ఆలోచించగలిగిన

వారి శక్తి సామర్థ్యములపై ఏదైనా ఒక దయ్యము వారి మెదడులో గుంటలు తవ్వి వారి జ్ఞాన శక్తిని నశింపచేయునా? ఆ విధముగా సాతాను ఏమియు చేయడు గాని **వారు అబద్ధములను నమ్మునట్లు ఎన్నో అబద్ధములను వారి మనస్సులోనికి పంపును**.

తన పాపముల కొరకు దేవుని కుమారుడైన యేసు క్రీస్తు చనిపోయెనని సత్యమును ప్రజలు స్పష్టముగా గ్రహించి నమ్మిన యెడల, వారి జీవిత క్రియలను గూర్చి ఒకానొక దినమందు వారు దేవుని తీర్పు సింహాసనం యెదుట లెక్క ఒప్పగింపవలసిన బాధ్యత గలవారని గ్రహించిన యెడల వారు తమ పాపము విషయమై పశ్చాత్తాప పడి యేసును విశ్వాసముతో వెంబడించు వారగుదురు. కాని చాలా మంది సంపూర్ణముగా యేసును నమ్మక దేవుని సంగతులను సంపూర్ణముగా విశ్వసించు వారివలె ఉండరు. దేవుడు లేడని వారు నమ్ముదురు. వారు పునర్జన్మయందు నమ్మిక యుంచుదురు లేక దేవుడు ఎవరని కూడా నరకములోనికి పంపడని తలంచుదురు. తాము చేసిన తమ మత సంబంధమైన పుణ్యకార్యములు పరలోకమునకు తీసుకొని వెళ్ళునని నమ్ముదురు. వారు ఏ విషయమును నమ్మినను, సువార్తను వారు నమ్మని యెడల ఒక పదములో చెప్పవలెనంటే వారు నమ్మిన వన్నియు అబద్ధములే. వారు సత్యమును విశ్వసించు వారు కాదు. గనుక సాతాను యొక్క అబద్ధములను వారు అతి సులభముగా నమ్ముదురు. అయితే దేవుని సత్యమునకు విధేయులై తమ్మును తాము తగ్గించుకొని సత్యమును నమ్మిన యెడల సాతాను వారిని ఎన్నటికిని గ్రుడ్డి వారినిగా చేయలేడు.

## చీకటి సంబంధమైన అబద్ధములు

లేఖనములలో సాతాను రాజ్యము "***అంధకార*** సంబంధమైన" రాజ్యముగా చూపబడినది (కొలస్స 1:13). సత్యము ఎక్కడ మరుగవునో అక్కడ చీకటి నిలువరముగా ఉండును. అనగా వెలుగు లేక ప్రకాశమానమైన స్థితి లేకుండుట. నీవు చీకటిలో నడుచునప్పుడు నీ ఊహను అనుసరించి నడుచుదువు. అప్పుడు కొన్ని అపాయములలో చిక్కుబడుదువు. సాతాను యొక్క చీకటి రాజ్యములో అలాగుననే ఉండును. సాతాను చెప్పు అబద్ధముల చేత నిండిన వారై కేవలము వారు తమ ఊహలను ఆధారము చేసుకొని చీకటిలో ప్రయాణము చేయునప్పుడు వారు ఆత్మ సంబంధమైన అంధకార దుస్థితిలో పడిపోవుదురు.

సాతాను యొక్క రాజ్యము భౌతిక, భౌగోళిక సంబంధమైన రాజ్యము కాదు. దానికి సరిహద్దులు, ఎల్లలు ఏమీ ఉండవు. కేవలము అబద్ధములను నమ్ముటయే ఆ రాజ్యము ఉనికి కలిగియుందురు. వెలుగు రాజ్యమెక్కడ ఉండునో, చీకటి రాజ్యము కూడా దాని ప్రక్కనే ఉండును. సత్యము నమ్మువారు, అబద్ధము నమ్మువారు ప్రక్కనే నివసింతురు.[95] ఎవరైతే అబద్ధములను నమ్మి జీవింతురో వారికి క్రీస్తును గూర్చిన సత్య సువార్త ప్రకటించుట మన ప్రథమ కర్తవ్యమై యున్నది. ఒకడు సత్యమును నమ్మిన యెడల సాతాను మరియొకనిని కూడా విడుదల చేయును.

---

[95] ఈ వాస్తవమైన విషయమేదనగా అనేక భౌగోళిక ప్రాంతములలో కొద్ది శాతములో గాని, లేక గొప్ప శాతములో గాని ప్రజలు వేరే రాజ్యములో జీవించుట కలదు.

సాతాను ఇకనేమాత్రము అతడిని పట్టివుంచజాలడు. ఈ లాగున మనము రక్షణ పొందని వారిని సాతాను పట్టునుండి విడుదల చేయగలము. దురాత్మలను కేవలము "బంధించుట" వలన కాదు కాని, దేవుని సత్యమును వారికి ప్రకటించుట వలననే విడుదల సాధ్యమగును. యేసు చెప్పినది ఏమనగా, "మీరు సత్యమును గ్రహించుదురు. అప్పుడు **సత్యము మిమ్ములను స్వతంత్రులనుగా చేయును**" (యోహాను 8:32). సత్యమును నమ్ముట వలన ఆత్మీయ అంధత్వము తొలగిపోవును.

యోహాను సువార్తలోనే యేసు రక్షణ స్థితిలో లేని జనులతో ఈలాగు చెప్పెను:

> "మీరు మీ తండ్రి యగు అపవాది సంబంధులు మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నాడు. ఆది నుండి వాడు నరహంతకుడై యుండి ***సత్యమందు నిలిచిన వాడు కాడు. వాని యందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావమును అనుసరించియే మాట్లాడును; వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడై యున్నాడు***. నేను సత్యమునే చెప్పుచున్నాను గనుక మీరు నన్ను నమ్మరు" (యోహాను 8:44-45).

తనకును, సాతానుకు మధ్య ఎట్టి వ్యత్యాసమున్నదో మనము ఇక్కడ గమనించగలము. యేసు సత్యమే మాట్లాడును. సాతాను పూర్తిగా అబద్ధికుడునై యున్నాడు.

తన మాటలు వినువారితో యేసు చెప్పినది గమనింతుము. వారు వాని తండ్రియైన అపవాది సంబంధులు మరియు సాతాను అబద్ధికుడని వారికెంత విశదముగా చెప్పినను వారు స్వీకరించకుండిరి. అందుచేత తాను చెప్పిన సత్యమును నమ్మ బాధ్యత ఆయన వారి మీదనే ఉంచును. వారు గ్రుడ్డి వారగుటకు సాతాను బాధ్యుడు కాడు--అది వారి స్వంతతప్పు. ***యేసు వారిని ఆ విషయములో బాధ్యులుగా ఎంచుచున్నాడు***. "చీకటిని ప్రేమించునట్లును" సాతాను వారికెంతగానో సహకరించు చున్నాడు మరియు వారు చీకటిలోనే నిలిచి ఉండునట్లు వారికెన్నో అబద్ధములను నమ్మునట్లు సరఫరా చేయుచున్నాడు. అయితే సత్యమును నమ్మువారికి ఎంత మాత్రము సాతాను వెర్రి వానిగా చేయలేడు.

ఈ చీకటి రాజ్యమును దూరముగా నెట్టివేయుటకు ప్రాథమికముగా దేవుని వాక్య సత్యము వలన వెలుగు ప్రకాశమానమగునట్లు తేజరిల్లునట్లు చేయవలెను. అందుచేతనే యేసు మీరు "సర్వలోకమునకు వెళ్ళి సాతానును బంధించుడి" అని చెప్పలేదు. గాని మీరు "సర్వలోకమునకు వెళ్లి సువార్తను ప్రకటించుడి" అని ఆజ్ఞాపించెను. పౌలు యేసు ప్రభువు వలన పిలువబడినప్పుడు అతని సేవా పిలుపు యొక్క ఉద్దేశ్యము జనుల "కన్నులను సువార్త బోధ ద్వారా తెరువజేసి వారు చీకటిలో నుండి వెలుగులోనికిని, సాతాను అధికారము నుండి దేవుని వైపునకును ***తిరుగునట్లు*** సువార్త ప్రకటించెను" (అపొ.కా.26:18). సువార్త సత్యము ప్రజలకు విపులముగా తెలియజేయబడినప్పుడు వారు సాతాను అధికారమునుండి విడిపించబడి తప్పించు కొందురు. అప్పుడు చీకటిలో నుండి వెలుగులోనికి వచ్చుటకు తీర్మానించుకొందురు.

అబద్ధమును నమ్ముటకంటే సత్యమునే నమ్ముదురు. మనము "కూలద్రోయవలసిన" సాతాను దుర్గములు మనుష్యుల మనస్సులలో అబద్ధముల మీద సాతాను నిర్మించినవే.

## దేవుని ప్రణాళిక

దేవుడు సాతానును పరలోకమునుండి భూమి పైకి పడద్రోసెనను విషయమును మరచిపోకూడదు. ఈ మహా విశ్వాంతరాళములో దేవుడు సాతానును ఎక్కడైనను చెరపట్టి ఉంచగలడు లేక సంపూర్ణముగా సర్వనాశనము చేసి ఉండగలడు. కాని అలాగు చేయలేదు. కారణమేమైయుండును? దేవుని నిత్య ప్రణాళికను సంపూర్ణముగా నెరవేర్చుకొనుటలో ఒక సాధనముగా సాతానును దేవుడు ఉపయోగించుకొనుచున్నాడు. అసంఖ్యాకమైన కోట్లకొలది ప్రజలు ఆయనను నమ్మి దేవుని నైతిక సూత్రములను ఆచరణలో గైకొనుట ద్వారా దేవునిని ప్రేమించుచు ఇష్ట పూర్వకముగా దేవుని సేవచేయవలెననెడి ఒక గొప్ప కుటుంబముగా వారు దేవునితో కలిసి ఉండవలెనననుదియే దేవుని యొక్క గురి లేక ధ్యేయము. తన్ను ప్రేమించు బిడ్డలతో ఒక కుటుంబముగా జీవించవలెననెడి దేవుని కోరిక నెరవేరుటకు రెండు అవసరతలు గలవు. ఇష్టపూర్వకమైన చిత్తముతో స్వేచ్ఛగా నుండు ప్రజలను దేవుడు సృజించవలెను ఎందుకనగా ప్రేమ యొక్క పునాది చిత్త స్వేచ్ఛయే. మర మనుష్యులు యంత్రములు ప్రేమ చూపలేవు. రెండవది దేవుని చిత్తమునకు విధేయులగుట లేక అవిధేయత చూపుట అను వాతావరణములో దేవుని ప్రేమించుటయా? లేక ద్వేషించుటయా? అను ఒక పరీక్ష వారు ఎదుర్కొనవలసి యున్నారు. నైతిక స్వేచ్ఛ గలిగిన మనుష్యులు పరీక్షింపబడవలెను. వారి విధేయతను పరీక్షించుటకును వారి అవిధేయుతను శోధించుటకును ఒక పరీక్ష లేక ఒక శోధన అవసరము. కనుక భూమి మీద సాతానును దేవుడు ఎందుకు ఉండనిచ్చుచున్నాడో మనము అర్థము చేసుకొనగలము. దేవునితో మానవుడు సంబంధము కలిగి ఉండుటకు, మానవునికున్న ఒకే ఒక ప్రత్యామ్నయముగా సాతాను పనికివచ్చుచున్నాడు. అయితే సాతాను కొన్నిపరిమితుల వరకే అతడు అనుమతి పొందియున్నాడు. అట్టివారు ఎవరైతే తన అబద్ధములను నమ్ముదురో వారి మీద తన ప్రభావము చూపును. ప్రతి వాని యెదుట ఈ ప్రత్యామ్నయపు ఎంపిక కలదు. నేను దేవునిని నమ్ముదునా? లేక సాతానును నమ్ముదునా? నేను దేవునికి సేవ చేయుదునా? లేక సాతానుకు సేవ చేయుదునా? ప్రజలు దీనిని గ్రహించినను, గ్రహింపక పోయినను వాడు ఇప్పటికే ఒక తీర్మానము చేసుకొనియున్నాడు. మనయొక్క కర్తవ్యము ఏమనగా ఎవరైతే తప్పు తీర్మానము చేసుకొని యున్నారో వారు పశ్చాత్తాపపడి సువార్తను నమ్మి సరియైన తీర్మానము చేసుకొనునట్లుగా మనము వారిని ప్రోత్సహించవలెను. ఏదేను వనములో జరిగిన సంభవము ఇదియే కదా! ఆ వనములో మంచి చెడ్డల తెలివినిచ్చు ఫలములతో నిండిన వృక్షము ఆదాము హవ్వల యెదుట ఉంచబడెను. అయితే వారికి దేవుడు ఆ ఫలములు తినకూడదని నిషేదించెను. ఆ ఫలములు వారు తినకూడదని నిషేదించినప్పుడు ఎందుకు ఆ చెట్టును అక్కడ నుంచెను? దాని జవాబు ఏదనగా కేవలము వారి చిత్త స్వాతంత్ర్యమును, నైతిక స్వేచ్ఛను పరీక్షించుట కొరకే హవ్వను శోధించునట్లుగా సాతాను కూడా

అనుమతించబడెను మరియు దేవుని యెడల వారి విధేయత పరీక్షించుటకు శోధన అనునది వారి అవిధేయతను బయట పెట్టినది. సాతాను అవ్వకు ఒక అబద్ధము చెప్పినాడు అది ఆమె పూర్తిగా నమ్మినది. అదే సమయములో దేవుడు ఏమి చెప్పియున్నారో దానిని నమ్మకుండుటకు హవ్వ నిర్ణయించుకొనెను. దాని ఫలితముగా నైతిక స్వేచ్ఛ గలిగిన మొదటి మానవులు వారి హృదయములలో ఉన్న అవిధేయతను బయలుపరిచిరి. అదేవిధంగా నైతిక స్వేచ్ఛ గలిగిన ప్రతి మనుష్యుడు తన జీవిత కాలమంతటిలో పరీక్షింపబడుచూ ఉండును. తాను సృజించిన సృష్టియంతటి ద్వారా ఆయన గూర్చి బయలుపర్చుకొనెను. గంభీరమైన దేవుడు ఉన్నాడని ప్రతి మనుష్యుడును సృష్టిలో ఆయనను చూచును (రోమా 1:19-20). ప్రతి మనుష్యునికి వారి హృదయములలో మంచి చెడుల విచక్షణ తెలుసుకొనునట్లు మనస్సాక్షి అనుదానిని వారికి అనుగ్రహించెను (రోమా 2:14:16). సాతాను మరియు అతని దుష్టాత్మలు కొన్ని పరిమితులతో అబద్ధములు చెప్పి ప్రజలను శోధించుటకు అనుమతి పొందియున్నాడు. అందువలన నైతిక స్వేచ్ఛ గలిగిన ప్రతి మనుష్యుడు శోధించబడుచూనే ఉన్నాడు. విశాదకరమైన పరిస్థితి ఏమనగా నైతిక స్వేచ్ఛ గలిగిన ప్రతి మనుష్యుడు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసి "దేవుని సత్యమును అబద్ధమునకు మార్చి వేసియున్నాడు" (రోమా 1:25). అయినప్పటికి దేవునికి వందనములు మన పాపములకు ఆయన ఒక విమోచన కలుగజేసి దేవుని కుటుంబములో ఆయన బిడ్డలుగా చేరునట్లు ఆయన ఒక మార్గము మన కొరకు కలుగజేసెను. యేసు త్యాగ పూరితమైన మరణము లేక బలిదానమే మన సమస్యంతటికీ సరిపోవునట్టి ఒకేఒక జవాబయి యున్నది.

## సాతాను ఇప్పుడు అటుపిమ్మటను చేయు మోసము

ఈ భూ ప్రపంచము మీద సాతాను వానితో పాటు తిరుగుబాటు చేసిన అపవాది దురాత్మ సేనలు పనిచేయుటకు ఎందుకు అనుమతించబడిరో ఒక కారణము మనము తెలిసికొనియున్నాము. చీకటిని ప్రేమించువారిని మోసగించుట కొరకు మాత్రమే.

ప్రకటన గ్రంథము మనము చదువుచుండగా ఈ సత్యము మరింత విషదముగా తేటపడుచున్నది. సాతాను బలమైన దూత చేత బంధించబడి వేయసంవత్సరముల వరకు లేని పాతాళములో బంధించబడును. ఈలాగు సాతాను బంధించబడుటకు కారణము, "జనాంగములను అతడు యిక నేమాత్రము మోసముచేయకుండుటకు, యెరూషలేము నుండి ఈ వేయిసంవత్సరములు యేసు భూమిపైన పరిపాలనచేయును. అయితే ఆ వేయి సంవత్సరములు గడచినపిదప, స్వల్పకాలము కొరకు సాతాను విడిచిపెట్టబడును. దాని పర్యవసానము? భూమి నాలుగు మూలలనుండు జనాంగములను మరల మోసగించుటకు బయలుదేరివచ్చును (ప్రకటన 20:5).

ఆ ప్రజలను సాతాను ఆసమయములో మోసగించకూడదని దేవుడు తలంచినచో, అతనిని ఎందుకు విడుదల చేసినట్లు? "తాను జనాంగములను ఇక నేమాత్రము మోసగించకుండునట్లు" అతనిని ఈ సంగతుల వెలుగులో బంధించుటకు దేవుడు ఎందుకు

ఉద్దేశించినట్లు?

సాతాను ఎవ్వరిని మోసగించకూడదనియే దేవుని ఉద్దేశ్యము. దేవుడు చెప్పిన సంగతులను ఎవరు నమ్మకుందురో అట్టివారిని సాతాను మోసగించునని దేవునికి తెలియును. దేవుని సత్యమును ఎవరు అంగీకరింపకయుందురో అట్టి వారిని సాతాను మోసగించును గనుక దేవుడు సాతానుకు మోసగించుటకు అనుమతినిచ్చెను. సాతాను మెసపుచ్చు పని చేయుటకు ఎందుకు అనుమతినివ్వ వలయును? సాతాను ప్రజలను మోసగించుచుండగా ప్రజల హృదయస్థితి తేట తెల్లముగా బయలు పడును. అప్పుడు దేవుడు, "గురుగుల నుండి గోధుములను వేరు చేయును" (మత్తయి 13:24-30). సాతాను విడిచిపెట్టబడినప్పుడు వేయి సంవత్సరముల తరువాత సరిగా ఇది జరుగును. చీకటిని ప్రేమించు వారినందరిని సాతాను మోసగించును. క్రీస్తు పరిపాలన పడద్రోయవలెనని సాతాను తన దురాత్మ సేనలతో యెరూషలేమును ముట్టడి చేయును. దేవుడు తనను ప్రేమించు వారెవరో, ద్వేషించువారెవరో ఎరుగును గనుక వెనువెంటనే దేవుడు పరలోకమునుండి "అగ్ని"ని పంపును, అదివారినందరిని కాల్చివేయును (ప్రకటన 20:10). ఇప్పుడేలాగు దేవుని ఉద్దేశముల ప్రకారము వాటిని పరిపూర్తిచేయుటకు సాతాను పనిచేయుచున్నాడో, అప్పుడు కూడా అలాగే పనిచేయును. ఈ కారణముల చేత "ఆయా ప్రాంతముల నావరించుయున్న దురాత్మలను" కూలద్రోయుట అను వెర్రి పనికి పూనుకొనక, ఆయన కారణములను బట్టి దేవుని ఉద్దేశ్యములను సంపూర్తిగా నెరవేర్చుకొనుటకు  ఆ దురాత్మలకు దేవుడు అనుమతియిచ్చి యున్నాడని మనము గ్రహింపవలయును.

## బైబిలు ప్రకారమైన సువార్త సేవ

నేటి శక్తివంతమైన సువార్త సేవలో అత్యంత కీలకమైన అంశము లేకపోవటయేయని కొందరు తలంతురు, అది చీకటిశక్తులపై ఆత్మీయ పోరాటమేయని తలంతురు, యేసు గాని, నూతన నిబంధన అపొస్తలులుగాని యీ విషయము ఎచ్చటను చెప్పియుండలేదు. యేసు, పేతురు, యోహాను, స్తెఫను, ఫిలిప్పు లేక పౌలు సువార్త బోధించినప్పుడు "పట్టణములను ఆవరించియున్న దురాత్మల స్థావరములను కూల్చుటను" గూర్చి గాని లేక "బలవంతుడైన వాని బందించుటను" గూర్చి గాని వారు బోధించలేదు. అయితే పరిశుద్ధాత్మ వారిని ఎక్కడకు నడిపించితే అక్కడనే వారు సువార్తను బోధించిరి. వారు ప్రకటించునప్పుడు మారుమనస్సు పశ్చాత్తాపము, యేసు నందు విశ్వాసముంచుటను గూర్చియే మాట్లాడిరి. వారు అత్యద్భుతమైన ఫలితములను చూచి ఆనందించిరి. వారు సువార్తను ప్రకటించినప్పుడు ఎందరైతే అంగీకరించలేదో "సాతాను వారి మనస్సులను యింక గ్రుడ్డితనము నింపకుండునట్లు ఆత్మీయ పోరాటము సాతానుతో వారే మాత్రము చేయలేదు" గాని యేసు ఆజ్ఞాపించినట్లు ఆపట్టణము వెలుపల "తమ పాదముల దుమ్ము దులిపివేసి" వేరే పట్టణమునకు వెళ్ళిరి (మత్తయి 10:14; అపొ 13:5).

కొందరు భావించునట్లుగా "సాతాను దుర్గములను కూలద్రోయుట, "బలవంతుడైన

వానిని బంధించుట" విజయవంతమగు సువార్త సేవకు ముందటి ముఖ్య అవసరత యని, దానికి సంబంధము లేకుండా క్రైస్తవ సంఘ చరిత్రలో ఆత్మీయ ఉజ్జీవము కలగిన వేలకొలది సంఘటనలు సంభవించినవి, అయితే ముందు చెప్పిన "ఆత్మీయ పోరాటము" ఆవశ్యకత లేకుండగానే ఉజ్జీవ కార్యములు జరిగినవి.

అయితే కొందరు "మా ప్రయత్నములు సత్ఫలితములిచ్చునని" చెప్పి, ఈ విధమైన "ఆత్మీయ పోరాటము" చేయుట మొదలుపెట్టినప్పుడు యింతకుముందుకంటె యిప్పుడు అనేకమంది రక్షణ స్థితిలో ప్రవేశించియున్నారు.

దానికి కారణము వేరే ఉన్నది. వాక్యానుసారమైన ప్రార్థన, సువార్త ప్రకటన సేవ కూడా అదే సమయమందు జరిగియుండును లేక ఒక గుంపు ప్రజలు ఆకస్మికముగా సువార్త సత్యమంగీకరించి యుందురు.

ఒక సువార్తికుడు నీతో యీలాగు చెప్పియుండవచ్చును, "నేటి రాత్రి ఉజ్జీవ సభలలో నేను ప్రసంగించకముందు మూడు అరటి పండ్లను తింటిని, నేను ప్రసంగించిన తరువాత 16 మంది రక్షింపబడిరి, శక్తివంతమైన సువార్తసేవకు రహస్యము కనుగొంటిని, యిప్పటి నుండి నేను ప్రసంగించుటకు ముందు మూడు అరటి పండ్లను భుజించెదను?"

నీవు వెంటనే చెప్పియుండవచ్చును, "16 మంది రక్షింపబడుటకు నీవు తినిన మూడు అరటి పండ్లు కారణము కాదుగాని, నీవు సువార్తను బోధించినప్పుడు ఆసక్తిగల సిద్ధమనస్సుతో సువార్తను అంగీకరించుట విజయమునకు మూల కారణము."

దేవుడు తన వాక్యమును ఘనపరచును. దేవుడొక వాగ్దానమిచ్చినప్పుడు ఎవరైనా ఆ వాగ్దాన షరతులను జరిగించినయెడల, దేవుడు తన వాగ్దానము మట్టుకు తప్పక జరిగించును. ఒకవేళ అతడు వాక్యానుసారము కాని వాటినెన్ని చేసిననూసరే!

ప్రస్తుత "ఆత్మీయపోరాట" ధోరణులు యీలాగుననే అభ్యసించబడుచున్నవి. నీవు సువార్త కరపత్రికలను పంచిపెట్టుచూ ఆ పట్టణముపై నున్న "బలవంతుడైన మనుష్యుని" బంధించుచూ ఉండగా కొంత శాతము మంది రక్షింపబడిరి, అయితే నీవు "బలవంతుడైనవాని బంధించుట" అను దానిని చేయకపోయిననూ, సువార్త కరపత్రములు పంచిపెట్టుట వలన అంతే మంది రక్షింపబడియుందురు.

## ఆత్మీయ పంట కోయుటకు వాక్యానుసారముగా ప్రార్థించుట ఎట్లు?

రక్షణ పొందని వారికొరకు ఎట్లు ప్రార్థనచేయవలయును? మొదటిగా మనము అర్థము చేసికొనవలసినది నూతన నిబంధనలో మనము ప్రార్థన చేయుటవలన, దేవుడు ఆత్మలను రక్షించునని ఎక్కడను వ్రాయబడియుండలేదు. మొదటి క్రైస్తవులు ఆలాగు ప్రార్థించినట్లు ఎక్కడను దాఖలాలులేవు. కారణమేమనగా దేవుని వైపునుండి ఈలోకములోని ప్రతివ్యక్తి రక్షణ పొందుట కవసరమైనదంతటిని ఆయన సంపూర్ణముగా చేసియున్నాడు. లోకములోని మనుష్యులందరు రక్షించబడవలెనని సిలువలో తనకుమారుడు చనిపోవుటకు అనుగ్రహించెను.

అలాగైతే ప్రతి ఒక్కరు ఇంతవరకును ఎందుకు రక్షణ పొందలేదు? ఎందుకనగా

ప్రతి ఒక్కరు సువార్తను నమ్మియుండలేదు గనుక. ఎందుచేత వారు నమ్మలేదు? దానికి రెండు కారణములు చెప్పవచ్చును: 1. ఇంతవరకును వారు సువార్త వినియుండనందుచేత 2. సువార్త వినినవారు దానిని అంగీకరించక తిరస్కరించిరి గనుక.

వాక్యానుసారముగా రక్షణ పొందని వారి కొరకు ప్రార్థించుట వలన వారు సువార్త వినునట్టి అవకాశము వారికి కలుగవచ్చును. యేసు ప్రభువు చెప్పినట్లు "కోత విస్తారమే గాని, పనివారు కొద్దిమందిగా ఉన్నారు; అందుచేత **కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడి**" (లూకా 10:2). జనులు సువార్త విని రక్షణ పొందు నిమిత్తము వారి వద్దకు ఎవరైనా వెళ్ళి సువార్త ప్రకటించవలెను. అందుచేత సువార్త ప్రకటించుటకు పంపబడు వారి కొరకు దేవుని మనము ప్రార్థింపవలెను.

ఆత్మల పంట కొరకు ఆది క్రైస్తవ సంఘము ప్రార్థించునప్పుడు వారు ఈలాగు ప్రార్థించిరి, "ప్రభువా ఈ సమయమునందు వారి బెదిరింపులు చూచి, రోగులను స్వస్థపర్చుటకును, నీ పరిశుద్ధ సేవకుడైన యేసు నామము ద్వారా సూచిక క్రియలను, మహత్కార్యములను, చేయుటకును, నీ చేయ్యి చాచి యుండగా, నీ దాసులు **బహు ధైర్యముగా నీ వాక్యమును బోధించునట్లు** అనుగ్రహించుము" (అపొ 4:29-30).

వారి ప్రార్థనలో అడుగునది 1. ధైర్యముగా సువార్తను ప్రకటించుటకు అవకాశము 2. వారికి కలిగిన అవకాశములలో వారు ధైర్యముగా సువార్తను ప్రకటించు అవకాశమున్నదని వారు గ్రహించునట్లును ఈ ప్రార్థనలో వేడుకొనిరి. అలాగుననే వారు ప్రకటించిన సువార్త వాక్యమును అనేక స్వస్థత క్రియలు సూచనలు, అద్భుతములు మున్నగువాటితో దేవుడు ధృవపరుచునట్లుకూడా ఎదురు చూచిరి. ఇవి వాక్యాను సారమైన ప్రార్థనలు సువార్త వినునట్టి అవకాశము జనులకు కలుగవలెననునది ఉద్దేశ్యము. వారి ప్రార్థనకు దేవుడు వెంటనే జవాబు ఇచ్చెను, "వారు ప్రార్థన చేయగానే వారు కూడా యున్న చోటు కంపించెను; అప్పుడు వారందరు పరిశుద్ధాత్మతో నిండిన వారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి" (అపొ 4:31).

ఆత్మ సంబంధమైన పంట కోయబడుటకు మంచి అవకాశము లభించబడునట్లు క్రైస్తవులు ఎట్లు ప్రార్థించవలెనని పౌలు ఆలోచించెను. అనేక మందిని రక్షింపవలెనని వారు దేవునిని అడుగునట్లు పౌలు వారికి బోధించెనా? ఆలాగు కాదు కాని,

> తుదకు సహోదరులారా, మాలో జరుగుచున్న ప్రకారము **ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పర్చబడు నిమిత్తమును** (2 థెస్స 3:1).
>
> మరియు నేను దేని నిమిత్తము రాయబారినై సంకెళ్ళల్లో ఉన్నానో **ఆ సువార్త మర్మమును ధైర్యముగా తెలియజేయుటకు** నేను మాటలాడ నోరు తెరచునప్పుడు, దానిని గూర్చి నేను మాటలాడ వలసినట్టుగా, **ధైర్యముతో మాట్లాడుటకై వాక్శక్తి నాకు అనుగ్రహింపబడునట్లు** నానిమిత్తము ను పూర్ణమైన పట్టుదలతో

విజ్ఞాపన చేయుచు మెలకువుగా ఉండుడి (ఎఫెసీ 6:19-20).

ప్రజలు రక్షింపబడుటయా లేదా అనునది దేవుని మీద కంటే సువార్తను విని రక్షణ పొందుటకు అవకాశము కలుగునట్లు ప్రజల కొరకే మన మెక్కువ ప్రార్తన చేయవలెను. సువార్త ప్రకటించు అవకాశము దేవుడు అనుగ్రహించినట్లు ప్రార్థించవలెను. దేవుడు మన ప్రార్థనలకు జవాబిచ్చును. అయితే వినిన వారందరు రక్షణ పొందుదురను నమ్మకము ఏమియు లేదు, ఎందుకనగా సువార్తను విని అంగీకరించుట లేక అంగీకరించకపోవుట అను నిర్ణయాధికారము జనులకే దేవుడు ఇచ్చియున్నాడు. వారు పొందవలసిన రక్షణ కేవలము సువార్త పట్ల వారి ప్రతిస్పందన మీదనే ఆధారపడియున్నది.

## ఇతిహాసము - 7: "ఒక క్రైస్తవుడు పాపములో పడినప్పుడు దురాత్మలోనికి వచ్చి అతని యందు నివసించునట్లు అతడు తలుపులు తెరియును."

ఒక క్రైస్తవుడు పాపములో పడినప్పుడు వాస్తవముగా దురాత్మ వలన శోధించబడి ఆ బలహీనతకు లొంగిపోయి అట్టి పాపములో పడియుండవచ్చును. అపవిత్రాత్మ యొక్క సలహాలకు సూచనలకు లొంగిపోవుట ఎట్లయినను ఆ దురాత్మ తనకు తానుగానే ఒక విశ్వాసి జీవితములోనికి ప్రవేశించెనని అర్థము చేసుకొనుటకు వీలులేదు. క్రైస్తవులముగా మనము పాపము చేయునప్పుడు దేవునితో మనకున్న సహవాస బంధమును మనమే దేవునికి అవిధేయులమై తెంపివేసుకొనుచున్నాము (1 యోహాను 1:5,6). ఆ విషయమై మనము దోష అపరాధ భావము అనుభవించుచూనే యుందుము. దేవునితో మనకున్న ***సంబంధము*** మనము తెగతెంపులు చేసుకొన లేకపోవుటకు కారణము మనమింకను ఆయన పిల్లలమే.

"అయితే మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్ర పరచును" (1 యోహాను 1:9). దేవునితో మనకున్న సహవాసము తిరిగి సమకూర్చబడును. మనము పాపము విషయమై దోషారోపణ, అపరాధ భావము కలిగి పాపములు ఒప్పుకొని దుర్నీతి సంబంధమైన చెడుతనము నుండి పవిత్రపర్చబడుట అనగా మనలోపల ఉన్న దురాత్మ నుండి పవిత్రపర్చబడుట అని అర్థము కాదని యోహాను సూచించుచున్నాడు.

క్రైస్తవుడు ప్రతి దినము శోధనలను ఎదుర్కొనవలసి ఉన్నాడు. ఆ శోధనలు లోకము, శరీరము, మరియు సాతాను అనేకమైన దురాత్మలతో అనుదినము మనము సంఘర్షణ వాస్తవముగా అనుభవించుచున్నామని పౌలు వ్రాయుచున్నాడు (ఎఫెసీ 6:12). గనుక ఎంతోకొంత మేరకు ప్రతి విశ్వాసి దయ్యములు లేక దురాత్మల చేత బాధింపబడుచూనే ఉన్నాడు. దేవుని వాక్యమందలి విశ్వాసము వలన సాతానును మరియు దురాత్మలను మనము ఎదిరించవలసిన బాధ్యత సర్వసాధారణముగా మనపైననే ఉన్నది (1 పేతురు 5:8,9 చూడుము). దేవుడు తన వాక్యమందు ఏమి చెప్పియున్నాడో దానిని మనము నమ్మి దాని ప్రకారము ప్రవర్తించుటయే సాతానును ఎదిరించుటయగును.

ఉదా: నిరాశ, నిస్పృహతో కూడిన తలంపులు సాతాను మన మనస్సులోకి తేవచ్చును.

దేవుని వాక్యములో నిరుత్సాహము, నిరాశకు వ్యతిరేకమైన వాక్య భాగములను మనము వెంటనే మనస్సులోనికి జ్ఞాపకము తెచ్చుకొని దేవుని వాక్యమునకు లోబడి "ఎల్లప్పుడు ఆనందించుడి" (1 థెస్స 5:16) మరియు "అన్నిటియందును దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" (1 థెస్స 5:18)లో చెప్పబడినట్లుగా నడుచుకొనవలెను. దేవుని వాక్యమునకు లోబడి దాని ప్రకారము ప్రవర్తించవలసిన బాధ్యత మన మీదనే ఉన్నది. సాతాను మనమనస్సులో వొప్పించు దుష్ట తలంపులు స్థానములో దేవుని గురించిన మంచి తలంపులతో మన మనస్సు నింపుకొనవలెను.

ఆత్మీయముగా నైతిక స్వేచ్ఛ గలిగిన మనము గుర్తించవలసినది మనము ఆలోచించుటకు కోరుకొందుమో దానిని గూర్చి సరిగా యోచించుట దురాత్మల యొక్క సూచనలను,సలహాలను ఎల్లప్పుడు వినుచుండుటకు, దానికి **లోబడుటకు** ఏ విశ్వాసి నిరంతరము **ఎంపిక** చేసుకొనునో తన మనస్సు తలుపులను తెరచుట వలన తన మనస్సులోనికి అనేక చెడు తలంపులు దుష్ట ఆలోచనలు విస్తారముగా మనస్సులోనికి ప్రవేశించుటకు అవకాశమిచ్చి ఇష్టపూర్వకముగా వాటిని స్వీకరించి మానసికముగా చాలా బాధ వేదన పొందు స్థితిని అనుభవించును.

ఈ దుష్ట ఆలోచనలకు ఇష్టపూర్వకముగా లోబడి పోవుట వలన అతని మానసిక ప్రవృత్తిలో ఎల్లప్పుడును చెడుతలంపులే పుట్టుచు ఉండును. ఒక క్రైస్తవుని మనస్సులో ఇట్టిది సంభవించుట బహు ఘోరమైన దుస్థితి. అయినను చెడు తలంపులకు ఎక్కువ చోటిచ్చుట వలన ఈలాగు జరుగును. క్రమక్రమముగా అతడు క్రైస్తవ జీవిత విశ్వాస విలువలనుండి దిగజారిపోవు పతన స్థితి పొందును[96] మరియు తనపై ఒత్తిడి తీసుకొనువచ్చు దురాత్మ శక్తులకు లోబడి తన శక్తి యుక్తులన్నియు తనను ఆవహించిన దురాత్మ స్వాధీనములోనికి అప్పజెప్పును. అట్లు ఒక పాపము చేసి అపరాధములో పడిపోవుట వలన దురాత్మ లోనికి వచ్చి అతని యందు నివసించుటకు తలుపులు తెరచుట అను అభిప్రాయము బహు తీవ్రమైన వేదనకు అరచి గగ్గోలు పెట్టునట్టి దుస్థితిలోనికి దిగజారిపోవును.

నూతన నిబంధనలో ఏ క్రైస్తవుడైనను ఇట్లు దురాత్మ చేత ఆవహించబడిన దృష్టాంతము ఎక్కడను వ్రాయబడి యుండలేదు లేక పాపములో పడిపోవుట వలన దురాత్మలు వచ్చి వారిలో నివసించును అను హెచ్చరిక క్రైస్తవులకు ఇవ్వబడియుండలేదు. ఇతర క్రైస్తవులలో ఒకవేళ వారుదురాత్మలను కలిగియుంటే అవి ఎట్లు వారిలో నుండి వెడలగొట్టవలెనో ఎచ్చటను బోధించబడి యుండలేదు.

క్రైస్తవులుగా మనము ఎరుగవలసిన సత్యము ఏమంటే మనలోపటి నుండి దురాత్మలను వెడలగొట్టవలసిన ఆవశ్యకత లేదు. దేవుని వాక్యము వలన దినదినము మన మనస్సులు నూతన పర్చబడుటయే మన ఆవశ్యకత. ఇది వాక్యానుసారమైన విషయము.

[96] "ఒకసారి రక్షించబడితే అతడు ఎల్లప్పుడును రక్షణ స్థితిలోనే ఉండును" అను అభిప్రాయము కలిగిన కొందరు ఈ విషయమును వారు ఏ మాత్రమును అంగీకరించరు. అట్టి వారు రోమా 11:22, 1 కొరింథీ 15:1-2; ఫిలిప్పీ 3:18-19; కొలస్స 1:21-23 మరియు హెబ్రీ 3:12-14 చదివి ప్రత్యేకమైన గమనికతో "అయితే" అనునది ఎక్కడెక్కడ వచ్చునో గమనించవలెను

మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి (రోమా 12:2).

మన మనస్సులు ఒక పర్యాయము పాత ఆలోచన ధోరణి నుండి పవిత్రీకరించబడి దేవుని వాక్య సత్యము వలన నూతన పర్చబడుచు పాప దురలవాట్లపై విజయము పొంది క్రీస్తును పోలిన జీవిత విధానములో దిన దినము జీవింపసాగుదము. సత్యము మనలను స్వతంత్రులునుగా చేయును (యోహాను 8:32). మన మనస్సులు రూపాంతరము చెంది నూతన పర్చబడును. అంతేగాని అపవిత్రాత్మలు మనయందు ఉండుటకు ఏ మాత్రమును అవకాశము ఇవ్వము.

క్రైస్తవులలో అనేకులు ఎందువలన తమలో ఉనికి కలిగిన దురాత్మలు వెడలిగొట్టబడినవని అనుచున్నారు? కేవలము ఒక భ్రాంతి లేక భ్రమ గాను తమ యందు దురాత్మ యెకటి నివసించియున్నదని అది వెడలగొట్టబడి యున్నదని ఊహించుకొనుచూ ఉందురు. ఊహించుకొనుట అనునది ఒక అవకాశము. చాలామంది క్రైస్తవులకు దేవుని వాక్యమును గూర్చిన లోతైన జ్ఞానము అనుభవము లేకపోవుటయే కారణము. అట్టి వారే "దయ్యములను వెడలగొట్టు దైవసేవకుల" చేతులలోనికి బాధితుల వలె వెళ్ళుచూ ఉందురు. అట్టి బోధకులు ప్రతి చిన్న ఇబ్బంది బాధ అన్నింటికి దయ్యములే కారణము వాటిని వారిలో నుండి వెడలగొట్టవలెనని వారు బోధించుచుండిరి. తమ లోపట ఒక దురాత్మ నివాసము ఉన్నదని అనుకొనినప్పుడు ఆ దురాత్మ వెడలగొట్టు వారితో అన్ని విధముల వారికి సహకరించుచుందురు.

వారిలో ఉన్న దురాత్మలను వెడలగొట్టబడినప్పుడు ఆ ప్రజలు క్రీస్తు నందు నిజమైన విశ్వాసులుగా ఉండజాలరు. కాని వారు తామింకా విశ్వాసులనే భ్రమలో నిలిచి యుందురు. ఆధునిక సువార్త, బైబిలు సంబంధిత సువార్తకు వ్యత్యాసము కలిగి యున్నది. క్రైస్తవేతరులతో తమ్మును పోల్చుకొని వారు తాము క్రైస్తవులమే అని నిజమైన క్రైస్తవులకు మాకు ఏమీ వ్యత్యాసము లేదు అయితే వారి జీవితములలో యేసు ప్రభువు జీవించి లేడు. దేవుని వాక్యములో మనము కనుగొనునది జనులు సువార్తను నమ్మి వారు తిరిగి జన్మించినప్పుడు వారి యందు ఇంతవరకు నివసించి యుండిన దురాత్మలు వారిలో నుండి వెలుపలికి వచ్చివేయును (అపొ 8:5-7). ఎవరి యందు పరిశుద్ధాత్మ నివాసము చేయుచుండునో అట్టి వారు తిరిగి జన్మించిన వారై యుండిరి గనుక పరిశుద్ధాత్మ వారిలో నివసించును, కావున దయ్యము వారి జీవితములలోనికి ఏ మాత్రమును ప్రవేశించి నివసించజాలదు.

**ఇతిహాసపు కథ - 8: *"ఒక పట్టణము యొక్క చరిత్రను ధ్యానించుట వలన ఏ దురాత్మ శక్తులు ఆ పట్టణమును ఆక్రమించియున్నవో మనము తీర్మానించగలము మరియు***

## శక్తి వంతమైన ఆత్మీయ పోరాటము సలిపి తుట్టతుదకు సువార్తీకరణ శక్తివంతముగా చేయగలము

ఈ ఇతిహాసపు కథ వివిధమైన అభిప్రాయముల మీద ఆధారపడినదే గాని లేఖనాధారము మీద ఉండినది కాదు. దీర్ఘకాలము ప్రాంతీయమైన దురాత్మలు ఆ స్థానమును ఆవరించుకొని అక్కడనే తరుగులాడుచుండినను ఒక అభిప్రాయము కలదు. వంద సం॥ల క్రితము ఆ స్థలమును ఆవరించిన దురాత్మలు అదే పట్టనముపై కొన్ని వందల సం॥లుగా నివసించుచు కొనసాగుచున్నవి. ఆ పట్టణములో ఒకప్పుడు అత్యధిక దురాశ, పేరాశ గలిగిన దురాత్మలు నిలువరముగా ఆవరించియున్నప్పుడు ఆ పట్టణములో ప్రజలు కూడా మిక్కటమైన దురాశ పేరాశలతో జీవించుచు ఉండెడి వారు. ప్రాచీన కాలము నుండి భారత దేశములో చేతబడి, చిల్లంగి మొ॥ చెరుపు చేయు దుష్ట క్రియలతో నిండిన మనుష్యులు ఉండినప్పుడు అట్టి దుష్టాత్మలు అనేక సంవత్సరములుగా మనుష్యులలో దుర్మార్గ క్రియలు చేయుచు అక్కడనే ఉందురు.

భౌగోళికముగా ఒకే ప్రాంతమందు ఆవరించి యుండిన ప్రధానులు చీకటి శక్తులు వందల కొద్ది సంవత్సరములు ఒకే ప్రదేశమందే నిలిచి ఉండునా? అలాగు ఉండవలసిన అవసరత లేకపోవచ్చును.

దానియేలు 10వ అధ్యాయములో మనమింతకు ముందు చూచిన వృత్తాంతమును ఆలోచింతుము. పేరు లేని ఒక దేవదూత ప్రధాన దూతయైన మిఖాయేలు సహాయముతో పారశీక అధిపతితో పోరాడినట్లు దానియేలు తెలియజేయుచున్నాడు. ఆ దూత "నేను పారసీకుడగు అధిపతితో యుద్ధము చేయుటకు మరల పోయెదను. నేను బయలుదేరుచుండగానే గ్రేకీయుల దేశముయొక్క అధిపతి వచ్చును" (దాని 10:20). అలెగ్జాండర్ యుద్ధము సలిపి పారశీక రాజును జయించి పారశీక సామ్రాజ్యమంతటిని స్వాధీన పరుచుకొనునని చరిత్ర తెలియజేయుచున్నది. కనుక పేరు లేని ఈ దేవదూత ఆత్మీయ ప్రపంచములో ఏమేమి మార్పులు సంభవించబోవుచున్నవో "గ్రేకీయుల అధిపతి" వచ్చుట మున్నగు వాటిని గూర్చి ముందుగానే తెలియజేయుచున్నాడు.

ఇంతకు మునుపు ఈ పారశీక దేశము మీద అధిపతిగా ఉన్న దురాత్మ ఓడింపబడిన పిమ్మట అదే సామ్రాజ్యమును గ్రీకుల వశములోనికి రాగా గ్రేకీయుల దురాత్మ పారశీక అధిపతి వలె అదే ప్రదేశము మీద ఆవరించి యుండి పరిపాలన చేయునా? ఈ ఆత్మీ ప్రపంచములోని అధిపతియైన ఈ దురాత్మలు పరిపాలించుట హేతుబద్ధమైన సరియైన కారణము కావచ్చునా. ఒకవేళ అది వాస్తవమైన యెడల దురాత్మలలో మిక్కిలి హెచ్చైన తరగతులలో ఉన్న అధికారములు గల దురాత్మలు భౌగోళిక ప్రదేశములలో మార్పు చోటు చేసుకొనవచ్చును. గ్రేకీయుల సామ్రాజ్యము పారశీకుల సామ్రాజ్యమంతటిని ఈ దురాత్మల పరిపాలనలో ఒకరిని మరియొకరు దురాక్రమణ చేసియున్నారు. భూమి మీద రాజకీయ పరముగా ఒక ప్రభుత్వము మారి ఇంకో ప్రభుత్వము యేలాగు వచ్చునో ఈ చీకటి రాజ్యపు పరిపాలనలో ఆలాగనే ప్రాంతీయ

మార్పులు జరుగును. ఇందలి పూర్తి వాస్తవము మనము ఎరుగము కాని, దేవునికి సమస్తము తెలియును.

ఇంతకు మునుపు మనము తెలుసుకొనునట్లు ఈ ఆత్మీయ పోరాటము విషయములో మనము చేయగలిగినది ఏదియు లేదు. ఒక భౌగోళిక ప్రదేశములో ప్రాంతీయముగా దురాత్మలు ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతమునకు వారు అధికార మార్పులు చేసుకొనినను మనకేమి నిమిత్తము లేదు.

## దురాత్మలను ఎక్కువగా వర్గీకరించటం

కొన్ని పరిపాలనాధికారము గలిగిన దురాత్మలు కొన్ని ప్రత్యేకమైన పాపములు చేయించుటలో ప్రసిద్ధులుగా ఉందురని కొంతమంది ఆలోచన "దురాశ పుట్టించు దురాత్మలు", "శరీర ఆశలు పుట్టించు దురాత్మలు" మత నిష్ట మూఢ మత విశ్వాసాలు పుట్టించు దురాత్మలు, విబేధాలు, కలహములు పుట్టించు దురాత్మలు." ఈ విధముగా అనేక విధములైన కోపతాపము రాగ ద్వేషము, అసూయ, అల్లరి, మత్తు పదార్థమును సేవించుట మొద॥ అనేక పాపములు చేయించు దురాత్మలు అనేకము ఉండవచ్చును. అయితే వీటికి లేఖనాధారమేమియు లేదు. అంధకార రాజ్యమును పరిపాలించు ఉన్నత శ్రేణి చెందిన దురాత్మలు ఇటువంటి పాప లక్షణములను కలిగించును అనుదానికంటే తక్కువ స్థాయికి చెందిన దురాత్మలే ఇటువంటి చెడుపనులు చేయుటకు ప్రేరేపించునని తెలియవచ్చును.

ఎవరైతే ఆ నాలుగు సువార్తలను జాగ్రత్తగా గమనించకవుండిరో వారికి యేసు కేవలం మూడు రకముల దురాత్మలను వెడలగొట్టటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒకప్పుడు ఆయన "మూగ దయ్యమును" వెళ్లగొట్టుచుండెను (లూకా 11:14) మరియొకసారి "చెవిటిదైన మూగదయ్యము" వెళ్ళగొట్టినట్లు వ్రాయబడెను (మార్కు 9:25). ఒకటి కంటే ఎక్కువ సార్లు "అపవిత్రాత్మలను" వెడలగొట్టునట్లు వ్రాయబడెను. చెవిటిదైన మూగదయ్యము ఒక వ్యక్తికి చెవిటి తనము, మూగతనము మాత్రమే కాక ఇంకా ఏదైనా హాని ఆ వ్యక్తికి చేయునా, మార్కు 9వ అధ్యాయంలో ఆ వ్యక్తికి చెవుడు మూగతనము గాక ఇంకా వేరు విధములైన బాధలను కలుగజేసినట్లు చూడగలము. మనలో చాలామంది ఈ దయ్యపు ఆత్మలను గూర్చి వర్గీకరణ చేయుట యందు బైబిలు ఆధారము లేకుండానే వాటి విషయమై ఎక్కువ ఆసక్తి చూపుదురు.

పాతనిబంధన అంతటిలో ఒక ప్రత్యేకమైన దురాత్మలను గూర్చి పేర్కొనబడినది. అది "మోసపుచ్చు ఆత్మ (1 రాజులు 22:22-23), యెషయా 19:14లో "మూర్ఖతగల" ఆత్మను గూర్చియు, (హోషేయ 4:12; 5:4)లో "వ్యభిచారపు ఆత్మ" సాధారణముగా దురాత్మ లన్నియు మోసపుచ్చు ఆత్మలుగాను, మూర్ఖత అగపరచు ఆత్మలు గాను ఉదహరింపబడినవి గాని, మూడవది అయిన వ్యభిచార కోరికను పుట్టించు దురాత్మ ఒక ప్రత్యేమైన దురాత్మగా కాక సహజముగా అనేకులలో పనిచేయు దురాత్మగా దాని పేర్కొనవచ్చును.[97]

[97] సంఖ్యా 5:14-30లో "అసూయపుట్టించు ఆత్మ" కలదని చెప్పబడి ఉన్నది. సామె 16:18లో "అహంకారపు ఆత్మ" గూర్చి వ్రాయబడి ఉన్నది. (తరువాయి భాగం పక్క పేజీ లో చూడుము)

అపొ. కార్యములు అంతటిలో ఒక ప్రత్యేకమైన దురాత్మను గూర్చి వ్రాయబడి ఉన్నది (అపొ. 16:16). ఒక యౌవన భౌతిక "సోదెచెప్పు దురాత్మ" చేత ఆవహించబడునట్లు వ్రాయబడెను. అయితే పత్రికలన్నిటిలో ఎక్కువ ప్రత్యేకముగా పేర్కొనబడిన దురాత్మలు "మోసపుచ్చు ఆత్మలు" (1 తిమోతి4:1) మరలా ఇది కూడా ఒక దురాత్మను గూర్చిన వివరణయే.

బైబిలులో వివిధ రకములైన దురాత్మలను గూర్చిన ఉదాహరణలు కలవు. కొన్ని వందల కొలది దురాత్మలు ఒకవ్యక్తిలో ఒక పట్టణము మీద గాని ఆవహించి ఉండునట్టి దురాత్మల పేరులు జాబితాలు వందల కొలదిగా ఉన్నవి.

ఏదో ఒక విధమైన వర్గీకరణ ఈ దురాత్మల విషయములో కలదని మనము భావించినను అత్యున్నత శ్రేణిలో ఉన్న కొన్ని దురాత్మలు ఏదో ఒక ప్రత్యేకమైన పాపము చేయుటకు ప్రేరేపించుటలో ప్రసిద్ధికలదు. పలాన పట్టణములో జూదము ఎక్కువ జరుగుట ప్రసిద్ధి గనుక ఆ పట్టణము మీద మనుష్యులలో జూదపు మనస్సు కలుగజేయు దురాత్మలచేత ఆవరింపబడి ఉండవచ్చునని కొందరు భావింతురు.

## పొగత్రాగుట ప్రేరేపించు దురాత్మలు

ఎవరైనా ఒకరు బుద్ధిహీనముగా ఈలాగు చెప్పవచ్చును. "ఆ పట్టణములో అనేకులు చుట్ట, బీడి, సిగరెట్ మొద॥ పొగత్రాగు వారు అసంఖ్యాకములుగా ఉన్నారు." గనుక ఆ పట్టణముపై పొగత్రాగుటకు ప్రేరేపించు ఆత్మలు గలవని భావించుదురు. ఆ పట్టణము అక్కడ కట్టబడక మునుపు ఈ పొగత్రాగుటకు ప్రేరేపించు దురాత్మలు ఎక్కడ ఉండెను? పొగాకు ఉపయోగములోనికి లేక పూర్వము ఈ దురాత్మలు ఏమిచేయుచుండెను? ప్రస్తుత కాలములో అనేకులు పొగత్రాగుటకు నిషేధింపబడి మానివేయుచున్నారు. ఈ "పొగత్రాగుటకు ప్రేరేపించు దురాత్మలు" ఈ ప్రాంతము విడిచి వేరొక ప్రాంతము వెళ్ళిపోవునా?

"పలాన పట్టణము శరీర దురాశలకు లోబడి వారి చేతనింపబడి ఉన్నది. గనుక ఆ పట్టణముపై శరీర దురాశలను ప్రేరేపించు దురాత్మలు ఆవరించి ఉన్నవనియు అందుచేతనే ఆ పట్టణము అధిక సంఖ్యలో వేశ్య గృహముల చేత నింపబడి ఉన్నవని చెప్పుటయు మున్నగునవి బుదిహీనముగా మాట్లాడుట కాదా?" ఏ ప్రదేశములో ప్రజలు క్రీస్తును ఆరాధించరో ఆ ప్రదేశములో చీకటి శక్తులు రాజ్యమేలుచుండును అనునది సత్యము. అట్టి చీకటి ప్రదేశములో ఉండు దురాత్మలు మనుష్యులను చెడుతనము దుర్మార్గత మొ॥ పాపములు చేయుటకు ప్రేరేపించి ఆ మనుష్యులు కూడా దేవునికి వ్యతిరేఖముగా చేయుటకు ప్రేరేపించుదురు. ఆ దురాత్మలు పాపము చేయగల అనేక విభాగములలో మనుష్యులను శోధిస్తూ ఉంటాయి. అనేక స్థలములలో ప్రజలు ఆ పాప శోధనలకు లొంగి పోయి స్వేచ్ఛగా ఎక్కువ పాపములు చేయుదురు. ఒకేఒక నిరీక్షణ కలదు. అదేమనగా మనము క్రైస్తవ సువార్తను అత్యధికముగా ప్రకటించుట

---

ఒక సాధారణమైన దురాత్మగా కాక తన్ను తాను గర్వముతో, అతిశయముతో హెచ్చించును కొను మనస్సు గలిగిన దురాత్మను గూర్చి ఇక్కడ వ్రాయబడియున్నది. సంఖ్యా 14:24లో కాలేబును గూర్చి ప్రస్తావించు మంచి మనస్సు అను ఆత్మ గలవాడు. అనగా కాలేబు యొక్క మంచి ప్రవర్తన గూర్చి చెప్పబడి ఉన్నది.

వలన దురాత్మ శక్తులు వాటి ప్రభావము సన్నగిల్లును.

ఆయా భౌగోళిక ప్రదేశములను కొన్ని ప్రత్యేక వర్గములకు చెందిన దురాత్మలు స్వాధీనమందుంచుకొని కొన్ని ప్రత్యేక పాపములు మనుష్యుల వలన చేయించుటకు ప్రేరేపించుచు ఉండును. గనుక మనము వారిని అక్కడ నుండి తొలగింపలేము గాని మనము కేవలము దేవుని వాక్యమును అనుసరించి వారి కొరకు ఎక్కువ ప్రార్థన చేయుచు ప్రజలు మోసగింపబడకుండా వారికి సువార్తను ప్రకటించవలెను.

ఆ ప్రాంతములో నివసించుచుండు రక్షణ పొందని అనేకులకు వారి మనస్సాక్షి బహుగా ఒప్పుదల చేయునట్లు సువార్త వారికి బోధింపవలెను. కొన్ని ప్రత్యేకమైన పాపములను గూర్చి గట్టిగా హెచ్చరించి వారి పాపములను దేవుని యెదుట ఒప్పుకొనవలసినది అని బోధింపవలెను. ఒక పట్టణము యొక్క చరిత్రను మనము కూలంకషముగా తెలుసుకొని అక్కడ ఏయే పాపములు జరుగునో అని తెలుసుకొనవలసిన అవసరత లేదు. మనము ఆ ప్రదేశములను దర్శించి మన కన్నులతో ఆ ప్రదేశమందలి ప్రజలు ఏయే పాప క్రియలలో ఉన్నారో తెలుసుకొని వారి కొరకు ప్రత్యేకముగా ప్రార్థన చేయవలెను.

నూతన నిబంధనలో ఎక్కడను కూడా ఆత్మ సంబంధమైన చిత్ర పటము తయారు చేసి అక్కడ ఏ ప్రసిద్ధమైన పాపములు జరుగుటకు దురాత్మలు ప్రేరేపించునో వారితో ఆత్మీయ పోరాటములు సలుపుటకును సువార్తీకరణ జరిగించుటకును ఏ చిత్ర పటమును రూపొందించవలసిన అవసరము లేదు. ఏ ప్రాంతములలో ఎట్లు సువార్త ప్రకటించవలెనను సూచనలు ఏవి నూతన నిబంధన లేవు. ఎక్కడ సువార్త ప్రకటించవలెనో కేవలము పరిశుద్ధాత్మయే అపొస్తలులను నడిపించియున్నారు. సువార్త ప్రకటన వలన ప్రజలను పశ్చాత్తాపములోనికి నడిపించుట గాని, ప్రభువు మీద ఆనుకొని పరిచర్య చేయుటకు ప్రభువైన యేసు తన వాక్యమును ఆయన తానే స్థిరపరచుచుండెను. వారు ప్రకటించిన వాక్యమును స్థిరపరచును. అనేక అద్భుతములు, సూచక్రియలు జరుపబడెను. ఈ విధానము సువార్త ప్రకటించుటకును అనేకులను క్రీస్తు ప్రభువు రక్షణలో నడిపించుటకును విజయవంతముగా ఉపయోగించబడెను.

## ఇతిహాసపు కథ - 9: "కొందరు క్రైస్తవులు వారి పూర్వ వంశీకుల యొక్క లేక సాతానీయమైన పాపముల నుండి విడిపించవలసిన అవసరత కలిగియున్నారు."

"వంశపారంపర్యముగా శాపపు స్థితి" అను దానిని గూర్చి పాత నిబంధనలోని నాలుగు ప్రాముఖ్య లేఖన భాగములలో నుండి తీసుకొనబడినవి అవి ఒకే ప్రాధాన్యతను గూర్చి సమముగా వ్రాయబడి యున్నవి (నిర్గమ 20:5; 344:7; సంఖ్యా 14:18; ద్వితీ 5:9) మనము ఇప్పుడు సంఖ్యా 14:18లోని వాక్యభాగము చూతుము,

> దోషమును అతిక్రమమును పరిహరించువాడు, అపరాధిని నిరపరాధిగా
> ఎంచక ***మూడు, నాలుగు తరముల వరకును తండ్రుల***
> ***దోషమును కుమారుని మీదికి తెచ్చువాడునై యున్నాడని***

ఈ లేఖన భాగమును మనము ఏ విధముగా వివరింతుము? ముత్తాతలు, తాతలు ఇంకా వారి పూర్వీకులు, తల్లిదండ్రులు మున్నగు వారి దోషమును, వారి పాపములను దానికి వచ్చు శిక్షను వారి బిడ్డల మీదికి దేవుడు రప్పించును అను మాటల యొక్క అర్థమేమి? ఒక వ్యక్తి తన పాపముల విషయమై పశ్చాత్తాపపడి యేసును రక్షకునిగా నమ్మి అంగీకరించిన తరువాత అదే వ్యక్తి మీద అతని తల్లిదండ్రులు, తాత ముత్తాతలు వారి పూర్వీకుల పాపదోషములను శిక్షను అతని మీదకి రాజేయునా?

ఏ మాత్రము అట్లు కానేరదు. ఒకవేళ ఆ ప్రకారము చేసియుండిన యెడల దేవుడు అన్యాయస్థుడని, వేషధారియని దూషింపబడును. అతని తల్లిదండ్రుల పాపమును బట్టి ఒక వ్యక్తిని శిక్షించుట నైతికముగా సరికాదని ఆయనే సెలవిచ్చెను:

> కుమారుడు తన తండ్రి యొక్క దోష శిక్షను ఏల మోయుట లేదని మీరు చెప్పుకొనుచున్నారు. కుమారుడు నీతి న్యాయమును అనుసరించి నా కట్టడలన్నిటిని అనుసరించి గైకొనెను గనుక అతడు ఆవశ్యముగా బ్రదేకును. పాపము చేయువాడే మరణము నొందును; ***తండ్రి యొక్క దోషశిక్షను కుమారుడు మోయుట లేదని కుమారుడు దోష శిక్షను తండ్రి మోయడు.*** నీతిపరుని నీతి, ఆ నీతి పరునికే చెందును, దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును (యెహెజ్కేలు 18:19-20).

అయినప్పటికి మోషే ధర్మశాస్త్రమందు తండ్రి గాని, కుమారుడు గాని వారి దోషశిక్షను ఒకరి పాపములకు మరియొకరు అనుభవించరని దేవుడు ఆజ్ఞాపించెను:

> కుమారుల దోషమును బట్టి తండ్రులకు మరణశిక్ష విధింపకూడదు, తండ్రుల దోషమును బట్టి కుమారులకు మరణశిక్ష విధింపకూడదు. ఎవని పాపము నిమిత్తము వారే మరణ శిక్ష నొందును (ద్వితీ 24:16).

తన పూర్వీకుల పాపము నిమిత్తమై ఎవరైనా ఒకనిని ప్రేమయు, నీతియు గలిగిన దేవుడు ఒకరి దోషమునకు మరి యొకరిని, ఒకరి శాపమునకు మరియొకరిని శిక్షించు అవకాశమే లేదు.[98] "మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుదునని వారి దోషమును ఏ మాత్రము దేవుడు పరిహరింపడు" అను మాటల యొక్క

[98] తల్లిదండ్రుల పాపము వలన పిల్లలు ఏ మాత్రము బాధనొందని సర్వసాధారణముగా చెప్పుచుందురు. వారు ఆలాగు చెప్పినపుడు తల్లిదండ్రుల పాపములకు పిల్లలను దేవుడు శిక్షించును అను దానిని అది సూచించదు. అయితే జనులు బహు దుష్టులై పాపపు దురలవాట్లను మానక చేయుచుండిన యెడల వాటి దుష్టఫలితము వారి పిల్లలు అనుభవించవలసి వచ్చునని సూచించును. అయితే దేవుని వాక్యము మనకు స్పష్టము చేయునది ఏమనగా దేవుడు దయ చూపుతూ వారి మీద ఇప్పు డు కుమ్మరించ వలసిన తీర్పును ఆ వ్యక్తి మీద ఆపుచేసి ఆటు తరువాత వచ్చెడి వారి సంతానము మీద ఒకవేళ ఆయన వారు అనుభవించునట్లు చేయవచ్చును. ఒక తరము వారి మీద క్రుమ్మరించవలసిన తీర్పు ఆయన కనికరపడి, దయచూపి అప్పటికి నిలుపుదల చేసి అటుతరువాత వచ్చెడి తరము వారికి వారి దుష్టత్వము వలన వారి మీద క్రుమ్మరించవచ్చును (యిర్మి 16:11-12). తాత ముత్తాతల పాపమును బట్టి ఒక వ్యక్తిని శిక్షించుట అను దాని వ్యత్యాసము ఇందు మనము చూడవచ్చును.

అర్థమేమి?

కుమారుల యెదుట తమ దుష్ప్రవర్తన లేక చెడుతనమును కనుబరచు వ్యక్తులను వారి చెడ్డ మాదిరిని బట్టి, వారిని బాధ్యులుగా దేవుడు ఎంచకుండునా? ఒక వేళ తల్లిదండ్రుల దుర్నడతలను బట్టి వారి చెడ్డ మాదిరిని అనుసరించి వారి పిల్లలు చెడుతనములో జీవించిన యెడల ఆ కారణమును బట్టి వారి తల్లిదండ్రులను దేవుడు శిక్షింపవచ్చును. ఆ విధముగా ఒకవేళ దేవుడు వారి తల్లిదండ్రులు, తాత ముత్తాతలు యొక్క చెడ్డ మాదిరిని వారి బిడ్డలు అనుసరించిన యెడల ఆయన వారిని శిక్షించును అనుటలో పరిశుద్ధ దేవుడు అన్యాయస్థుడు కానేరడు.

ఇప్పుడు మనము ఆలోచించిన వాక్యభాగము చెప్పునది ఏమనగా, "తండ్రుల దోషము కుమారులపై వేయబడును" తండ్రుల యొక్క దోష క్రియలు కుమారుల పైకి వచ్చుట అను దానిని వంశపారంపర్య శాపము అందురు. ఇది ఒక మూఢనమ్మికగా ఉండి దేవుడు అవినీతిపరుడు అని భావించే ఒక ధురభిప్రాయము ఏర్పడును.

## సాతానీయమైన శాపములు

సాతాను సంబంధమైన శాపములను గూర్చి ఏమి తలంతుము?

మొట్టమొదటిగా బైబిలంతటిలో ఎక్కడను సాతాను ఏ వ్యక్తి మీదనైనను శాపము కలుగజేయునని ఎక్కడను వ్రాయబడి ఉండలేదు. అట్టి విధమైన ఉదాహరణములు బైబిల్లో ఎక్కడను కానరావు. అయితే సాతాను ప్రజలను బాధించుట అనునది బైబిలులో చూడగలము. అంతేగాని ఒక కుటుంబము మీద శాపము ఉంచి సర్వకాలము వారు వారి తర్వాత వచ్చు తరముల వారు అట్టి దురదృష్టమును శాపఫలితముగా అనుభవించుదురని బైబిల్లో ఎక్కడను లేదు.

క్రైస్తవులు కూడా సాతాను చేతను దురాత్మల చేతను కొద్దిగానో, ఎక్కువగానో పీడించబడుట వారి జీవితములో ఉండవచ్చును. అయితే ఎవరో ఒకరు ఈ సాతానీయ శాపమును తల్లిదండ్రులో లేక వంశపారంపర్యముగా మన మీదకు వచ్చునట్లు చేసిరి అని మనము అర్థము చేసుకొనుటకు వీలులేదు. మనము చేయగలిగినంత వరకు దేవుని వాక్యము మీద నిలిచి ఉండి విశ్వాసముతో సాతానును ఎదిరించుటయే. లేఖనములో ఈ ప్రకారము చేయవలెనని వ్రాయబడి ఉన్నది (1 పేతురు 5:8-9 చూడుము).

బైబిలు గ్రంథమందు ఆశీర్వదించుటకు గాని శపించుటకు గాని దేవునికే అధికారమున్నట్లు మనము చూడగలము (ఆది 3:17, 4:11, 5:29, 8:21, 12:3, సంఖ్యా 23:8; ద్వితీ 11:26, 28:20, 29:27, 35:7, 2 దినవృత్తాంతములు 34:24, కీర్తన 37:22, సామె 3:33, 22:14, విలాప 3:65, మలాకి 2:2, 4:6 చూడుము). చాలామంది మనపైన శాపనార్థాలు పెట్టుదురు గాని వాటికి ఏ మాత్రము శక్తి ఉండదు:

రెక్కలు కొట్టుకొనుచు తారాడుచున్న పిచ్చుకయు దాటుచుండు వాన
కోవెలయు దిగకుండునట్లు హేతువు లేని శాపము తగలకపోవును

(సామె 26:2).

బాలాకు అను రాజు బిలాము అను ప్రవక్తను ఇశ్రాయేలు వారిని శపించుటకు కూలికి కుదుర్చుకొనెను. అయితే బిలాము, "దేవుడు శపించని వారిని నేను ఏలాగు శపించగలను, దేవుడు భయపెట్టని వానిని నేను ఏమని భయపెట్టగలను?" (సంఖ్యా 23:8).

కొంతమంది క్రైస్తవులు ఇతరుల మీద శాపవచనములను పలుకుటకు (మార్కు 11:23) లోని యేసు మాటలను ఆధారము చేసుకొని, "ఎవడైనను ఈ కొండను చూచి నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మిన యెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను"

కేవలం మాటలు పలుకుట యందు శక్తి ఉండదు. అయితే ఒకడు హృదయమంతటితో నమ్మి ఆ మాటలు పలికిన యెడల సరి. అయితే ఒకడు విశ్వాసము కలిగి మరొక వ్యక్తికి వ్యతిరేకముగా శాపవచనములు పలికిన యెడల ఆ వ్యక్తికి ఏదైనా హాని జరుగుననుటకు వీలు లేదు. ఎందుకనగా విశ్వాసమనునది నిశ్చయముగా జరుగును అను ఒక గాఢ నమ్మిక (హెబ్రీ 11:1), అయితే విశ్వాసము దేవుని వాక్యము వినుట వలన కలుగును (రోమా 10:17). ఒక వ్యక్తి ఎవరి మీదనైనను శాపవచనము పలికినప్పుడు అతనికి ఏదైనా హాని దురదృష్టము కలుగవచ్చునని నిరీక్షించుచు, ఏమాత్రము విశ్వాసము లేకుండిన యెడల అతడు గ్రహించవలసినది ఏమనగా మనుష్యులను శపించుటకు దేవుడు ఏ మాత్రమైనను విశ్వాస సంబంధమైన వాగ్దానములు ఇచ్చుట లేదు.

దేవుడు ఒకనికి విశ్వాస వరము అనునది అనుగ్రహించి యుండిన యెడల దానితో కూడా ప్రవచన వరము ఇచ్చిన యెడల ఆ వ్యక్తి అతని నోటితో ఆశీర్వచనమేగాని, శాపవచనమే గాని పలుకునట్లు దేవుడు పాతనిబంధనలో ఆ వరము అనుగ్రహించియున్నాడు. (ఆది 27:27-29, 38-41; 49:1-27, యెహోషువ 6:26, దానితో పాటు 1 రాజులు 16:34, న్యాయాధి 9:7-20, 57; 2 రాజులు 2:23, 24 చూడుము). ఈ వృత్తాంతములలో కూడా ఆశీర్వచనముగాని, శాప వచనము గాని దేవుని వద్ద నుండియే వచ్చినవి గాని, మనుష్యుని వద్దనుండి కాదు. అందుచేత ఎవరైన ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి మీద "శాపవచనము పలుకుట" వలన అతనికి ఏదో హాని జరుగునని భ్రమ లేక మూఢనమ్మిక. అందుచేతనే యేసు తన బోధలో మిమ్మును "శపించు వాడిని దీవించుడి" గాని మిమ్మును శపించువారిని శపించవద్దని చెప్పెను. అందుచేత ఎవరు మనలను శపించిన ఆ శాపవచనములకు వెరువనవసరము లేదు. కొంతమంది సంఘ కాపరులను నేను కలిసినప్పుడు మిక్కిలి ఆయాసకరమైన విషయమేదనగా వారు దేవుని శక్తి మీద కంటే సాతాను శక్తి మీద ఎక్కువ విశ్వాసముంచినట్లుగా కనబడిరి. సాతాను రాజ్యమునకు పలు విదములైన నాశనమొనరించుచు అనేక దేశములలో నేను సంచారము చేయునప్పుడు నా మీద ఎట్టి విధమైన సాతాను శాపము గాని, భయాందోళనలు గాని కలుగనేరవు. నేను భయపడవలసిన అవసరత లేదు.

## చేతబడి, చిల్లంగి మొ॥ చేష్టల వలన కలుగు శాపములు

పూర్వపు చీకటి శక్తుల పూజా మున్నగు కార్యక్రమములలో పాల్గొని చేతబడి, చిల్లంగి చెరుపు మొ॥ చీకటి కార్య కలాపములలో పాల్గొని వాటిని చేయుట మాని వేసిన తరువాత ఆ సాతాను సంబంధమైన శాపము ఒకరి మీదకు వచ్చుటకు అవకాశము కలదా?

మనము దేవుని రాజ్యము కొరకు క్రొత్తగా జన్మించినప్పుడు సాతాను అధికారము నుండియు అంధకార రాజ్యము యొక్క ఆధీనము నుండియు విడిపించబడి యున్నాము అనే సత్యమును మనము ఎప్పుడు జ్ఞాపకము ఉంచుకొనవలెను (అపొ 26:18, కొలస్స 1:13 చూడుము). మనపై అధికారము సాతానుకు మనంతట మనము ఇస్తేనే తప్ప సాతాను మనపై ఏ మాత్రము పట్టు కలిగియుండడు. ఎఫెసు సంఘములో చాలా మంది క్రైస్తవులు వారు మారు మనస్సు పొందుటకు పూర్వము ఈ చీకటి మంత్ర తంత్ర సంబంధమైన కార్యకలాపములలో నిమగ్నమై యుండిరని బైబిలు తేటతెల్లము చేయుచున్నది (అపొ 19:18-19 చూడుము). ‘‘సాతాను యొక్క శాపములను’’ పౌలు బ్రద్దలు చేయుట గాని, సాతాను అంధకారమును బంధించుట గాని ఆయన చేసినట్లు ఎక్కడను వ్రాయబడి యుండలేదు. వారు తిరిగి జన్మించిన తరువాత ఇక వాటి ప్రస్తావన పౌలు తెలుపలేదు. ఎందుకనగా యేసు నందు వారు ఎప్పుడు విశ్వాసముంచుటకు ప్రారంభించిరో అప్పుడే వారు సాతాను అధికారము నుండియు, పరిపాలన నుండియు వారు విడుదల పొంది క్రీస్తు నందలి స్వేచ్ఛను యదేచ్ఛగా అనుభవించుచుండిరి.

‘‘వంశపారంపర్యమైన’’ మరియు ‘‘సాతాను సంబంధమైన శాపముల’’ నుండి ఎవనినైనను ఆయన విడుదల కలుగచేయుటకు ఎఫెసులోని, క్రైస్తవ సంఘమునకు పౌలు ఏ విధమైన ఆజ్ఞలు ఇచ్చి ఉండలేదు. కేవలము అతను వారికి వ్రాసినది, ‘‘సాతానుకు ఏ విధమైన అవకాశము ఇవ్వకుడి’’ (ఎఫెసీ 4:27) మరియు ‘‘దేవుడిచ్చు సర్వాంగ కవచము ధరించుకొనుడి’’ సాతాను యొక్క తంత్రములను ఎదిరించి నిలువబడుటకు సర్వాంగ కవచము ధరించుకొనుడని క్రైస్తవ బాధ్యతను గూర్చి పౌలు వారికి వ్రాసియున్నాడు (ఎఫెసీ 6:11)

అయితే, కొన్ని సందర్భములలో వంశపారంపర్య లేక సాతాను యొక్క శాపములు ఒక వ్యక్తి మీద ఉన్నప్పుడు క్రైస్తవులు ఎవరైనా వాటిని భగ్నము చేయుటకు సహాయ పడవచ్చునా? అతనికి క్రీస్తు నందు విశ్వాసము యుండిన యెడల క్రైస్తవ సహాయము చేత అతని మీద శాపము భగ్నము చేయబడినప్పుడు సాతాను అతని నుండి దూరముగా పారిపోవును. విశ్వాసము అనునది సాతాను దూరముగా పారిపోవునట్లు చేయు ఒకే ఒక సాధనము. ఏ క్రైస్తవుడైనను తగినంత విశ్వాసము కలిగినట్లయితే అతడు సాతాను ఎదిరించినప్పుడు అపవాది వాని నుండి పారిపోవును. సాతానును దూరముగా తరిమివేయుటకు ఒక ప్రసిద్ధమైన ‘‘దురాత్మలను వెడలగొట్టు వ్యక్తిని’’ పిలువవలసిన అవసరత ఏ మాత్రము లేదు.

బైబిలు చివరిగా తెలియజేయునది ఏమనగా, క్రీస్తు మన కొరకు ‘‘శాపగ్రాహియాయెను’’. ఆలాగు చేయట వలన ‘‘ధర్మశాస్త్రము యొక్క **శాపము** నుండి ఆయన

మనలందరిని విడిపించెను" (గలతీ 3:13). పాపము చేయట వలన మన మందరము దేవుని శాపము క్రింద ఉండినాము. అయితే యేసు మన శాపశిక్షను భరించుట వలన ఆ శాపము నుండి మనము విడుదల పొందితిమి. దేవునికి స్తోత్రము! మనము ఇకనెంత మాత్రము శాపము క్రింద లేము. ***ఆశీర్వచనము*** క్రిందకు వచ్చినాము, గనుక మనము మిక్కిలిగా సంతోషించెదము, "క్రీస్తునందు పరలోక సంబంధమైన విషయములలో ప్రతి ఆశీర్వాదమును దేవుడు మనకు అనుగ్రహించెను" (ఎఫెసీ 1:3).

## ఇతిహాసపు కథ - 10: "ఉపవాసము ఉండుట ద్వారా దురాత్మ సంబంధమైన బంధకములను మనము భగ్నము చేయగలము."

బాధ్యతాయుతమైన క్రైస్తవ జీవితమునకు అత్యంత ప్రాధాన్యమైన అంశములలో ఉపవాసము ముఖ్యమైనది కొందరు క్రైస్తవులు భావింతురు. ఆశ్చర్యకరమైన విషయమేదనగా నూతన నిబంధన పత్రికలన్నిటిలో ఒక్క ఆజ్ఞ గాని సూచన గాని ఉపవాసమును గూర్చి క్రైస్తవులకు ఇవ్వబడకుండుట ఒక వాస్తవమైన విషయమై యున్నది. క్రైస్తవులు ఉపవాసము ఉండవలెనని పత్రికలలో ఎక్కడను హెచ్చరింపబడి యుండలేదు. అయితే కొన్ని సమయములలో పౌలు తాను ఆకలితో ఉపవాసములతో కాలము గడిపియున్నాడని వ్రాసి యున్నాడు,

> వారు ప్రభువును సేవించుచు ***ఉపవాసము*** చేయుచుండగా పరిశుద్ధాత్మ నేను బర్నబాను, పౌలును పిలిచిన పని కొరకు వారిని నాకు ప్రత్యేక పరచుడని వారితో చెప్పెను. అంతట వారు ***ఉపవాసము*** ఉండి ప్రార్థన చేసి వారి మీద చేతులుంచి వారిని పంపిరి (అపొ 13:2-3).
>
> మరియు ప్రతి సంఘములో వారిని పెద్దలను ఏర్పరచి, ***ఉపవాసముండి***, ప్రార్థనలు చేసి వారు నమ్మిన ప్రభువుకు వారిని అప్పగించిరి (అపొ 14:23).

అపొ కార్యముల గ్రంథములో ఉపవాసముండుటను గూర్చి ఈ రెండు ఉదాహరణలు వ్రాయబడి ఉన్నవి. నూతన నిబంధనలో ఉపవాసముండుట వలన కలుగు ప్రాథమిక మేలు లేక ప్రయోజనము ఏదనగా ఆసక్తితో తీవ్రమైన రీతిగా ప్రార్థన చేయుటకు ఎక్కువ సమయము లభించును. మన ఆత్మీయ జీవితమునకు దేవుని యొక్క స్పష్టమైన నడిపింపు ఏదైని ఒక అంశము మీద మనము దేవుని సన్నిధానములో ఆయన సహాయము కొరకు వెదకునప్పుడు ఈ ఏకాంత ఉపవాస ప్రార్థన ప్రత్యేకముగా ఎంతో ప్రాముఖ్యత కలిగియున్నది.

ప్రతి క్రైస్తవుడు ఎరిగి ఉన్నట్లుగా ఎక్కువ సమయము ప్రార్థనలో గడుపుటకు అనుకూలమైన మంచి సమయము లభించుట అనునది మిక్కిలి కష్టతరమైన విషయమని మనము ఎరుగుదము. ప్రార్థించుటకు మనకు కొన్ని గంటలు అవసరమై యుండగా వేరే ఇతర పనులకొరకైన సమయమును మనము ప్రక్కకు పెట్టవలసివచ్చును. అందువలననే ప్రభువైన యేసు రాత్రంతయు ఆయన ఒంటరిగా ప్రార్థన యందు గడిపెనని అనేక పర్యాయములు సువార్తల్లో మనము చూచుచున్నాము. అపొస్తలులను ఏర్పరచుకొనక ముందును విశేషమైన

సేవ పరిచర్యలు జరుపబడవలసి వచ్చినప్పుడు ఆయన తెల్లవారుజామునే పెందలకడనే లేచి ప్రార్థించు వాడుక గలవాడు. వివాహితులైన క్రైస్తవులకు పౌలు ప్రత్యేకముగా వ్రాయుచు తమ జీవిత భాగస్వాములతో లైంగిక సంబంధములలో ఏ లోటు రానీయకూడదు అనియు వారు ఒకరి సమ్మతితో మరి యొకరు ప్రార్థించుటకు ఎక్కువ సమయము గడుపవలసి యున్నదని పౌలు వ్రాసెను (1 కొరింథీ 7:5). ఎక్కువ సమయము ప్రార్థనలో గడుపు నిమిత్తము జీవిత సంబంధమైన కొన్ని సుఖ సంతోషములను అనగా, నిద్ర, ఆహారము, లైంగిక సుఖము మున్నగు వాటిని తాత్కాలికముగా వదులుకోవలసి ఉంటుంది.

## ఉపవాసము లేక నిరాహారదీక్ష

ఉపవాసము కేవలము దాని వలననే దేవుని మనము మార్చజాలము. ఉపవాసము ద్వారా మనలను మనము బాధించుకొనుట వలన దేవుడు సత్వరమే మన ప్రార్థనలను ఆలకించవలెనని మనము తలంచవలెను. కొన్ని పర్యాయములు ఇది కేవలము ఒక నిరాహారదీక్ష వలె ఉండును.

ఉపవాసము ఉండుట వలన అత్యధికముగా ఆత్మీయ శక్తి గాని లేక దురాత్మల అధికారము గాని ఇవ్వబడదని మనము గ్రహింపవలెను. క్రీస్తు శరీరములో అవయములుగా సమస్తమైన ఆధిపత్యము కంటెను, అధికారము కంటెను, శక్తి కంటెను, ప్రభుత్వము కంటెను ఈ యుగమందే కాక, రాబోవు యుగమందును పేరు పొందు ప్రతీ నామము కంటెను ఎంతో హెచ్చుగా పరలోకమందును ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు. గనుక మనము కూడా క్రీస్తు శరీరములోని అవయవములు గనుక మనము కూడా ఆయనతో పరలోకములో కూర్చుండి యున్నాము. మార్కు 16:17 ప్రకారము "నమ్మిన వారి వలన ఈ సూచిక క్రియలు కనబడును. ఏమనగా నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు" యేసు యొక్క ఈ వాగ్దానమును అనుసరించి దయ్యములను వెళ్ళగొట్టు ఈ అధికారము మనము కలిగియున్నాము.

మత్తయి 17:21లో యేసు సెలవిచ్చిన వాక్యము అనుసరించి ఒక దయ్యము ఒక పర్యాయము వెడలగొట్టబడిన తరువాత ఆయన చెప్పినది ఏమనగా ప్రార్థన ఉపవాసము వలననే తప్ప ఇట్టివి వదలిపోవుట కష్టసాధ్యమని చెప్పెను. దీని గూర్చి మనము ఆలోచించవలసియున్నది. మొట్టమొదట మనము గ్రహించవలసినది మత్తయి సువార్త యొక్క వ్రాత ప్రతిలో ఈ వాక్యము లేదని బైబిలు సూచించుచున్నది. యేసు చెప్పినట్లు ప్రార్థన ఉపవాసము వలననే తప్ప ఇట్టివి వదలిపోవుట సాధ్యము కాదని యేసు చెప్పిన ఈ వచనము ప్రాచీన ప్రతులలో లేదు.

మార్కు సువార్తలో ఇదే విషయము (9:29) లో ఇటువంటిది ప్రార్థన వలననే తప్ప వెలుపలికి రాదని యేసు చెప్పినట్లు వ్రాయబడి ఉన్నది. అయితే ప్రాచీన ప్రతులలో ఉపవాసము ద్వారానే తప్ప అనుమాట కూడా చేర్చబడి యుండెను.

ప్రత్యేకమైన దురాత్మలను వదిలించు కార్యములో అత్యావశ్యకమైనది ఉపవాసమేనని

యేసు బోధించెనా? జవాబు మనం ఖచ్చితంగా చెప్పలేం. అయినప్పటికి ఉపవాసం గూర్చి యేసు ఏ మాటలు చెప్పియున్నాడో అవి యేసు మరియు నూతన నిబంధన గ్రంథ కర్తలు దయ్యములను వెళ్ళగొట్టు కార్యములలో ఉపవాసము అవసరమేనని వారు చెప్పిరి.

దయ్యములను వెళ్ళగొట్టు క్రియలో ఉపవాసము ఏ విధముగా సహాయకరముగా ఉండునో మనము తెలుసుకొనుట యుక్తము. ఉపవాసము దయ్యములపై ఒకడు అధికారము కలిగియుండుటను హెచ్చించదు. ఒకవేళ దేవుడు ఒకనికి దయ్యములను వెడలగొట్టు అధికారము ప్రత్యేకముగా ఇచ్చిన యెడల ఆ వ్యక్తి ఆ అధికారమును కలిగియుండును. ఉపవాసము ఉండుట అనునది దేవుడు వాగ్దానము చేసిన ఆ అధికారము విషయమై ధ్యానించుటకు ఎక్కడైన సమయము ప్రార్థనలో గడుపుటకు అవకాశము కలుగును. అలాగుననే దేవుడు సెలవిచ్చిన దాని విషయమై విశ్వాసులు అభివృద్ధి నొంది దయ్యములను వెడలగొట్టుటలో సహాయకరమగును.

మత్తయి 10:1లో శిష్యులు దురాత్మలను వెడలగొట్టుటకు అధికారము పొంది యుండిరి. అయితే ఒక బాలునిలో ఉన్న దురాత్మను వెడలగొట్టు విషయములో వైఫల్యము చెందిరి. వారు వెడలగొట్టుటలో విఫలమైరని యేసు తెలుసుకొనినప్పుడు వారి అవిశ్వాసమును బట్టి ఆయన దు:ఖించెను (మత్తయి 17:17 చూడుము). మేమెందుకు వెళ్ళగొట్టలేక పోతిమి అని శిష్యులు అడిగినప్పుడు మీ అల్ప విశ్వాసము వలననే అని ప్రభువు వారికి జవాబిచ్చెను (మత్తయి 17:20). ఉపవాసము గూర్చి యేసు చెప్పిన మాటలలో ఇవి కొద్ది వచనములు మాత్రమే.

వారు దురాత్మలను వెళ్ళగొట్టుట యందు అపజయము పొందుటలో రెండు సంగతులు మనము గ్రహించవచ్చును. మొదటిది, దేవుడు వారికిచ్చిన అధికారము ఉపయోగించుటలో వారి అవిశ్వాసము, రెండవది ముందుగా వారు ప్రార్థనా ఉపవాసము చేత సిద్ధపడకపోయిరి. దేవుడు వారికిచ్చిన అధికారముపై విశ్వాస అభివృద్ధి కలిగించు కొనవలసియున్నారు. రెండు ప్రార్థనా విశ్వాసము ద్వారా వారి విశ్వాస పటుత్వమును వారు పెంచుకొనవలసి యున్నారు. యేసు చెప్పిన మాటలలో రెండవది ఆలోచించిన యెడల అది యుక్తమైనదిగా కనబడుచున్నది. మొదటి దాని విషయమై యేసు తానే చెప్పిన మాటను ఆయన తానే దానికి వ్యతిరేకముగా చెప్పినట్లున్నది. అయితే ఉపవాసము గూర్చి యేసు చెప్పిన ఈ మాటలు వాస్తవముగా విశ్వాస అభివృద్ధిని కలిగించుకొని అవకాశములే అని మనము గ్రహించుకొనవచ్చును. సాతానుకు మరియు దురాత్మలకు వ్యతిరేకముగా వ్యక్తిగతముగా పోరాడుటలో ఉపవాసము యొక్క సంబంధమేమియు లేదనియు సాతానుపై వ్యక్తిగత విజయము కొరకు ఉపవాసము ఉండవలెనను దానికి వాక్యాధార మేమియు లేదు.

## దేవుడు కోరుకొను ఉపవాసము

సాతాను బంధకములను విప్పివేయు లేఖన భాగము యెషయా 58:6లో ఉన్నదని కొందరు తప్పుగా అభిప్రాయ పడుదురు:

దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు కాడిమానున మోకులు

తీయుటయు, బాధింపబడిన వారిని విడిపించుటయు, ప్రతి కాడిని విరుగగొట్టుటయు, నేను ఏర్పరచుకొనిన ఉపవాసము కాదా? (యెషయా 58:6).

ప్రజలపై ఉన్న సాతాను కట్టిన బంధకములను తెంపి వేయుట అనుదానిని ఈ వచనము మనకు విశ్వాసమును గూర్చి తెలియజేయుచున్నదా? ఈ సందర్భము గమనించకుండా కేవలము ఆ వచనము యొక్క పైపై ఉండు అర్థమును తీసుకొనిన యెడల సాతానుతో వాక్య సంబందమైన ఒక క్రీడ ఆడినట్లుండును. యెషయా 58 అంతయు మనము చదివి గ్రహించిన యెడల అక్కడ దేవుడు స్పష్టముగా చెప్పునది,

> తాళకబూర ఊదినట్లు ఎలుగెత్తి బిగ్గరగా కేకలు వేయుము. వారు చేసిన తిరుగుబాటులను నా జనులకు తెలియజేయుము. యాకోబు ఇంటి వారికి వారి పాపములను తెలియజేయుము (యెషయా 58:1).
>
> దేవుడు యెషయా ప్రవక్తతో మాట్లాడుచున్నాడు. ఇశ్రాయేలు వారి పాపములను వారికి ప్రకటించుమని ఆజ్ఞాపించుచున్నాడు. ఆ తరువాత వచనములో ఆయన వారి పాపములను ఒక్కొక్కటిగా లెక్కించుచున్నాడు, తమ దేవుని న్యాయవిధిని విడువక నీతిని అనుసరించు వారైనట్టు అనుదినము వారు నా యొద్ద విచారణ చేయుచు నా మార్గములను తెలుసుకొన నిచ్ఛ కనపరచుదురు తమకు న్యాయమైన తీర్పులు తీర్చవలెనని వారడుగుదురు. దేవుడు తమకు ప్రత్యక్షుడు కావలెనని యిచ్ఛయింతురు (యెషయా 58:2).

ఇశ్రాయేలు ప్రజలు తాము నీతిగల వారైనట్టు భావించుకొని వాస్తవ మత జీవితములో వారు కేవలము వేషధారణ జీవితము కలిగియున్నారు. కేవలము వారు మత సంబంధమైన ఉద్దేశ్యముల ప్రకారము నడుచుకొనిన వారైనట్టు వారు దేవునిని అడుగుచుందురు.

> మేము ఉపవాసముండగా నీవెందుకు చూడవు. మేము మా ప్రాణమును ఆయాసపరచుకొనగా నీవెందుకు లక్ష్యపెట్టవు అని వారందురు (యెషయా 58:3).
>
> అయితే దేవుడిచ్చు జవాబు ఏదనగా, మీ ఉపవాసదినమున మీరు ***మీ వ్యాపారము చేయుదురు. మీ పనివారి చేత కఠినమైన పని చేయించుదురు***. మీరు ***కలహపడుచు, వివాదము చేయుచు, అన్యాయముగా గుద్దులాడుచు, ఉపవాసముందురు***. మీ కంఠధ్వని పరమున వినబడునట్లుగా మీరిప్పుడు ఉపవాసముండరు. అట్టి ఉపవాసము నాకు అనుకూలమా? మనుష్యులు తన ప్రాణమును బాధపరచు కొనవలసిన దినము అట్టిదేనా? ఒకడు జమ్ము వలె తలవంచుకొని గోనెపట్ట కట్టుకొని,

బూడిద పరచుకొని కూర్చుండుట ఉపవాసమా? ***అట్టి ఉపవాసము యెహోవాకు ప్రీతికరమని మీరనుకొందురా?*** (యెషయా 58:3-5).

దేవుడు తమ్మును లక్ష్యము చేయునట్లు మరియు ఆయన అనుగ్రహము పొందునట్లు ఇశ్రాయేలీయులు ఉపవాసముండినను వారి పరిస్థితులలో ఏ మాత్రమును మార్పు కనిపించదు. అయితే దేవుడు వారి స్వార్థ పూరితమైన జీవిత విధానములను వారికి జ్ఞాపకము చేయుచు వారి ఉపవాస దినములలో వారు ఎంత చెడ్డ జీవితము జీవించుచున్నారో దేవుడు వారికి తెలియజేయుచున్నాడు. వారి హృదయము నిండా స్వార్థము పెట్టుకొని ఉపవాసము చేయుచున్నారు. అట్టి ఉపవాసమును దేవుడు అంగీకరించడని తెలియజేయుచున్నాడు. స్వార్థము లేకుండా ఎట్టి ఉపవాసమును దేవుడు తమ్మును లక్ష్యము చేయునట్లు మరియు ఆయన అనుగ్రహము పొందునట్లు ఇశ్రాయేలీయులు ఉపవాసముండినను వారి పరిస్థితులలో ఏ మాత్రమును మార్పు కనిపించదు. వారికి జ్ఞాపకము చేయుచు వారి ఉపవాస దినములలో వారు ఎంత చెడ్డ జీవితము జీవించుచున్నారో దేవుడు వారికి తెలియజేయుచున్నాడు. వారి హృదయము నిండా స్వార్థము పెట్టుకొని ఉపవాసము చేయుచున్నారు. అట్టి ఉపవాసమును దేవుడు అంగీకరించడని తెలియజేయుచున్నాడు. స్వార్థము లేకుండా ఎట్టి ఉపవాసమును దేవుడు అంగీకరించుచున్నాడో దానిని తెలియజేయుచున్నాడు,

> దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు, కాడిమాను మేకులు తీయుటయు బాధింపబడిన వారిని విడిపించుటయు, ప్రతి కాడిని విరుగగొట్టుటయు నేనేర్పచుకొనిన ఉపవాసము కాదా, నీ ఆహారము ఆకలిగొనిన వారికి పెట్టుటయు, నీ రక్త సంబంధికి ముఖము తప్పింపకుండుటయు, దిక్కుమాలిన బీదలను నీ యింట చేర్చుకొనుటయు వస్త్రహీనుడు నీకు కనబడినప్పుడు వానికి వస్త్రములను ఇచ్చుటయు ఇదియే గదా నాకు ఇష్టమైన ఉపవాసము? (యెషయా 58:6-7).

ఈ ఉపవాసము క్రియ ద్వారా ప్రజలు సాతాను బంధకములనుండి విడుదల చేయుదురని దేవుడు చెప్పుచున్నాడా? ఏ మాత్రము కాదు. కేవలము ఆహారము తినకుండుట మాత్రము కాదు గాని స్వార్థమును విడిచిపెట్టుమని దేవుడు కోరుచున్నాడు. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించుమని చెప్పుచున్నాడు. బాధింపబడు వారిని ''స్వేచ్ఛ నిచ్చి విడిపించుడనియు'', వారి ఆహారము ఆకలిగొనిన వారితో పంచుకొనుడనియు దిక్కులేని వారిని నిరాశ్రయులను వారి ఇంట చేర్చుకొనుడనియు వస్త్ర హీనులకు వస్త్రము దయచేయుమనియు దేవుడు ఈ వాక్యము ద్వారా వారిని కోరుచున్నాడు. కేవలము ఆహారము తినుట మానివేసినంత మాత్రమున ఈ కార్యములు అన్నియు జరిగింపబడవు. ప్రజలు ఇట్టి కార్యములను చేయవలసి ఉన్నారు.

మనము చదువుచూ ఉండుకొలది దీని భావము ఇంకను స్పష్టముగా తెలియును.

ఇశ్రాయేలు ప్రజలు తమ స్వార్థపూరితమైన క్రియలను మాని దేవుడు కోరు ఉపవాసమును దాని సంబంధమైన క్రియలను చేసిన యెడల దేవుడు వారికి ఈ క్రింది వాగ్దానము చేయుచున్నాడు,

> ఆలాగున నీవు చేసిన యెడల నీ వెలుగు వేకువ చుక్కవలె ఉదయించును. స్వస్థత నీకు శీఘ్రముగా లభించును. నీ నీతి నీ ముందర నడుచును. యెహోవా మహిమ నీ సైన్యపు వెనుకటి భాగమును కావలి కాయును. అప్పుడు నీవు పిలువగా యెహోవా ఉత్తర మిచ్చును. నీవు మొరపెట్టగా ఆయన నేను ఉన్నాను అనును. ***ఇతరులను బాధించుటయు వ్రేలు పెట్టి చూపి తిరస్కరించుటయు చెడ్డ దానిని బట్టి మాట్లాడుటయు నీవు మాని ఆశించిన దానిని ఆకలిగొనిన వారికి ఇచ్చి శ్రమ పడిన వానిని తృప్తి పరచిన*** యెడల చీకటిలో నీ వెలుగు ప్రకాశించును. అంధకారము నీకు మధ్యాహ్నము వలె ఉండును (యెషయా 58:8-10).

9వ వచనములో దేవుడు స్పష్టముగా మాట్లాడునది ఏమనగా ఉపవాసము ఉండుట ద్వారా ఆయన తానే సాతాను యొక్క కాడి మాను దానికి జవాబుగా తీసివేయుదునని దేవుడు ఇక్కడ మాట్లాడుచుండుట లేదు. కాని అట్టి వాటిని అనగా సాతాను యొక్క కాడి మాను మోపుట కాదు గాని మనుష్యులు కట్టిన కాడి మానులను అనగా అన్యాయము, బీదరికము మున్నగు వాటిని తొలగించవలెను.

***కేవలము ఆహారము విసర్జించుట కాదు గాని, ఇశ్రాయేలీయులు స్వార్థపరత్వమును విడనాడుట యందు దేవుడు ఆసక్తి కలిగియున్నాడు.*** మన విషయములో కూడా ఇదియే వాస్తవము. రెండవ ఆజ్ఞ, "నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించుము" (మార్కు 12:31). అంతేగాని నీవు ఉపవాసముండుటకు జాగ్రత్త పడుమని దేవుడు ఏ మాత్రము చెప్పలేదు.

గనుక ఉపవాసము ఉండుట ద్వారా సాతాను యొక్క బంధకముల నుండి లేక పట్టు నుండి జనులను విడిపించుట అను విషయము సరియైనది కాదు. అయితే సాతాను స్వాధీనము నుండి ప్రజలను విడిపించుటకు ప్రాథమిక అవసరత వారికి సువార్తను బోధించుటయే. వారు విశ్వాసముతో దానిని అంగీకరించిన యెడల వారు విడుదల పొందుదురు. వారు దేవుని వాక్యమందు విశ్వాసముంచినట్లయితే ఎట్లు సాతానును ఎదిరింపగలుగుదురో బోధింపబడుదురు.

## లేఖన ప్రకారమైన ఆత్మీయ పోరాటము

ఆత్మ సంబంధమైన పోరాటమును గూర్చిన అనేక ఆధునిక ఇతిహాస కథలను గూర్చి మనము ఆలోచించి యున్నాము. లేఖన ప్రకారమైన ఆత్మీయ పోరాట విధానము కలదా?

ఇప్పుడు దాని విషయమై సరిగా ఆలోచింతము.

ఈ ఆత్మీయ పోరాటము యొక్క ఆవశ్యకతను గూర్చి మొదటిగా మనము క్రైస్తవ జీవితము యొక్క ప్రాధాన్యత ఈ ఆత్మీయ పోరాటము అని మనము తలంచరాదు. మన యొక్క గురి మన లక్ష్యము క్రీస్తు ప్రభువు మరియు మనము ఆయనను విధేయతతో వెంబడించుటయే మనము దిన దినము అంతకంతకు క్రీస్తును పోలి జీవించు వారముగా ఉండవలెను. నూతన నిబంధనలోని కొన్ని వ్రాతలలో కొద్ది శాతము మట్టుకే ఈ "ఆత్మీయ పోరాటము" అను అంశము మీద వ్రాయబడియున్నది. క్రైస్తవ జీవితములో ఇది అంత ప్రాముఖ్యత ఇవ్వదగిన అంశము కాదు.

ఈ ఆత్మీయ పోరాటమును గూర్చి తెలుసుకొనవలసిన రెండవ అవసరత మనము ఎంత వరకు తెలుసుకొనవలసినదో అంత వరకే బైబిలు మనకు తెలుపుచున్నది. "సాతానును గూర్చిన లోతైన విషయమును" మనము అంత హెచ్చుగా తెలుసుకొనవలసిన అవసరత లేదు. "బైబిలు సంబంధమైన ఆత్మీయ పోరాటము చాలా తేలిక అయినది." సాతాను పథకములన్నియు లేఖనముల యందు బహు తేటగా బయలు పర్చబడి యున్నది. ఆలాగుననే మన బాధ్యతలను కూడా సూటిగా పేర్కొనబడినవి. దేవుడు ఏమి చెప్పియున్నాడో దానిని మనము పరిపూర్ణముగా విశ్వసించినప్పుడు ఈ ఆత్మీయ సంఘర్షణ యందు నీవు జయము పొందుట సులభమగును.

## ప్రారంభమునొద్దకు మరలా వెళ్ళుట

ఆదికాండ గ్రంథము నొద్దకు మరియొకసారి వెళ్ళుదుము. మొట్టమొదటిసారిగా సాతాను అక్కడ మనకు పరిచయమగుచున్నాడు. ఆ మొదటి అధ్యాయములలో సాతాను సర్పము రూపములో కనబడుచున్నాడు. ఈ సర్పమే సాతాను అని ఏదైనా ఒక అనుమానము ఉండిన యెడల ప్రకటన 20:2 దానిని తొలగించుచున్నది, "అతడు **ఆది సర్పమును** అనగా అపవాదియు, సాతానును అను ఆ ఘటసర్పమును పట్టుకొని"

ఆది 3:1 చెప్పుచున్నట్టు, "దేవుడైన యెహోవా చేసిన సమస్త భూ జంతువులలో సర్పము యుక్తి గలదై యుండెను" దేవుడు సృజించిన కొన్ని జంతువులలో అత్యంత యుక్తిగలిగినవి ఒక దానితో ఒకటి పోటీపడి తాను మాత్రమే జీవింప గలుగుటకు మరియు తనకు ఆహారముగా ఉండు వాటిని ఎక్కువ ప్రోగు చేసుకొనుటకు ప్రయాసపడు వాటన్నిటిలో సాతాను ఎంత యుక్తి మోసము, వంచన గలిగి యున్నాడో మనము గ్రహించవచ్చును. దేవుడు సమస్తము ఎరిగిన వాడును, సంపూర్ణ జ్ఞానవంతుడైనట్టుగా సాతాను సంపూర్ణ జ్ఞానవంతుడు అన్నియు ఎరిగినవాడు కాడు. సాతానుతో పోరాడు విషయములో మనము మానసికముగా ఎట్టి విధమైన దుస్థితిలో లేమని సాతాను మనలను గూర్చి తెలుసుకొనవలెను. "**సర్పము** వలె యుక్తిపరులముగా" మనము ఉండవలెనని యేసు బోధించెను (మత్తయి 10:16). పౌలు వ్రాయుచు సాతాను తంత్రములను మనము ఎరగని వారము కాదు (2 కొరింథీ 2:11)లో చెప్పాడు. మనము అయితే "క్రీస్తు మనసు" గలవారము (1 కొరింథీ 2:16).

సాతాను తనమొట్టమొదటి అగ్నిబాణము హవ్వ మీద ప్రయోగించి దేవుడు ఏమి

చెప్పెనో దానిని గూర్చి ప్రశ్నించెను. దేవునికి అవిధేయత చూపునట్లుగా, ఏ విషయములో సాతాను ఆమెను శోధించవచ్చునో ఆమె జవాబులోనే దానిని కనుగొనవలెనని సాతాను హవ్వను ప్రశ్నించెను. ***దేవుడు ఏమి చెప్పెనో దానిని పరిపూర్ణముగా విశ్వసించి ఆయనకు లోబడు ఉండు వారిని మోసగించుటకు సాతానుకు ఏ అవకాశము కూడా దొరకదు. దేవుని వాక్యమునకు భిన్నముగా ఉండు అభిప్రాయములును ప్రోగు చేసుకొని వాటిని ఉపయోగించుకొని మనుష్యులను మోసగించు పథకములను అతడు రచించుచు ఉండును.***

"సాతాను ఆ స్త్రీతో ఇది నిజమా? ఈ తోట చెట్లలో దేని ఫలములనైనను మీరు తినకూడదని దేవుడు చెప్పెనా? అని ఆమెను అడిగెను" (ఆది 3:1). సాధారణముగా ఎవరైనా అడుగు సామాన్యమైన అమాయకమైన ప్రశ్నవలె ఇది ధ్వనించుచున్నను తన గురి ఏమిటో సాతానుకు పూర్తిగా తెలియును.

"అందుకు స్త్రీ ఈ తోట చెట్ల ఫలములను మేము తినవచ్చును. అయితే ఈ తోట మధ్య ఉన్న చెట్టు ఫలములను గూర్చి దేవుడు మీరు చావకుండునట్లు వాటిని తినకూడదనియు, వాటిని ముట్టకూడదనియు చెప్పెనని సర్పముతో అనెను" (ఆది 3:2-3).

హ0వ్వ తాను చెప్పగలిగినంత మట్టుకు సరిగానే చెప్పెను. వాటిని ముట్టకూడదని దేవుడు వాస్తవముగా చెప్పలేదు గాని, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను వారు తినుట నిషేధించెను.

'మీరు చావనే చావరు!" అను సాతాను చెప్పిన జవాబు అబద్ధమని సత్యమెరిగిన అవ్వకు తెలియును (ఆది 3:4). దేవుడు చెప్పిన దానికి పూర్తిగా విరుద్ధమైనది అయితే ఈ అబద్ధమును సూటిగా నమ్మునని అపవాది ఎరిగియుండెను. అందుచేత తాను చెప్పిన అబద్ధమునకు కొంచెము చెక్కర పూత పూసి సాతాను కొంచెము సత్యము దానికి కలిపి ఆ అబద్ధమును హవ్వ అంగీకరించినట్టు చేసెను. "ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరువబడుననియు మీరు మంచి చెడ్డలు ఎరిగిన వారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియుననని" స్త్రీతో చెప్పెను (ఆది 3:5).

అతడు చెప్పిన అబద్ధమును నిజమైనదిగా కనిపించునట్లు మూడు విషయములు సాతాను చెప్పెను. ఆదాము, హవ్వ ఒకసారి నిషిద్ధమైన ఆ ఫలమును భుజించిన యెడల వారి కన్నులు తెరువబడును అని సాతాను చెప్పినట్లు మనము ఎరుగుదము (ఆది 3:7). అటుపిమ్మట దేవుడు తానే ఈలాగు చెప్పెను. ఇదిగో, "మంచి చెడ్డలను ఎరుగునట్లు ఆదాము మనలో ఒకని వంటి వాడాయెను" (ఆది 3:22) ***జనులను మోసగించునట్లు సాతాను కొంత సత్యమును, కొంత అబద్ధమును రెండింటిని కలిపి చెప్పెను.***

దేవుని స్వభావమును సాతాను తప్పుగా అర్థము చేసుకొనబడునట్లు చెప్పుట మనము గమనించవలెను. వారి సంతోషము, సౌఖ్యము కొరకు ఆదాము హవ్వలను నిషేధించబడిన ఆ ఫలమును తినకూడదని దేవుడు కోరెను. అయితే సాతాను దానిని త్రిప్పి వేసి ఆ మంచి ఫలము ఆదాము హవ్వలు తినకుండా దేవుడే దానిని నిషేధించెనను మాట అపార్థముగా

వారితో చెప్పెను. సాతాను చెప్పే అబద్ధములన్నియు కేవలము దేవుని స్వభావమును, ఆయన చిత్తమును మరియు దేవుని ఉద్దేశ్యము తప్పుగా అపార్థము చేయబడునట్లు అబద్ధము కల్పించి చెప్పును.

ఈ భూమిపై ఉన్న మొదటి దంపతులు దేవుని సత్యమును తిరస్కరించి అబద్ధమును నమ్ముట ఎంతో దురదృష్టకరము. అయితే దాని దుష్ట పర్యవసానము వారు అనుభవించిరి. ఆధునికమైన ఆత్మీయ పోరాటములో ఉండు కొన్ని ప్రాథమిక విషయములను ఈ కథయందు మనము గమనించవలెను. సాతాను యొక్క గొప్ప ఆయుధము సత్యము త్రిప్పి వేయబడి అబద్ధము ఎంతో ఆకర్షణీయముగా ప్రజలకు చెప్పుట. మనుష్యుల యెదుట రెండు ప్రత్యామ్నయములు ఉంచబడియున్నవి, అది దేవుడు చెప్పినది నమ్ముటయా? లేక సాతాను చెప్పినది నమ్ముటయా? సత్యమును నమ్ముట అనునది మానవులకు ఇవ్వబడిన ''విశ్వాస సంబంధమైన డాలు'' అయితే మనుష్యులు ఆ విశ్వాసపు డాలును పైకి ఎత్తజాలకపోయెను.

## యేసుయొక్క ఆత్మీయ పోరాటము

అరణ్యమందు యేసు సాతాను చేత శోధించబడినప్పుడు సాతాను ఉపయోగించిన శోధించు విధానము వేల సంవత్సరముల తరబడి అవి ఏమాత్రము మారలేదు. దేవుడు చెప్పిన ప్రతి దానిని కూడా అర్థరహితమైనదిగా మార్చి వేయుట అను విధానములో సాతాను దాడి చేయును. దేవుని సత్యమును ఎవ్వరునూ నమ్మకుండను, లోబడకుండను జనులను ప్రోద్భలము చేయుటయే సాతాను యొక్క ప్రధాన ఉద్దేశ్యము. ***ఈ పోరాటము అంతటి కేంద్రము దేవుని వాక్యమై యున్నది***. సాతాను తన అబద్ధములన్నిటిని ఒకదాని వెంట ఒకటి విసరుచుండెను. అయితే యేసు సత్యమును పైకెత్తి వాటినన్నిటిని చెదరగొట్టెను. దేవుడు చెప్పిన దానినంతటిని యేసు నమ్మి విధేయతతో లోబడెను. ఇదియే బైబిలు విధానములో ఆత్మీయమైన పోరాటము.

ఆదాము, హవ్వలు శోధించబడినప్పుడు ఏ పరిస్థితిని ఎదుర్కొనినారో, యేసు తన శోధనలలో అవే పరిస్థితులను ఎదుర్కొనెను. మనము కూడా అట్టి పరిస్థితులు అదే విధమైన శోధనలు ఎదుర్కొనుచున్నాము. యేసు తాను దేవుడు చెప్పిన మాటను వినవలయునా లేక సాతాను చెప్పిన మాటను వినవలయునా, ఈ రెండింటి మధ్య ఆయన తానే ఒక నిర్ణయము తీసుకొనవలసి యున్నాడు. దేవుని వాక్యము అను ''ఆత్మ ఖడ్గముతో'' యేసు ఈ ఆత్మీయ పోరాటములో సాతానును ఎదుర్కొనెను. సాతానుతో ఈ ఆత్మీయ పోరాటములో మనము నేర్చుకొనవలసిన వాటిని గమనింతుము. మత్తయి సువార్తను అనుసరించి యేసు ఎదుర్కొనిన సాతాను యొక్క రెండవ శోధన మనము పరిశీలింతుము,

> అంతట అపవాది పరిశుద్ధ పట్టణమునకు ఆయనను తీసుకొని పోయి దేవాలయ శిఖరమున ఆయన నిలువబెట్టి నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము - ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును. నీ పాదమెప్పుడైనను రాతికి తగలకుండ వారు నిన్ను

చేతులతో ఎత్తుకొందురు, అని వ్రాయబడియున్నదని ఆయనతో చెప్పెను. అందుకు యేసు, ప్రభువైన నీ దేవుని శోధింపవలదని మరియొక చోట వ్రాయబడి యున్నదని వానితో చెప్పెను (మత్తయి 4:5-7).

మరలా ఇక్కడ దేవుడు ఏమి చెప్పినో అది కేంద్ర అంశమై యున్నది. 91వ కీర్తనలోని వాక్యము సాతాను చెప్పుచు దేవుడు ఉద్దేశించినది కాకుండా దానికి వేరైన రీతిగా సాతాను దానిని మెలికలు తిప్పి ఆ వాక్యమును యేసు మీద ప్రయోగించెను.

ఈ 91వ కీర్తనలో వ్రాయబడిన దేవుని వాగ్దానము దానిని సమతుల్యమైన స్థానములో దేవుని వాక్యమును సరిగా అర్థము చేసుకొని ఉపయోగించు కొనవలెనను భావనను యేసు తెలియజేయును. దేవుడు తప్పని సరిగా కాపాడును. అయితే మనము బుద్ధిహీనముగా ప్రవర్తించరాదు. "దేవునిని ఆయన మాటలను పరీక్షించరాదు" అని బైబిలులో క్రింది వివరణ వ్రాయబడెను.

కనుక బైబిలులోని వాక్యములు ఆ సందర్భమునకు వేరుగా వాటిని ఇష్టమొచ్చినట్లు త్రిప్ప ఉపయోగించు కొనుటలో తగిన ప్రాముఖ్యతను గమనించవలెను. ప్రతి లేఖనభాగము మిగతా లేఖన భాగముతో సమతుల్యముగా ఉండునట్లుగా చూచుకొని గ్రహించవలెను.

ఈ ఆత్మీయ పోరాటములో వాక్య భాగములను అనేక వంపులు తిప్పి వాటిని ప్రయోగించుట సామాన్యముగా సాతాను యొక్క కుతంత్రములై యున్నవి. ఈ ఆధునిక దినములలో ఈ ఆత్మీయ పోరాటము నందు ఇష్టము చూపు అనేకమంది క్రైస్తవులను సాతాను ఈ విధముగానే కుతంత్రములతో విజయవంతముగా మోసగించుట కడు విచారకరమైన విషయము. అలాంటిదే ఒక వాక్యమును వంకరలు త్రిప్పి, అర్థము చేయబడిన బైబిలులోని ఒక వచనము "సాతాను దుర్గములను కూలద్రోయుట" ఆకాశ మండల మందున్న దురాత్మల సమూహములను కూల్చివేయుట అను అభిప్రాయమును సమర్థించుటకు ఇట్టి వచనములను ఉపయోగించుకొనుదురు. దేవుని వాక్యమును దాని సందర్భములో నుండి వేరుచేసి దానిని పైపైన చదువుట వలన వాస్తవమైన పరిస్థితులకు అది చాలా భిన్నముగా ఉండును. ఆకాశమండల మందలి దురాత్మల స్థావరములను కూల్చివేయుట అను దానికి ఏ విధముగాను సంబంధపర్చలేదు. మనము ఆ వచనము యొక్క సందర్భమును గమనించక మనము మన కాలమును, శక్తిని వ్యర్థము చేయుచు, ఆకాశమండలమందలి ప్రధానులతోను, అధికారులతోను కేవలము బిగ్గరగా కేకలు వేసి అరచుట వలన మన కాలమును వ్యర్థము చేయుటకు సాతాను చాలా ఇష్టపూర్వకముగా ప్రేమించుచు, పరిహసించుచు ఉండును.

మత్తయి సువార్తలోని యేసు ఎదుర్కొనిన మూడవ శోధనను కూడా చూతుము. మరలా అపవాది మిగుల ఎత్తయిన యొక కొండ మీదికి ఆయనను తోడుకొనిపోయి యీ లోక రాజ్యములన్నిటిని వాటి మహిమను ఆయనకు చూపి నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల

వీటినన్నిటిని నీ కిచ్చెదనని ఆయనతో చెప్పగా, యేసు వానితో సాతానా పొమ్ము ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను అని వ్రాయబడి యున్నదనెను (మత్తయి 4:8-10).

ఇది అధికారమును గూర్చిన శోధనయై యున్నది. యేసు సాతానును పూజించినట్లయిన యెడల మరియు సాతాను తాను చేసిన వాగ్దానమును నిలబెట్టుకొనిన యెడల అంధకార సంబంధమైన రాజ్యములో సాతాను తరువాత ద్వితీయ స్థానము యేసు సంపాదించుకొని ఉండవచ్చును. రక్షణ పొంద నేరని ప్రతి ఆత్మ మీదను, దురాత్మలన్నిటిపైన ప్రపంచ వ్యాప్తముగా సాతానుకున్న అధికారమంతయు కలిగి యేసు సాతాను తరుపున పరిపాలకుడుగా ఉండును. ఒకవేళ యేసు సాతాను యొక్క శోధనకు లొంగిపోయి ఉండిన యెడల ఏమి సంభవించియుండునో మనము ఊహించుకొనుట ఎంతయో విడ్డూరముగా ఉండును.

అయితే యేసు సాతానును, అతని సూచనలను నిర్ద్వందముగా తిరస్కరించి దేవుని వాక్యమందు ఏమి వ్రాయబడియున్నదో దానితో సాతానును ఎదిరించెను. యేసు ఎదుర్కొనిన ఈ మూడు శోధనలలో ప్రతి శోధనను ఆయన ఎదుర్కొనుచు దేవుని వాక్యమును ఘనపరచుచు ఈలాగు వ్రాయబడి ఉన్నది అని వాక్యమును ఎత్తిచూపి శోధనలను జయించెను. మనము కూడా సాతాను యొక్క ఉచ్చులను వాని వలలో పడకుండా మోసపడకుండా తప్పించు కొనునట్లు మనము దేవుని వాక్యము నమ్మి దానికి లోబడవలెను. ఆత్మ సంబంధమైన పోరాటము ఇట్టి విధమైనది.

## యుద్ధపోరాట స్థలము

సాతాను మరియు వాని దురాత్మలు సర్వ సామాన్యముగా మనుష్యుల హృదయములలో వారి మనస్సులలో తలంపులు విస్తారముగా పుట్టించు అధికారము కలిగియున్నారు (ఇదియును కొన్ని దేవుడు అనుమతించిన పరిమితులలోనే 1 కొరింథీ 10:13) మన మనస్సులలో ఈ ఆలోచన కలిగి యుండి మనము ఈ క్రింది వాక్య ఉదాహరణలను చూచెదము.

అప్పుడు పేతురు - ***అననీయా నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను*** (అపొ 5:3).

వారు భోజనము చేయుచుండగా ***ఆయనను అప్పగింపవలెనని సీమోను కుమారుడగు ఇస్కరియోతు యూదా హృదయములో అపవాది ఇంతకు ముందు ఆలోచన పుట్టించి యుండెను*** (యోహాను 13:2).

అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన ***మోసపరచు ఆత్మల యందును దయ్యముల బోధల యందును***

లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు (1 తిమోతి 4:1).

***సర్పము కుయుక్తి చేత హవ్వను మోసపరచునట్లు మీ మనస్సులను చెరుపబడి క్రీస్తు యెడలనున్న సరళత నుండియు, పవిత్రత నుండియు ఎట్లయినను తొలిగిపోవునేమో*** అని భయపడుచున్నాను (1 కొరింథీ 11:3).

ప్రార్థన చేయుటకు మీకు సావకాశము కలుగునట్లు కొంత కాలము వరకు ఉభయుల సమ్మతి చొప్పుననే తప్ప, ఒకరినొకరు ఎడబాయకుడి; మీరు మనస్సు నిలుపలేకపోయినప్పుడు ***సాతాను మిమ్మును శోధింప కుండునట్లు*** తిరిగి కలుసుకొనుడి (1 కొరింథీ 7:5).

ఇందుచేత నేనును ఇకను సహింపజాలక ***శోధకుడు మిమ్మును ఒకవేళ శోధించెనేమో అనియు మా ప్రయాసము వ్యర్థమైపోయెనేమో అనియు***, మీ విశ్వాసమును తెలుసుకొనవలెనని అతని పంపితిని (1 థెస్స 3:5).

దేవుని స్వరూపియై యున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము ***ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైనవారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను*** (2 కొరింథీ 4:4).

కాగా ***సర్వలోకమును మోసపుచ్చుచు*** అపవాది అనియు, సాతాను అనియు పేరుగల ఆది సర్పమైన ఆ మహా ఘటసర్పము పడద్రోయబడెను, అది భూమిమీద పడద్రోయబడెను. దాని దూతలు దానితో కూడా పడద్రోయబడెను (ప్రకటన 12:9).

మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆది నుండి వాడు నరహంతకుడై ***సత్యమందు నిలిచిన వాడు కాడు. వాని యందు సత్యమే లేదు, వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును. వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడు*** (యోహాను 8:44).

ఈ లేఖన భాగము మనకు స్పష్టము చేయుచున్నది ఏమనగా ప్రాథమికముగా ఈ ఆత్మ సంబంధమైన పోరాటము బైబిలును అనుసరించి యుద్ధ రంగస్థలము మన హృదయములు, మన మనస్సులు సాతాను ఉపయోగించు ఆయుధములు ఆలోచనలు తలంపులు. చెడు సలహాలు తప్పు అభిప్రాయములు అబద్ధపు తాత్విక సూత్రములు శోధనలు అనేక విధములైన మోసపూరితమైన అబద్ధము మొ॥ ఆయుధములతో మన మనస్సులను

హృదయములను ముట్టడి చేయును. అయితే ప్రతిగా మనము ఎదిరించి మనలను కాపాడుకొనుటకు మనము ఉపయోగించు సాధనములు తెలుసుకొనుట జ్ఞానము కలిగి యుండుట, విశ్వాసముంచుట మరియు దేవుని వాక్యమును అనుసరించి నడుచుకొనుట.

మన మనస్సులో పుట్టు ప్రతి తలంపు కేవలము మన లోపలి నుండియే పుట్టుచున్నదని మనము అనుకొన రాదు. ఈ విషయము అర్థము చేసుకొనుట అత్యంత ముఖ్యము. సాతాను తరుపున మాట్లాడువారు అనేకమంది కలరు. వారు మన మనస్సులలో సాతాను దుర్బీజములను నాటుచుందురు. మనము చదువు వార్త పత్రికలు పుస్తకములు, టెలివిజన్, మ్యాగజైన్స్, రేడియో, మన స్నేహితులు, మన ఇరుగుపొరుగు వారు మరియు కొన్ని మన బోధకుల ద్వారా కూడా సాతాను తన ప్రభావమును మన లోపల క్రియ జరిగించగలడు. ఒక సందర్భములలో అపొ. పేతురు అనాలోచితముగా సాతాను చేత వాడబడి అతని మాటలను పలుకుచు యేసు ఈ విధముగా చనిపోవుట దేవుని చిత్తము కాదని పలికెను (మత్తయి 16:23).

సాతాను మరియు దురాత్మలు సూటిగా మానవ మనస్సులలో పనిచేయుచుండెను. కొన్ని సార్లు మానవ మాధ్యమము లేకుండా క్రైస్తవులు తాము సాతాను చేత దాడి జరుపబడుచున్నామని కనుగొందురు. యుద్ధము లేక పోరాటము అప్పుడే ప్రారంభమగును.

ఒక క్రైస్తవ మహిళ తన అంతరంగ సమస్యలను నాతో చెప్పుకొనుటకు వచ్చినది. తన ప్రార్థన మొదలు పెట్టగానే దేవదూషణకరమైన మాటలు అనవసరముగా ప్రమాణము చేయు మాటలు తన మనస్సులోనికి ఒక ప్రవాహపు ఉరవడిగా ప్రవేశించుచున్నవి అని చెప్పింది. నా సంఘములో ఆమె చాలా సమర్పణ, దయ, ప్రేమ, మృదుత్వము కలిగిన అతి సాత్వికురాలుగా ఉండెను. అయినను ఆమె భయంకరమైన తలంపులతో ఈ సమస్య ఎదుర్కుంటూ ఉండెను.

నేను ఆమెకు వివరణపూర్వకముగా చెప్పినది ఏమనగా ఈ తలంపులు ఆమెలో నుండి పుట్టుచున్నవి కావు గాని సాతాను చేత అట్టి దుష్ట తలంపుల దాడి ఆమెకు జరుగుచున్నదని ఆమెకు వివరించాను. వాడు ఆమె ప్రార్థనా జీవితమును నాశనము చేయుటకే ఇటువంటి తలంపులను ఆమెలో చొప్పింపజేయుచున్నాడు అని ఆమెతో చెప్పాను. ఈ తలంపులకు భయపడి ఆమె ప్రార్థించుటయే మానివేసినది. సాతాను ఆ విషయములో విజయము పొంది యున్నాడు.

నేను ఆమెను ప్రోత్సాహపరచుచు తిరిగి ప్రార్థించవలసినది అని ఆమెను కోరుచు ఒకవేళ చెడ్డతలంపులు మనస్సులోనికి రాగానే దేవుని వాక్య సత్యము వలన దానికి ఎదురు దాడి చేయవలసినది అని సూచించితిని. ఆమె ప్రార్థించినప్పుడు ఆమె తలంపులో "యేసు క్రీస్తును గూర్చి ఏదైనా దురభిప్రాయము ఆలోచన రాగానే వెంటనే యేసు పరిశుద్ధుడు సత్యవంతుడైన దేవుని కుమారుడై యున్నాడని ప్రతి దాడి చేయవలెను" దేవుని గూర్చిగాని, ప్రభువైన యేసును గూర్చిగాని ఏమైనా శాపపు తలంపులు వచ్చిన యెడల వెంటనే వాటిని ప్రక్కకు త్రోసి యేసును స్తుతించుట మొదలుపెట్టవలెను.

కేవలము భయపడుచు ఉండుట వలన ఈ చెడ్డ తలంపులు మానకవచ్చుచూనే

ఉండును. మనము వాటిని నిరోధించక యుండిన యెడల మన అంతరంగములోనికి వాటిని ఆహ్వానించువారముగా ఉందుము. ఎందుకనగా భయము అనునది విశ్వాసమునకు వ్యతిరేకమైనటు వంటిది. ఆలోచించుటకు ఏ మాత్రము మనము ప్రయత్నము చేయని యెడల మనము దయ్యపు విశ్వాసమునే ఆహ్వానించి సరియైన రీతిగా ఆలోచించు ప్రయత్నమే చేయకుందుము.

ఉదా: "నీ కుడి చేతిని గూర్చి ఏమి ఆలోచించకుము" అని నేను చెప్పి యుండిన యెడల వెంటనే నీవు నా మాటకు లోబడి నీ కుడిచేతిని గూర్చియే ఆలోచించుచుందువు. ఎంత కష్టపడి నీవు ప్రయత్నించినను అంతకంతకు నీ పరిస్థితి కష్టముగానే మారిపోవును. నీ కుడిచేతిని గూర్చి ఆలోచించకుము అని చెప్పబడినప్పుడు నీ మనసు దానిని విడిచి నీ మంచి పాద రక్షకులను గురించి ఆలోచించడం మొదలు పెట్టవలెను. అనగా మన మనస్సు వేరొక దానివైపునకు మళ్ళించవలెను.

"భయపడవద్దు" అని బైబిలు గ్రంథములో ఎన్ని సార్లు వ్రాయబడియున్నదో ఆమెకు జ్ఞాపకము చేసి దేవుని వాక్యమునకు విరోధమైన తలంపులు ఏవి వచ్చినను వాటికి ప్రతిగా దేవుని వాక్యమును అంగీకరించు వాటితో తన మనస్సు నింపుకొనవలెను. వాటిని పారద్రోయవలెను.

ఆమె నా సలహాను పాటించి చాలా సంతోషముగా ఉండసాగెను. దుష్ట తలంపులతో సాతాను ఎన్నిసార్లు దాడి చేసినను దేవుని వాక్యమును ఉపయోగించుకొని ఆమె ప్రతి దాడి చేసి విజయము పొందెను. ఈ ఆత్మీయ పోరాటములో బైబిలు విధానముతో ఆమె జయము పొందెను.

ఆశ్చర్యకరమైన విషయమేదనగా అనేక సంఘములలో చాలా మంది విశ్వాసులు ఇట్టి విధమైన మానసిక ఆందోళనకు గురి అవుతున్నారు అని తేలింది. ప్రార్థించునప్పుడు అనేక మంది క్రైస్తవులు సాతాను వలన చెడు తలంపులు, ఆశలు, కోరికలు వారి మనస్సులను మలినము చేయుట వలన ప్రార్థన చేయుట మానివేస్తున్నారు. సాతాను ఆదినుండి కూడా మానవ మనస్సులను స్వాధీనపర్చుకొనుటకే తీవ్రమైన యుద్ధము చేయుచున్నాడు.

## "మీరు ఏమి వినుచున్నారో జాగ్రత్తపడుడి"

మనము సాతానును వాని దుష్ట ఆత్మలను మన మనస్సులపై దాడి చేయనీయకుండా మనము నిలువరింప జాలము. మనము **వాని** తలంపులను **మన** తలంపులుగా అంగీకరించవలసిన ఆవశ్యకత లేదు. సాతాను యొక్క దుష్ట తలంపులు, దుష్ట ఆలోచనలును గూర్చి వాని అభిప్రాయములు, వాని సలహాలను గూర్చి మనము ఆలోచించుచు వాటినే మన సొంత ఆలోచనలుగా అభిప్రాయములుగా చేసుకొనరాదు. సామెత చెప్పినట్లు, "నీ శిరస్సు మీదుగా పక్షులను ఎగరనీయకుండా చేయజాలవు. అయితే ఆ పక్షులు నీ తలపై గూడు కట్టుకొననీయకుండా నీవు నివారింపగలవు."

మన స్వాధీనములో ఉన్నంత వరకు మన మనస్సులలో భక్తి హీనమైన తలంపులు

దేవునికి వ్యతిరేకమైన ఆలోచనల ప్రభావమునకు మన మనస్సులు లోనుకాకుండా మనము కడు జాగ్రత్త తీసుకొని మెలకువగా వుండవలెను. మనము ఎక్కువ సమయము టెలివిజన్ ఎదురుగుండా కూర్చుండుట గాని, ఎక్కువగా పత్రికలు, మ్యాగజైన్స్ చదువుచుండుట గాని చేయునప్పుడు మనము సాతానీయ తలంపులకు ఆహ్వానపు పరదాలను పరుచు వారముగా ఉందుము. విత్తువానిని గూర్చిన ఉపమానము యేసు ప్రభువారు చెప్పిన వెంటనే "మీరు ఏమి వినుచున్నారో జాగ్రత్త పడుడి" అని యేసు వారిని హెచ్చరించెను (మార్కు 4:24). సాతాను తన దుష్ట తలంపులు అను "విత్తనములను" మన మనస్సులలో నాటుటకు మన ఆత్మీయ జీవితములను నాశనము మొనరించు అనేక అబద్ధములను మనము వినునట్టు చేయుటకు చాలా ప్రయాసపడును. ఆ దుష్ట విత్తనములు ఎదిగి మన అంతరంగములో ముండ్లతుప్పలుగాను, గచ్చ పొదలుగాను ఎదిగి మనలోపల ఉన్న దేవుని వాక్యమును ఎదగనీయకుండా అణచి వేయును (మార్కు 4:7, 18-19).

## ఆత్మీయ పోరాటమును గూర్చి పేతురు అభిప్రాయములు

బైబిలు విధానము ప్రకారము సత్యమైన ఆత్మీయ పోరాటమును అపొ.పేతురు సరిగా అర్థము చేసుకొనియున్నాడు. ఆకాశమండల మందున్న ప్రధానులను పట్టణములపై ఆవరించి యున్న దురాత్మ స్థావరములను కూల్చివేయుమని తన పత్రికలలో క్రైస్తవులకు ఆయన ఏ మాత్రమును ఆదేశము ఇచ్చివుండలేదు. వ్యక్తిగత జీవితములపై సాతాను యొక్క దాడులను ప్రతిఘటించి ఎదిరించవలెనని బోధించియున్నాడు,

నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి, మీ విరోధియైన అపవాది గర్జించు సింహము వలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు. లోకము నందున్న మీ సహోదరుల యందు ఈ విధమైన శ్రమలే నెరవేరుచున్నవని ఎరిగి విశ్వాసమందు స్థిరులై వానిని ఎదురించుడి (1 పేతురు 5:8-9).

ఈ పోరాటములో మన స్థానము కేవలము ప్రతిఘటించు వారము మాత్రమే అంతేగాని మనకు మనము మొదట సాతానుపై దండెత్తు వారము కాదు, అని మొదట మనము గ్రహించుకొనవలెను. గర్జించు సింహమువలె సాతాను మనచుట్టు తిరుగుచున్నాడు గాని, మనము అతని చుట్టు తిరుగుచుండుట లేదు. మనలను వెదుకుచు అతడు తిరుచుచున్నాడే గాని అతని వెదకుచు మనము తిరుగుచుండుట లేదు. మనము సాతానుపైబడి పోరాడు వారము కాదుగాని కేవలము అతనిని ఎదిరించి ప్రతిఘటించు వారమై యుండాలి.

రెండవదిగా సాతాను గర్జించు సింహమువలె ఎవనిని మ్రింగుదునా అని తిరుగుచున్నాడు. క్రైస్తవులు అయిన వారిని అతడు ఏలాగు మ్రింగగలడు? సింహము ఒక మనుష్యుని రక్తమాంసములు చీల్చి తినునట్లు సాతాను ఒక క్రైస్తవుని భౌతికముగా తినివేయునా? ఆలాగు కాదు. ఒక క్రైస్తవుని సాతాను అతని విశ్వాసము భ్రష్టమగునట్లు లేక మ్రింగివేయబడునట్లు అబద్ధముల చేత క్రైస్తవుల జీవితములను మోసగించును.

మూడవదిగా సాతానును నిలువరించుటకు మనము విశ్వాసము ద్వారా ప్రతిఘటించ

వలెనని పేతురు బోధించుచున్నాడు. మన పోరాటము భౌతికపరమైనది కాదు. మన చేతుల పిడికిళ్ళు గాలిలో విసరుచు మనము సాతానుతో ముష్టి యుద్ధము చేసెడి వారము కాదు. అబద్ధములతో అతడు మనపై దాడి సలుపును. దేవుని వాక్యము నందు దృఢ విశ్వాసముతో నిలిచి మనము అపవాది మోసములను, అబద్ధములను ఎదిరించుదుము. ఇదియే బైబిలు విధానములో ఆత్మీయముగా పోరాటము సలుపు విధానము.

పేతురును తాను పత్రిక వ్రాయు సమయమందు క్రైస్తవులు చాలా తీవ్రమైన హింసను మధ్య బాధలు, శ్రమలు అనుభవించు చున్నారు. అట్టి దుర్భర పరిస్థితులలో క్రీస్తునందలి విశ్వాసము నుండి కూడా తప్పుకొనుటకు యోచించుచున్నారు. మన జీవితములో అత్యంత వ్యతిరేక పరిస్థితులు సంభవించునప్పుడు మన జీవితములో అబద్ధములతో, మోసములతో, సందేహములతో సాతాను దాడి చేయును. విశ్వాసమందు స్థిరముగా నిలిచియుండు సమయము అదియే. పౌలు తన పత్రికలలో ఉదహరించిన "దుర్దినము అదియే," "మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు ***శక్తిమంతులగునట్లు*** దేవుడిచ్చు సర్వాంగ కవచము ధరించు కొనుడి" (ఎఫెసీ 6:11).

## ఆత్మీయ పోరాటమును గూర్చి అపొ. యాకోబు అభిప్రాయములు

అపొ. యాకోబు తన పత్రికలో ఆత్మీయ పోరాటమును గూర్చి ఆయన ప్రస్థావించియున్నాడు. క్రైస్తవులు మరి ప్రార్థనల వలన దూతల మధ్య జరుగు పోరాటములో ఎవరు గెలుపొందుదురో, ఎవరు ఓడుదురో అను వాటిని క్రైస్తవులు ప్రార్థనలు నిర్ణయించునని తన పత్రికలో ఇతడేమైనా వ్రాసెనా? అతడు ఆ ప్రకారముగా వ్రాయలేదు. వారి పట్టణములను ఆవరించియున్న శరీర ఆత్మలను ప్రేరేపించు దురాత్మలు జాలి కనికరము పుట్టించని దురాత్మలను, త్రాగుబోతుతనమును ప్రేరేపించు దురాత్మల స్థావరములను కూలద్రోయునని తన పత్రికలో యాకోబు వ్రాసెనా? లేదు. ఆయా పట్టణములపై ఆవరించియున్న దురాత్మలను గూర్చి ఆ పట్టణము చారిత్రాత్మక సంగతులను గూర్చి ఆ పట్టణముపై ఎట్టి దురాత్మలు ఆవరించి యున్నవి అను దానిని గూర్చి యాకోబు తన పత్రికలో క్రైస్తవులకు ఏమైనా వ్రాసియుండెనా? లేదు.

యాకోబు లేఖనాధారమైన ఆత్మీయ పోరాటమును గూర్చి అతడు ఈలాగు వ్రాసెను:
కాబట్టి దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి అప్పుడు
వాడు మీ యొద్దనుండి పారిపోవును (యాకోబు 4:7).

మరియొకసారి మనము గమనించిన యెడల క్రైస్తవుల యొక్క స్థానము సాతానును ప్రతిఘటించునదై యున్నది. మనము కేవలము మనలను మనము కాపాడుకొనుటకు ఎదిరించు వారమే గాని మనకు మనమే ముందుగా అతనిపై దాడిచేయుటకు ముందుకు ఉరుకుము వారము కాము. యాకోబు చెప్పినట్లు మనము సాతానును ఎదిరించిన యెడల వాడు పారిపోవును. క్రైస్తవుడైన వాడు సాతాను యొక్క అబద్ధములను నమ్మక, అతని సలహాలను, సూచనలను పాటించక అతని శోధనలకు లొంగిపోక దేవుని యందలి విశ్వాసమందు స్థిరముగా నిలబడిన

యెడల అపవాది అతడు చుట్టును ఏ మాత్రము తిరగజాలడు. మనము గమనించవలసిన విషయమేదనగా యాకోబు, మొదట దేవునికి లోబడవలసినదిగా హెచ్చరించు చున్నాడు. దేవునికి లోబడుట అనగా, దేవుని వాక్యమునకు లోబడుట దేవుని వాక్యమునకు సంపూర్ణముగా లోబడియుండిన యెడల అపవాదిని ఎదిరించుట అనునది చాలా సులభసాధ్యమగును.

## ఆత్మీయ పోరాటమును గూర్చి అపొ. యోహాను అభిప్రాయము

అపొ. యోహాను తన మొదటి పత్రికలో ఈ ఆత్మీయ పోరాటమును గూర్చి వ్రాసియున్నాడు. సాతాను దుర్గములను కూలద్రోయుటను గూర్చి యోహాను మనకేమైనా హెచ్చరికలు వ్రాసెనా? లేదు. క్రైస్తవులలో కోపమును ప్రేరేపించు దురాత్మలను ఎట్లు వెళ్ళగొట్టవలెను అన్న దాని గూర్చి ఏమైనను వ్రాసెనా? లేదు.

పేతురు, యాకోబు వలెనే యోహాను కూడా బైబిలు విధానములోనే ఆత్మీయ పోరాటములను గూర్చి కొన్ని హెచ్చరికలు వ్రాసియున్నాడు,

> ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళియున్నారు. గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని, యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది, యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు. దీనిని బట్టియే దేవుని ఆత్మను మీరెరుగుదురు. క్రీస్తు విరోధి ఆత్మ వచ్చునని మీరు వినిన సంగతి ఇదే, యిదివరకే అది లోకములో ఉన్నది. చిన్న పిల్లలారా, మీరు దేవుని సంబంధులు. మీలో ఉన్నవాడు, లోకములో ఉన్నవాని కంటె గొప్ప వాడు. గనుక మీరు వారిని జయించి యున్నారు. వారు లోకసంబంధులు గనుక లోక సంబంధులైనట్టు, మాటలాడుదురు, లోకము వారి మాట వినును. మనము దేవుని సంబంధులము; దేవుని ఎరిగిన వాడు మన మాట వినును, దేవుని సంబంధి కానివాడు మన మాట వినడు. ఇందువలన మనము సత్య స్వరూపియైన ఆత్మ యేదో, భ్రమపరచు ఆత్మ యేదో తెలిసి కొనుచున్నాము (1 యోహాను 4:1-6).

దేవుని వాక్యము దానికి విరోధముగా ఉన్న సాతాను యొక్క అబద్ధము అను విషయములను యోహాను ఈ భాగమందు సవివరముగా చర్చించునట్లు కనబడుచున్నది. మనము ఆత్మలను వివేచనతో అవి దేవుని వద్దనుండి వచ్చినవో కావో పరీక్షించవలెను. అయితే దేవుని వాక్య సత్యమును ఆధారము చేసుకొని అట్టి పరీక్ష జరుపవలెను. యేసు క్రీస్తు శరీర ధారియై వచ్చెనని ఈ దురాత్మలు అంగీకరించవు. ఎందుకనగా అవి అబద్ధపు ఆత్మలై యున్నవి.

మనము ఈ దురాత్మలపై జయము పొందవలసి యున్నామని యోహాను కూడా వ్రాయుచున్నాడు. వెలుగు రాజ్యము యొక్క సంబంధముగా మనము సాతాను యొక్క

ఆధిపత్యము క్రింద లేము. సాతాను కంటే గొప్పవాడు యేసు మనలో జీవించియున్నాడు. ఎవరిలో క్రీస్తు జీవించి యున్నాడో అట్టి ప్రజలు దయ్యములకు ఏ మాత్రమును భయపడవలసిన అవసరత లేదు.

లోకము దురాత్మలు చెప్పు అబద్ధమును నమ్మునని యోహాను కూడా తెలియ జేయుచున్నాడు. అయితే ఈ దురాత్మలు లోకసంబంధమైన విషయములను మనుష్యులు వినునట్లుగా గట్టి శబ్దముతో మాట్లాడక వారి మనస్సులలోనే దురాలోచనపు విత్తనములు నాటును.

క్రీస్తును వెంబడించు వారముగా మనము దురాత్మలు చెప్పు మోసకరమైనవి, అబద్ధమైన వాటిని వినకూడదు. ఎవరు దేవునిని నమ్మెదురో వారు మన మాటలను విందురు. ఎందుకనగా మనము దేవుని వాక్యమును సత్యమును కలిగియున్నాము.

అబద్ధమును నమ్మునట్లు సాతాను అనేకులను ప్రోద్బలము చేయునని మనము గమనించవలెను. మనము దేవుని సత్యము ఎరిగి నమ్మి యున్నాము గనుక సాతాను మనలను ఓడింప జాలదు. ఆత్మీయ పోరాటమును గూర్చిన విషయమంతయు ఇదియే.

## విశ్వాసమే కీలకమైన విషయం

ఆత్మీయ పోరాటములో జయము పొందుటకు దేవుని వాక్యము కేవలము ఎరిగియుండుట మాత్రమే చాలదు. దేవుడు ఏమి చెప్పెనో దానిని **వాస్తవముగా నమ్ముట** అత్యంత కీలకమైనది. సాతాను ఎదిరించుటలో గాని, దయ్యములను వెడలగొట్టుటలో గాని ఇదెంతో ఆవశ్యము. ఉదా: ఇంత క్రితము మనము చూచిన ఉదాహరణములలో ఒకదానిని తిరిగి ఆలోచించెదము. "తన పన్నెండుగురు శిష్యులకు యేసు అపవిత్రాత్మలను వెడలగొట్టు అధికారమును వారికిచ్చెను" (మత్తయి 10:1). ఏడవ అధ్యాయములో తరువాత మనము కనుగొనునది ఏమనగా మూర్ఛరోగియైన ఒక బాలునిలో నుండి దయ్యమును వారు వెడలగొట్టలేకపోయినారు.[99] వారి అపజయమును చూచి యేసు బహుగా దు:ఖించెను:

> అందుకు యేసు ***విశ్వాసము లేని*** మూర్ఖ తరమువారలారా,మీతో
> నేనెంత కాలము ఉందును. ఎంతవరకు మిమ్మును సహింతును
> (మత్తయి 17:17).

వారియందున్న అవిశ్వాసమును బట్టి యేసు బహుగా రోధించెను. అటు పిమ్మట ఆ దయ్యములను మేము ఎందుకు వెడలగొట్టలేకపోతిమని శిష్యులు ఆయనను అడిగిరి. "మీ అల్పవిశ్వాసము చేతనే" అని యేసు వారికి బదులిచ్చెను (మత్తయి 17:20). విశ్వాసము లేకుండా దయ్యములను వెడలగొట్టు వారి అధికారము ఎందుకును కొరగానిదాయెను.

దేవుని వాక్యమునందు మనకున్న విశ్వాసము చేతనే మనము సాతానును ప్రతిఘటించుట గాని, దయ్యములను వెడలగొట్టుట యందును విజయవంతులము కాము. మనము దేవుడు సెలవిచ్చిన దానిని దృఢముగా నమ్మిన యెడల మనము మాట్లాడునది గాని,

---

[99] మూర్ఛ రోగము అను దాని విషయములో మనము కడు జాగ్రత్త వహించవలెను. అది ఒకనిలో నివసించు దురాత్మ వలన సంభవించును

చేయునది గాని దానికి అనుగుణ్యముగానే ఉండును. కుక్కలు వాటిని చూచి భయపడి పరిగెత్తు వాని వెనుక అవి కూడా భయంకరముగా అరచుచు వానిని తరుముచుండును. ఆలాగుననే సాతాను తనకు భయపడు వారిని మరింత ఎక్కువ భయపెట్టును. నీవు పరిగెత్తిన యెడల సాతాను నిన్ను వెంటాడును. అయితే విశ్వాసము చేత నీవు దృఢముగా నిలిచియున్న యెడల సాతాను నీ యెదుట నిలువలేక పారిపోవును (యాకోబు 4:7).

నిస్సందేహముగా అపొస్తలులు వారి యందలి విశ్వాసలేమి వలన వారు దయ్యములను వెడలగొట్టుటలో అపజయము పొందినట్లు స్పష్టముగా చూడగలము. యేసు ఆజ్ఞాపించగానే ఆ దయ్యము ఆ పిల్లవాని నేలను పడవేసి గిలగిల కొట్టుకొనుచు నురుగు నోటి నుండి కక్కసాగెను (లూకా 9:42) (మార్కు 9:20). ఆ దురాత్మ యేసు ముందు ప్రవర్తించినట్లు ఒకవేళ శిష్యులముందు ప్రవర్తించి ఉన్నట్లయితే, వారి విశ్వాసము భయముగా మారిపోయివుండేది, ఆ దయ్యపు చేష్టలకు వారు నిస్సత్తువుగా ఏమియు చేయలేని దుస్థితిని ఎదుర్కొనేవారు.

అయితే అచంచలమైన పరిపూర్ణ విశ్వాసము గల ప్రభువు తాను ఏమి చూచుచున్నాడో దానిని బట్టి ఏ మాత్రము చలించక దేవుడు చెప్పిన మాటలు, "**వెలుచూపు వలన** కాక విశ్వాసము వలనే మనము నడుచుకొనుచున్నాము" (2 కొరింథీ 5:7). ఈ దేవుని మాట వలన ఆయన దృఢముగా నిలువబడి దయ్యములను వెడలగొట్టెను. (తీతుకు 1:2)లో దేవుడు అబద్ధమాడనేరడు. ఒకవేళ దేవుడు చెప్పిన దానికి మన పరిస్థితులు విరుద్ధముగా కనిపించినను మనము విశ్వాసమందు కదలక స్థిరముగా నిలిచి యుండవలెను.

కొన్ని క్షణములలోనే యేసు ఆ బాలుని దురాత్మ ప్రభావము నుండి విడుదల చేయగలిగెను. అయితే ఆయన విశ్వాసముతో చేయగలిగెను. దయ్యములను వెడలగొట్టు "ఒక ప్రత్యేక కార్యక్రమము" కొరకు ఆయన వేచియుండక తక్షణమే ఆయన అతనిని విడుదల కలుగజేసెను. దేవుడు తనకిచ్చిన అధికారము మీద విశ్వాసము కలిగిన వారము ఒక దయ్యము వెడలగొట్టుటకు గంటల కొలది సమయము వృధా చేయనక్కరలేదు.

మరియు ఆ దయ్యమును వెడలగొట్టుటకు యేసు గొప్ప శబ్దముతో అరచి కేకలు వేయలేదు. సంపూర్ణమైన విశ్వాసము కలిగిన వారు ఏ విధముగాను కేకలు వేయనవసరము లేదు. అనేక పర్యయములు ఆ దయ్యమును బయటకు రా అని గట్టిగా అరచి కేకలు వేయలేదు. ఒకేఒక ఆజ్ఞ చాలును, రెండవ సారి ఆజ్ఞాపించు ఆవశ్యకత లేదు.

## తుది సారాంశము

శిష్యులను సిద్ధము చేయుటకు బోధించు దైవసేవకుడు అతని జీవిత దృష్టాంతము ద్వారాను అతని మాటల ద్వారాను బైబిలు విధానములో ఆత్మీయ పోరాటమును తన శిష్యులకు నేర్పించుట వలన వారు సాతాను తంత్రములను ఎదురు నిలిచి క్రీస్తు ఆజ్ఞలకు విధేయులై నడుచుకొందురు. కేవలము "వట్టి మాటల సిద్ధాంతముల" జోలికి తన శిష్యులు వెళ్ళకుండా బైబిలుకు ఏ మాత్రము సంబంధము లేని ఇతర విధానములలో ఆత్మీయ పోరాటము

చేయకుండా ఆ విధానములను అవలంభించువారు సాతాను చేత మోసగించబడి తప్పుడు విధానములను అనవసరముగా ప్రాముఖ్యతలోనికి తేకుండా సాతానుపై జయము పొందగల స్థితిలోనికి వారిని నడిపించును.

